ANN తెలుగు
Follow: @ANNTELUGU
16-06-2026
# మహా పత్రిక
మంగళవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 165 పేజీలు-08 వెల-రూ.1
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM

## ముగిసిన అమెరికా ఇరాన్ యుద్ధం
### ప్రపంచ వ్యాప్తంగా హర్షం
స్వయంగా ప్రకటించిన ట్రంప్.. నిర్ధారించిన ఇరాన్
ఈనెల 19న ఒప్పందంపై సంతకాలు
స్వాగతించిన ప్రధాని మోదీ
02




**మహా :** పశ్చిమాసియా ఉద్రిక్తతలకు తెర పడింది. అమెరికాఇరాన్ మధ్య చారిత్రక శాంతి ఒప్పందం కుదిరింది. ఈ వారం చివర్లో దీనిపై సంతకాలు జరగనున్నాయి. ప్రస్తుతానికి మాత్రం హోర్ముజ్ జలసంధి ద్వారా వాణిజ్య నౌకల స్వేచ్ఛాయుత రవాణాను పునరుద్ధరించడమే ఈ ఒప్పందం తక్షణ లక్ష్యంగా కనిపిస్తోంది. మూడు నెలలకు పైగా సాగిన యుద్ధం ముగిసిపోవడంతో భారత్ సహా ప్రపంచదేశాలు హర్షం వ్యక్తంచేశాయి. ఈ ఒప్పందాన్ని స్వాగతిస్తూ.. పశ్చిమాసియాలో సుస్థిర శాంతి నెలకొనాలని ఆకాంక్షించాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ ఒప్పందం పూర్తయినట్టు ప్రకటన చేశారు. చరిత్రాత్మక దౌత్య విజయంగా అభివర్ణిస్తూ, హర్మ్యూజ్ జలసంధిని తిరిగి తెరవడానికి, అమెరికా నౌకాదళ దిగ్బంధనాన్ని మిగతా 2వ పేజీలో

టాప్ న్యూస్

## ఇండియా కూటమిలోకి ఓవైసీ ?
- యూపీ ఎన్నికల వేళ కొత్త ట్విస్టులు
- ఎంఐఎంతో పొత్తుపై కాంగ్రెస్ సందిగ్ధం




03

## బీజేపీ ఆడించే తోలుబొమ్మ పవన్ కల్యాణ్
- పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ ఫైర్
- తెలంగాణపై వ్యాఖ్యలకు కాంగ్రెస్ ఆగ్రహం



03

## భారత్ భూభాగం కాదు అదో జీవన విధానం
- ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్



03

## మెట్రో విస్తరణకు
# కిషన్ రెడ్డే విలన్
- తెలంగాణపై కేంద్రం తీవ్రమైన వివక్ష
- మాకు నిధులొద్దు.. ఎన్ఓసీ ఇవ్వండి చాలు.. మేమే కట్టుకుంటాం
- రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీస్తున్న బీజేపీ ఎంపీలు
- కిషన్‌రెడ్డి, కేసీఆర్, కేటీఆర్ కలిసి మెట్రో ఫేజ్-2ను అడ్డుకుంటున్నారు
- అపరిచితుడులో రామాచారిలా మారిన బిజెపి చీఫ్
- మెట్రోకు బ్రేకులపై సీఎం రేవంత్ రెడ్డి




**హైదరాబాద్, మహా :** మెట్రో విస్తరణకు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి విలన్ లా మారారని, తాము ఒప్పించిన దానిని కిషన్ రెడ్డి వెళ్ళి నిలుపుదల చేయించారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫైర్ అయ్యారు. సోమవారం సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలు ప్రజా రవాణా వ్యవస్థను ఎక్కువగా వాడుకోవాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారని , మరి మెట్రో విస్తరణకు మాత్రం కేంద్రం ఎందుకు సహకరించట్లేదని నిలదీశారు. మెట్రో ఫేజ్ 2 ప్రాజెక్టు కేంద్రం వద్దే ఆగి ఉందని విమర్శించారు. ఇటీవల అన్ని రాష్ట్రాలకు అనుమతి ఇచ్చి హైదరాబాద్‌కు ఆపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అహ్మదాబాద్, విశాఖ మెట్రోకు అనుమతి ఇచ్చి హైదరాబాద్‌ను ఆపారని తెలిపారు. తెలంగాణపై కేంద్రం తీవ్రమైన వివక్ష కొనసాగిస్తోందని మండిపడ్డారు. మెట్రో అనుమతుల కోసం కిషన్‌రెడ్డి ఇంటి ముందు ధర్నా చేద్దామా? కిషన్‌రెడ్డి వెనుక ఎవరున్నారో తాను నేరుగా చెప్పట్లేదని అన్నారు. కిషన్‌రెడ్డి కేబినెట్ మంత్రి కాబట్టి ఆయనకే ఎక్కువ బాధ్యత ఉందని హితవు పలికారు. ఫేస్ 1 మెట్రోను మేము కొనుగోలు చేసుకుంటున్నాం. మా డబ్బులే కట్టుకుంటున్నాం. మా గ్యారంటీనే ఇచ్చాం. మా కర్మ బాగలేక ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పోరేషన్ కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ దగ్గర అప్పుకు మొత్తం ఒప్పందాలు, సంతకాలు చేసుకున్నాం. నిధుల విడుదలకు ఈరోజు మిగతా 2వ పేజీలో







# రియల్ మాఫియా బరితెగింపు!
## ఆయుష్మాన్‌భవ్, ఐకానిక్ హౌసింగ్ పేర్లతో రియల్ దందా
- రియల్ మాఫియాకు రెవిన్యూ అండ దండలు
- కనీసం నోటీసుల్లేవు.. డీపీఓ చర్యలు శూన్యం!
- సిర్గాపూర్, మనూర్ తహసీల్దార్ల కనుసన్నల్లోనే అక్రమ రిజిస్ట్రేషన్ల పర్వం
- ఒక్కో దస్తావేజుకు రూ.10 వేల మామూళ్లు!
- నిబంధనలు బేఖాతర్.. అక్రమార్కులకు కాసుల పంట
- ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి కొడుతున్న 'రియల్' కేటుగాళ్లు!

02




నారాయణ్‌ఖేడ్‌లో అక్రమ వెంచర్ల దందాకు తహసీల్దార్ల మౌనమే రక్షణ కవచంగా మారింది. సిర్గాపూర్ మండలం వాంగ్ధల్ గ్రామ సర్వే నెంబర్ 27లో ఆయుష్మాన్‌భవ్ పేరుతో 100 ఎకరాల వ్యవసాయ భూమిలో కనీస అనుమతులు లేకుండా భారీ వెంచర్ తెరపైకి తెచ్చారు. అమాయకులకు ఒకచోట భూమి చూపించి మరోచోట రిజిస్ట్రేషన్ చేసి బురిడీ కొట్టించిన ఈ ముఠా, అది చాలదన్నట్టు ఇప్పుడు మనూర్ మండలం దవూర్ గ్రామ సర్వే నెంబర్ 92లో ఐకానిక్ హౌసింగ్ ఫార్మ్స్ పేరుతో 7 ఎకరాల్లో డిటిసిపి అనుమతులకు తిలోదకాలు ఇచ్చి అక్రమ నిర్మాణాలకు తెరలేపింది.
ఆయుష్మాన్‌భవ్‌పై అప్పట్లోనే అక్రమ రిజిస్ట్రేషన్ల ఆరోపణలు వచ్చినా సిర్గాపూర్ తహసీల్దార్ ఎందుకు నోరు మెదపలేదు? ఐకానిక్ పేరుతో మళ్లీ అదే తరహా మోసం మొదలైతే మనూర్ తహసీల్దార్ చర్యలు ఎందుకు తీసుకోలేదు? పాత వెంచర్‌లో భాదితుల గోడు ఇంకా ఆరకముందే కొత్త ముసుగులో అమాయక కష్టజీవుల జేబులకు చిల్లు పెట్టే ఈ అక్రమాలకు అధికారులు వత్తాసు పలుకుతున్నారా అనే ప్రశ్నలు ఇప్పుడు ఉత్పన్నమవుతున్నాయి.

### ఈ నెల 18 నుంచి
## విస్తారంగా వర్షాలు
ఉత్తర, ఈశాన్య తెలంగాణ జిల్లాల్లో భారీ వర్షా లకు అవకాశం
మరో రెండు రోజులు ఉత్తరాది న వడగాల్పుల తీవ్రత
02



## లోకేశ్ దంపతుల మహా రుద్రాభిషేకం
ఏపీ ప్రజలు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ప్రార్థనలు
02



## ఈనెల 25 నుంచి రాష్ట్రంలో ఎస్ ఐ ఆర్ షురూ
సీఈవో సుదర్శన్ రెడ్డి కీలక ప్రకటన
02

ఇండియా టుడే టూరిజం అవార్డ్స్ 2026లో
## తెలంగాణకు ప్రతిష్టాత్మక గౌరవం
03

## నెగిటివ్ కామెంట్లు బాధ కలిగిస్తున్నాయి
జ్ఞానేశ్వరి తల్లి ఆవేదన
02

## ఓట్ల చోరీ కాదు కాంగ్రెస్ నేతల మెదడు చోరీ
- ఎస్ఐఆర్ ప్రక్రియపై అబద్ధాల ప్రచారం ఆపండి
- బంగ్లాదేశీ, రోహింగ్యాల దొంగ ఓట్లు ఎగిరిపోతాయనే ఏడుపు
- కాంగ్రెస్, బీఆర్ఎస్ లపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ఆగ్రహం

02



## రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్
### సీఎం రేవంత్ ప్రతిష్టాత్మక పథకం ప్రారంభం



**హైదరాబాద్, మహా :** రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్, మిల్క్ పథకం ప్రారంభమైంది. ఈ అల్పాహారం పథకం ప్రీప్రైమరీ నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు వర్తిస్తుంది. రోజూ అల్పాహారంగా పాలు/రాగి మాల్ట్ ఇస్తున్నామని, సోమవారందోసె చట్నీ / చపాతీ కూరపాలు, మంగళవారం మిల్లెట్ ఇడ్లీ (2) సాంబార్ మరియు రాగి జావ, బుధవారం పూరీ (2) ఆలూ కుర్మా పాలు, గురువారం మిల్లెట్ ఇడ్లీ (2) సాంబార్రాగి జావ, శుక్రవారం మిల్లెట్ ఉప్మా / పొంగల్ చట్నీ పాలు, శనివారం బొండా (2) చట్నీరాగి జావ, సోమ, బుధ, శుక్రవారాలు - పాలుమంగళ, గురు, శనివారాలు - రాగి జావ ఉంటాయని అధికారులు తెలిపారు. తొలిరోజు బ్రేక్ ఫాస్ట్ తో విద్యార్థుల్లో తల్లితండ్రుల్లో హర్షం వ్యక్తమైంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ పథకాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రారంభించారు.



# రియల్ మాఫియా బరితెగింపు!

**స్పెషల్ టాస్క్ ఫోర్స్ :** సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ రెవెన్యూ డివిజన్ సిర్గాపూర్, మనూర్ మండలాల పరిధిలో 'శ్రీకారం ఇన్ఫ్రా డెవెలపర్స్' 'ఆయుష్మాన్‌భవ' ఐకానిక్ హౌసింగ్' సంస్థల పేరిట సాగుతున్న అక్రమ లేఅవుట్ల దందాపై పత్రికా ముఖంగా ఇన్ని ఆధారాలు బయటపెట్టినా.. జిల్లా పంచాయతీ అధికారి (డి పి ఓ) చర్యలు శూన్యంగా మారడం వెనుక అసలు కథ ఇప్పుడిప్పుడే వెలుగులోకి వస్తోంది. నిబంధనల ప్రకారం అక్రమ వెంచర్లకు కనీసం నోటీసులు ఇవ్వడానికి కూడా జిల్లా పంచాయతీ యంత్రాంగం వెనకాడుతుండటం సర్వత్రా చర్చనీయాంశమైంది. ఇక క్షేత్రస్థాయిలో పంచాయతీ కార్యదర్శులు ఉన్నట్లా? లేనట్లా? అనే అనుమానాలు కలగక మానవు. ఎందుకంటే, ఉన్నతాధికారుల అండదండలు, స్థానిక అధికారుల 'మామూళ్ల' మత్తులోనే ఈ అక్రమ సామ్రాజ్యం మూడు పువ్వులు ఆరు కాయలుగా విస్తరిస్తోంది.

**నిబంధనలకు పాతర**

నిబంధనల ప్రకారం లేఅవుట్ అనుమతి (డీటీసీపి) లేకుండా ప్లాట్ల రూపంలో రిజిస్ట్రేషన్లు చేయడం చట్టవిరుద్ధం. కానీ, ఇక్కడే అసలు నిబంధనలకు పాతర వేశారు. ఓపెన్ ప్లాట్లను వ్యవసాయ భూమిగా చూపిస్తూ, "గుంటల" లెక్కన పత్రాలు సృష్టించి యథేచ్ఛగా రిజిస్ట్రేషన్ల పర్వాన్ని కొనసాగిస్తున్నారు. ఈ దందా ఇంత జోరుగా సాగడం వెనుక సిర్గాపూర్ తహసీల్దార్ కిరణ్, మనూర్ తహసీల్దార్ విష్ణు సాగర్, మరో కీలక రెవెన్యూ ఉద్యోగి ఖాజా కనుసన్నల్లోనే జరుగుతున్నాయని ఆరోపణలు క్షేత్రస్థాయి నుండి వినిపిస్తున్నాయి. చట్టంలోని లొసుగులను ఆసరాగా చేసుకుని, వ్యవసాయ భూమిని గజాల లెక్కన ప్లాట్లు చేసి విక్రయిస్తున్నారు. నిబంధనల ప్రకారం కనీస విస్తీర్ణం ఉండాలనే నిబంధన ఉన్నప్పటికీ, ఒక గుంట, రెండు గుంటల భూమిని కూడా రిజిస్ట్రేషన్ చేస్తుండటం గమనార్హం.



### ఒక్కో రిజిస్ట్రేషన్‌కు ₹10 వేల నజరానా?

క్షేత్రస్థాయిలో నమ్మదగిన సమాచారం ప్రకారం.. అనుమతులు లేని ఈ వెంచర్లలో జరిగే ప్రతి అక్రమ రిజిస్ట్రేషన్‌కు గాను సదరు అధికారులకు ఒక్కో దస్తావేజుకు అక్షరాలా ₹10,000 చొప్పున ముడుపులు ముట్టచెపుతున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ ఖజానాకు చెందాల్సిన భారీ ఆదాయానికి గండి కొడుతూ, తమ సొంత జేబులు నింపుకోవడానికే ఈ అధికారులు ప్రాధాన్యత ఇస్తున్నారనేది బహిరంగ రహస్యం.







### ఉన్నతాధికారులు స్పందించే వరకు పోరాటం ఆగదు!

కంటిముందే అక్రమ రిజిస్ట్రేషన్లు సాగుతున్నా, నోటీసులు ఇవ్వడానికి కూడా చేతకాని స్థితిలో డీపీఓ కార్యాలయం ఉందంటే.. వ్యవస్థ ఎంతలా భ్రష్టు పట్టిందో అర్థం చేసుకోవచ్చునని, సిర్గాపూర్, మనూర్ మండలాల్లో జరిగిన ప్రతి గుంట రిజిస్ట్రేషన్‌పై ఉన్నత స్థాయి విచారణ జరపాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.అక్రమాలకు కొమ్ముకాస్తున్న తహసీల్దార్ కిరణ్, విష్ణు సాగర్, ఉద్యోగి ఖాజాలపై తక్షణమే విచారణ జరిపి సస్పెండ్ చేయాలని, ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టిన సదరు రియల్ ఎస్టేట్ సంస్థల నుండి భారీ జరిమానాతో కూడిన రికవరీ చేయాలని, అమాయకులను ముంచుతూ, ప్రభుత్వ ఖజానాను లూటీ చేస్తున్న ఈ రియల్ మాఫియాపై జిల్లా కలెక్టర్ స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని లేని యెడల బాధితుల పక్షాన ఏ ఎన్ ఎన్ 'మహా పత్రిక' మరిన్ని సాక్ష్యాలను ప్రజల ముందు ఉంచి ప్రజల పక్షాన పోరాటం సాగిస్తుంది.

**ప్రభుత్వ ఖజానాకు 'గండి'.. బాధ్యులెవరు?**

లేఅవుట్ ఫీజులు, నాన్‌అగ్రికల్చర్ కన్వర్షన్ (నాలా) ట్యాక్సులు చెల్లించకుండా, గుంటల పేరుతో రిజిస్ట్రేషన్లు కానిచ్చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి కోట్లాది రూపాయల గండి కొడుతున్నారు. నిరుపేదలు, అమాయకుల రక్తాన్ని పిండి వసూలు చేసిన సొమ్ములో సగం వాటా ఈ లంచగొండి అధికారుల పరం అవుతుంటే, జిల్లా ఉన్నతాధికారులు ఎందుకు మౌనం వహించారో సమాధానం చెప్పాలని స్థానికులు పేర్కొంటున్నారు.






# ముగిసిన అమెరికా ఇరాన్ యుద్ధం

(మొదటి పేజీ తరువాయి )

ముగించడానికి ఈ ఒప్పందం వీలు కల్పిస్తుందని తెలిపారు. "ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్‌తో ఒప్పందం ఇప్పుడు పూర్తయింది. అందరికీ అభినందనలు! హార్మూజ్ జలసంధిని టోల్ లేకుండా తిరిగి తెరిచేందుకు నేను పూర్తి అధికారం ఇస్తున్నాను. అదే సమయంలో అమెరికా నౌకా దిగ్బంధనాన్ని తక్షణమే తొలగించాలని ఆదేశిస్తున్నాను. ప్రపంచ నౌకలారా, మీ ఇంజిన్లు ప్రారంభించండి" అని ట్రంప్ తన 'ట్రూత్ సోషల్' ఖాతాలో పోస్ట్ చేశారు. ట్రంప్ ఈ ఒప్పందాన్ని చారిత్రక విజయంగా అభివర్ణించారు. "ఈ గొప్ప ఒప్పందం మొత్తం ప్రాంతానికి శాంతి, భద్రతను తెస్తుంది. గతంలో ఎందరో అధ్యక్షులు ఇరాన్‌తో శాంతి నెలకొల్పేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు. ఈ ప్రాంత నాయకులు, నిజమైన శాంతిని సాధించడంలో సహాయపడగల అధ్యక్షుడిని మొదటిసారి కనుగొన్నారు" అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ ఒప్పందంపై శుక్రవారం అధికారికంగా సంతకాలు జరుగుతాయని, జలమార్గంలోని మైన్‌లను తొలగించే ప్రక్రియతో పాటే జలసంధిని తిరిగి తెరుస్తారని ట్రంప్ తెలిపారు.

**స్వాగతించిన ప్రధాని మోదీ**

ఈ ఒప్పందంపై ప్రధాని మోదీ 'ఎక్స్' వేదికగా స్పందించారు. "ప్రపంచవ్యాప్తంగా తీవ్ర ఆర్థిక అంతరాయానికి, అనేక దేశాల్లో ప్రాణనష్టానికి కారణమైన పశ్చిమాసియా వివాదానికి ముగింపు పలికేందుకు అమెరికా, ఇరాన్ మధ్య కుదిరిన అవగాహనను నేను స్వాగతిస్తున్నాను. ఈ ఒప్పందం అమలుతో ఆ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం పునరుద్ధరించడంతో పాటు నౌకాయాన స్వేచ్ఛ, వాణిజ్యం సజావుగా సాగుతాయని భారత్ ఆశిస్తోంది. మిగిలిన అంశాలపై కూడా చర్చలు జరిగి, సుస్థిరమైన తుది ఒప్పందం కుదురుతుందని ఎదురుచూస్తున్నాం" అని పేర్కొన్నారు.




# మెట్రో విస్తరణకు కిషన్ రెడ్డే విలన్

( మొదటి పేజీ తరువాయి )

చివరి రోజు. మరి ఈరోజు విడుదల చేస్తావా? చెయ్యవా? కిషన్‌రెడ్డి. 5 గంటల వరకు బ్యాంక్ ఉంటుంది. ఇది మొదటిది. రెండవది ఫేస్2 కి 122 కిలోమీటర్లకు విస్తరణకు కేంద్ర ప్రభుత్వం భాగస్వామ్యం తీసుకుంటదా? తీసుకోదా? ఒకవేళ తీసుకోకపోతే మాకు ఎల్ఓసీ ఇవ్వండి. హెచ్‌ఎమ్ఆర్‌ఎల్ నుంచి మేమే సేమ్ అదే ఐఆర్‌ఎఫ్ నుంచి సేమ్ లోన్ తెచ్చుకుని సేమ్ మెట్రో విస్తరించుకుని ప్రజలకు మెట్రోను అంకితం చేస్తాం. ఇంతకుమించి నాకు నీకు గట్టు పంచాయితీ ఏ పంచాయితీ లేదు. మీ పట్ల నాకు గౌరవం ఉంది" అని సీఎం అన్నారు. తాను ఏమీ అనకపోయినా బిజెపి చీఫ్ రామచందర్ రావు అపరిచితుడులో రామాచారిలా తనపై విమర్శలు చేస్తున్నారన్నారు.

**గత ప్రభుత్వంలో నిర్లక్ష్యం**

మాజీ సీఎం కేసీఆర్ పాలనలో ప్రజలు ప్రయాణించాల్సిన ప్రాంతాల్లో మెట్రో విస్తరణ జరగలేదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. హైదరాబాద్‌కు అంతర్జాతీయ సౌకర్యాలతో రవాణా సదుపాయం ఉండాలనే ఆలోచనతో గతంలో దేశంలోనే కీలకమైన హైదరాబాద్ మెట్రో రైలు నిర్మాణం గురించి చర్చ జరిగిందని గుర్తు చేశారు. రూ.15 వేల కోట్లతో పూర్తి కావాల్సిన మెట్రో రైలు నిర్మాణం రూ.22 వేల కోట్లకు పెరిగిందని తెలిపారు. మెట్రో రైలు నిర్మాణంలో హైదరాబాద్ కంటే ఇతర నగరాలు ముందుగా ఉన్నాయని పేర్కొన్నారు. సెకండ్ ఫేజ్‌లో మెట్రో విస్తరణ అనుమతి కోసం కేంద్రంపై ఒత్తిడి తెచ్చామని, ప్రతి ఏడాది రూ.400 కోట్ల నష్టం వస్తుందని ఎల్‌అండ్‌టీ చెప్పిందని, ఆర్థిక ఇబ్బందుల వల్ల మెట్రో విస్తరణకు ఎల్‌అండ్‌టీ ఒప్పుకోలేదని వివరించారు. రూ.30 వేల కోట్ల ఎల్‌అండ్‌టీ ఆస్తులను రూ.15 వేల కోట్లకు తమ ప్రభుత్వం కొనుగోలు చేసిందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మెట్రో నిర్మాణానికి కిలోమీటర్‌కు రూ.350 కోట్లు ఖర్చు అవుతుందని, ఎల్‌అండ్‌టీకి రూ.13,600 కోట్ల అప్పు ఉందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ అధికారులు భాగస్వాములుగా ఉన్నారని, తక్కువ వడ్డీకి రుణాలు తీసుకోవాలని ప్రభుత్వం ఆలోచన చేస్తోందని పేర్కొన్నారు. గతంలో కేసీఆర్‌కు రూ.లక్షా 52 వేల కోట్లు అప్పుగా ఇచ్చారని, గతంలో కేసీఆర్‌కు ఆర్‌ఈసీ రూ.1.61 లక్షల కోట్లు అప్పులు ఇచ్చిందని, ఎలాంటి గ్యారెంటీ లేకుండా రూ.3.15 లక్షల కోట్లు అప్పుగా ఇచ్చారని తెలిపారు.

**కిషన్ రెడ్డి గురుదక్షిణ**

గతంలో కిషన్‌రెడ్డిని కేసీఆర్ ఏమని తిట్టారో ప్రజలందరికీ తెలుసునని సీఎం తెలిపారు. ఐఆర్‌ఎఫ్‌సీ నుంచి రుణ నిధులు ఇంకా ఎందుకు మంజూరు కాలేదని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ హామీ ఇచ్చినా కూడా లోన్ డబ్బు ట్రాన్స్‌ఫర్ కాలేదని, ఐఆర్‌ఎఫ్‌సీ లోన్ మంజూరు చేయకుండా కిషన్‌రెడ్డి అడ్డుకున్నారని ఆరోపించారు. తెలంగాణ నుంచి కేంద్ర కేబినెట్‌లో ఉన్న కిషన్‌రెడ్డికి బాధ్యత లేదా? అని నిలదీశారు. కిషన్‌రెడ్డి, కేసీఆర్, కేటీఆర్ కలిసి మెట్రో ఫేజ్ 2ను అడ్డుకుంటున్నారని ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి కేసీఆర్ సహకరించినందుకు కిషన్‌రెడ్డి గురుదక్షిణ చెల్లిస్తున్నారని విమర్శించారు.

**మోదీ రాజీనామా చేస్తే మేము రెడీ**

బీజేపీ ఇచ్చిన హామీలు నెరవేర్చనందుకు ప్రధాని మోదీ రాజీనామా చేస్తారా? అని సీఎం నిలదీశారు. ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి నెరవేర్చలేదని, ప్రతి ఒక్కరి ఖాతాల్లో రూ.15 లక్షలు వేస్తామని మోదీ అన్నారని గుర్తు చేశారు. హైదరాబాద్‌కు 2023లోనే ట్రిపుల్ ఆర్ ప్రకటించారని, ఇంకా సాకారం కాలేదని తెలిపారు. అన్నింటికి బాధ్యత వహిస్తూ మోదీ రాజీనామా చేస్తే తాము కూడా చేస్తామని ప్రకటించారు. సమావేశంలో మంత్రులు శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, వాకిటి శ్రీహరి, అజహరుద్దీన్, సీతక్క, ఎంపీలు వంశీ నరేందర్ రెడ్డి, అనిల్ యాదవ్, చామల కిరణ్, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు బల్మూరి వెంకట్, వీరేశం, బీర్ల ఐలయ్య, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 25 నుంచి రాష్ట్రంలో ఎస్ ఐ ఆర్ షురూ

### సీఈవో సుదర్శన్ రెడ్డి కీలక ప్రకటన

**హైదరాబాద్, మహా :** తెలంగాణలో ఈ నెల 25 నుంచి ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ సర్వే చేపట్టనున్నట్లుగా రాష్ట్ర ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి ప్రకటించారు. ఈ క్రమంలోనే అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ నెల 15 నుంచి 24 వరకు మొత్తం మూడు దశలుగా కార్యక్రమాలు చేపడుతామని అన్నారు. ఫస్ట్ ఫేజ్‌లో భాగంగా ఎస్ ఐ ఆర్ సర్వేను ఎలా నిర్వహించాలి.. ఏ అధికారికి ఎలాంటి బాధ్యతలు అప్పగించాలి.. బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లకు పని విభజనపై జిల్లా ఎన్నికల అధికారుల నేతృత్వంలో పక్కా ప్లాన్ తయారుచేయనున్నారు. ఈ నెల 25 నుంచి జులై 24 వరకు ప్రతి గ్రామంలోని బీఎల్‌వోలు ఎస్ ఐ ఆర్ సర్వేను గడపగడపకు నిర్వహించనున్నారు. జులై 31న ఓటర్ డ్రాఫ్ట్ జాబితాను ప్రదర్శించి.. జులై 31 నుంచి ఆగస్టు 30 వరకు ఫిర్యాదులు, అభ్యంతరాల స్వీకరిస్తారు. ఏమైనా సందేహాలు ఉన్న ఓటర్లకు నోటీసులు ఇచ్చి పున: పరిశీలన చేపట్టి సరిచేస్తారు. చివరగా అక్టోబరు 1న ఓటరు తుది జాబితాను గ్రామ పంచాయతీల్లో ప్రదర్శించనున్నారు.

# ఈ నెల 18 నుంచి విస్తారంగా వర్షాలు



**హైదరాబాద్:మహా :** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా వాతావరణంలో భారీ మార్పులు చోటుచేసుకోనున్నాయి. ఈ నెల 18వ తేదీ నుంచి 24వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారికంగా ప్రకటించింది. ముఖ్యంగా ఉత్తర, ఈశాన్య తెలంగాణ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు హెచ్చరించారు. పశ్చిమ బంగాళాఖాతంలో ద్రోణి, దాని ప్రభావంతో అల్పపీడనం ఏర్పడేందుకు అనుకూల పరిస్థితులు ఉన్నాయని వాతావరణ శాఖ స్పష్టం చేసింది. ప్రస్తుతానికి నైరుతి రుతుపవనాలు కొంత మందకొడిగా ముందుకు సాగుతుండటం వల్ల, అవి రాష్ట్రమంతటా సంపూర్ణంగా విస్తరించడానికి మరో నాలుగు నుంచి ఐదు రోజుల సమయం పట్టే అవకాశం ఉందని వెల్లడించింది. రాష్ట్రంలో ప్రస్తుతం ప్రాంతాలవారీగా భిన్నమైన వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. ఉత్తర భారతదేశం నుంచి తెలంగాణ వైపు వస్తున్న పొడి వేడిగాలుల ప్రభావం ఇంకా కొనసాగుతుండటంతో, ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఎండల తీవ్రతతో పాటు వడగాల్పులు వీస్తున్నాయి. ఇవాళ, రేపు ఉమ్మడి ఆదిలాబాద్‌తో పాటు కరీంనగర్, పెద్దపల్లి, నిజామాబాద్ జిల్లాల్లో హీట్ వేవ్ తీవ్రంగా ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు. మరోవైపు, కక్యూములోనింబస్ మేఘాల ప్రభావం వల్ల దక్షిణ, మధ్య తెలంగాణ జిల్లాల్లో అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. జూన్ 1 నుంచి ఇప్పటివరకు రాష్ట్రంలో 49.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, సాధారణ వర్షపాతం 54.9 మిల్లీమీటర్లతో పోలిస్తే ప్రస్తుతం సుమారు 10 శాతం మేర వర్షపాతంలో లోటు కొనసాగుతోంది. అయితే ఈ నెల 18 నుంచి కురిసే ముమ్మర వర్షాలతో ఈ లోటు భర్తీ అయ్యే అవకాశం ఉంది.

## నెగిటివ్ కామెంట్లు బాధ కలిగిస్తున్నాయి

### : జ్ఞానేశ్వరి తల్లి ఆవేదన

**కాకినాడ, మహా** కాకినాడ జిల్లా తుని మండలం సీహెచ్ అగ్రహారంలో అదృశ్యమైన రెండేళ్ల చిన్నారి జ్ఞానేశ్వరి ఆచూకీ 10 రోజులైనా ఇంకా లభించలేదు. అయితే చిన్నారి అదృశ్యంపై కొంత మంది పెడుతున్న కామెంట్లు తమను ఎంతో బాధిస్తున్నాయని జ్ఞానేశ్వరి తల్లి భవానీ ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నారి క్షేమంగా తిరిగి వస్తుందని ఆశతో ఉన్నామని, ఆ ధైర్యాన్ని కూడా కోల్పోనివ్వద్దని ఆమె కోరారు. మరోవైపు చిన్నారి ఆచూకీ కోసం పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది.

# ఓట్ల చోరీ కాదు కాంగ్రెస్ నేతల మెదడు చోరీ

**హైదరాబాద్, మహా :** ఓటరు జాబితా ప్రక్షాళన కోసం కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన సర్ ప్రక్రియపై కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలు రాజకీయ స్వార్థంతో బురదజల్లుతున్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ అనేది ప్రధాని నరేంద్ర మోదీ లేదా కేంద్ర ప్రభుత్వమో సొంతంగా తెచ్చిన కార్యక్రమం కాదని, ఇది రాజ్యాంగబద్ధంగా ఎన్నికల సంఘం నిర్వహించే నిరంతర ప్రక్రియ అని స్పష్టం చేశారు. "ఓటు చోరీ" అంటూ కాంగ్రెస్ నేతలు మాట్లాడుతుంటే వారి 'మెదడు చోరీ' అయిందనిపిస్తోందని ఎద్దేవా చేశారు. దేశంలో ఇప్పటివరకు 12 సార్లు ఈ ప్రక్రియ విజయవంతంగా జరిగిందని గుర్తుచేశారు. కొత్త ఓటర్ల నమోదు, చనిపోయిన వారి పేర్ల తొలగింపు, చిరునామాలు మారిన వారి వివరాల సవరణ కోసమే ఎస్ఐఆర్ నిర్వహిస్తారన్నారు. 1951 నుండి 2002 వరకు కాంగ్రెస్ హయాంలోనే అనేకసార్లు ఎస్ఐఆర్ జరిగితే అప్పుడు లేని అభ్యంతరాలు ఇప్పుడెందుకు వస్తున్నాయని ప్రశ్నించారు. బాధ్యతాయుతమైన ప్రతిపక్షంగా నాడు తాము ఎన్నికల సంఘం నిర్ణయాన్ని స్వాగతించామని, కానీ నేడు కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒకే స్వరంతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ కుట్రపూరిత ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. ఎస్ఐఆర్ వల్లే బెంగాల్‌లో బీజేపీ గెలిచిందని మేధావులమని చెప్పుకునే కొందరు కాంగ్రెస్ నేతలు విమర్శించడం హాస్యాస్పదమన్నారు.



మరి అదే ఎస్ఐఆర్ జరిగిన కేరళంలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ గెలిచినప్పుడు ఎస్ఐఆర్ గుర్తుకు రాలేదా అని నిలదీశారు. రాజకీయాల్లో గెలుపోటములు ప్రజా తీర్పుపై ఆధారపడి ఉంటాయన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియ రాజ్యాంగబద్ధమైనదని, రిప్రజెంటేషన్ ఆఫ్ పీపుల్స్ యాక్ట్ నిబంధనల ప్రకారమే జరుగుతోందని సుప్రీంకోర్టు సైతం రిట్ పిటిషన్ నెం. 640/2025 లో 124 పేజీల స్పష్టమైన తీర్పునిచ్చిందని గుర్తుచేశారు. నిబంధన 21ఏ ప్రకారం అర్హత లేని ఓట్లను తొలగించే పూర్తి అధికారం ఎన్నికల సంఘానికి ఉందని కోర్టు స్పష్టం చేసిందని పేర్కొన్నారు. దేశ సరిహద్దులైన బిహార్, పశ్చిమ బెంగాల్‌తో పాటు హైదరాబాద్ ఓల్డ్ సిటీలో కూడా రోహింగ్యాలు, బంగ్లాదేశీయులు, పాకిస్తానీ అక్రమ చొరబాటుదారులు స్థానికంగా కొన్ని రాజకీయ పార్టీల మద్దతుతో దొంగ ఆధార్ కార్డులు, రేషన్ కార్డులు సంపాదించి ఓటర్లుగా నమోదవుతున్నారని రాంచందర్ రావు ఆందోళన వ్యక్తం చేశారు. ఓల్డ్ సిటీలో ఒక్కో ఇంట్లో 200 దొంగ ఓట్లు ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. హైదరాబాద్‌లో దాదాపు 5 వేల నుండి 10 వేల మంది పాకిస్తానీయులు చట్టవిరుద్ధంగా ఓవర్ స్టేయింగ్ చేస్తున్నారని, వారికి ఓటు హక్కు కల్పించాలా అని కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎంలను నిలదీశారు. భారత రాజ్యాంగం ప్రకారం కేవలం భారత పౌరుడికి మాత్రమే ఓటు హక్కు ఉంటుందని స్పష్టం చేశారు. దొంగ ఓట్లను ఏరివేయడమే ఎస్ఐఆర్ లక్ష్యమని, అర్హులైన ఏ ఒక్క పౌరుడి ఓటూ పోదని హామీ ఇచ్చారు. 1980 లోనే సోనియా గాంధీ భారత పౌరసత్వం పొందకముందే ఇందిరా గాంధీ గారి సఫదర్‌జంగ్ రోడ్ నివాసంలో (పోలింగ్ స్టేషన్ 145, సీరియల్ నెం. 388) ఓటరుగా నమోదయ్యారని రికార్డులను ఉటంకించారు. కాంగ్రెస్ చరిత్రే ఓట్ల చోరీ, సీట్ల చోరీలతో కూడుకున్నదన్నారు. నాడు కాంగ్రెస్ అంతర్గత ఎన్నికల్లో సర్దార్ పటేల్‌కు 28 ఓట్లు, నెహ్రూకు కేవలం 2 ఓట్లు వస్తే నెహ్రూను పీఎంను చేయడం ఓటు చోరీ కాదా అని ప్రశ్నించారు. 1975లో అలహాబాద్ హైకోర్టు తీర్పునకు వ్యతిరేకంగా దేశంలో ఎమర్జెన్సీ విధించి రాజ్యాంగాన్ని చోరీ చేసిన చరిత్ర కాంగ్రెస్‌ది కాదా అని నిలదీశారు.గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొందరు రాజ్యాంగబద్ధమైన ఎన్నికల కమిషన్ కు చెందినవారికి రిటైర్మెంట్ తర్వాత పద్మ అవార్డులు, రాజ్యసభ సీట్లు ఇచ్చి రాజ్యాంగ సంస్థల స్వతంత్రతను దెబ్బతీసిందని ఆరోపించారు. బోగస్ ఓట్లతో గెలిచే అలవాటున్న కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎంలు.. ఇప్పుడు ఎస్ఐఆర్ వల్ల తమ దొంగ ఓట్లు ఎగిరిపోతాయనే భయంతో ఏడుస్తున్నాయన్నారు.

# లోకేశ్ దంపతుల మహా రుద్రాభిషేకం

### ఏపీ ప్రజలు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ప్రార్థనలు

**హైదరాబాద్, మహా :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్, ఆయన సతీమణి నారా బ్రాహ్మణి దంపతులు పరమశివుడిని అత్యంత భక్తిశ్రద్ధలతో ఆరాధించారు. నవ్యాంధ్రప్రదేశ్ రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధించి నిరంతరం పురోగమించాలని, రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సిరిసంపదలతో ఎల్లప్పుడూ సుభిక్షంగా వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ సోమవారం వారు హైదరాబాద్ జూబ్లీ హిల్స్‌లోని తమ నివాసంలో మహాశివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరమశివుడికి అత్యంత ప్రీతిపాత్రమైన సోమవారం రోజున మంత్రి దంపతులు ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని అత్యంత భక్తి ప్రపత్తులతో చేపట్టారు. ప్రముఖ వేద పండితుల వేద మంత్రోచ్చారణలు, మార్గదర్శకత్వంలో 'మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం' మహాక్రతువును శాస్త్రోక్తంగా జరిపించారు. లోకకల్యాణార్థం, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రజల సంక్షేమం కోరుతూ భోళాశంకరుడి కరుణాకటాక్షాలు రాష్ట్రంపై, ప్రజలపై నిండుగా ఉండాలని వారు ఈ సందర్భంగా మనసారా ప్రార్థించారు. సుదీర్ఘంగా సాగిన ఈ రుద్రాభిషేక పూజాదికాల అనంతరం లోకేశ్, బ్రాహ్మణి దంపతులు స్వామివారికి నిర్వహించిన ప్రత్యేక మహా హారతి కార్యక్రమంలో భక్తిపారవశ్యంతో పాల్గొన్నారు. పూజా కార్యక్రమాల ముగింపు అనంతరం వేద పండితులు మంత్రి దంపతులకు వేదాశీర్వచనం అందజేసి, స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. రాష్ట్ర శ్రేయస్సును కాంక్షిస్తూ మంత్రి దంపతులు స్వయంగా ఈ మహా పూజను నిర్వహించడం ప్రాధాన్యత సంతరించుకుంది. కాగా, ఈ అత్యంత పవిత్రమైన రుద్రాభిషేక క్రతువుకు సంబంధించిన ఫోటోలను మంత్రి నారా లోకేశ్ తన అధికారిక సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలతో పంచుకున్నారు.





# ఇండియా టుడే టూరిజం అవార్డ్స్ 2026లో తెలంగాణకు ప్రతిష్ఠాత్మక గౌరవం

**హైదరాబాద్. మహా :** హైదరాబాద్ సిటీ ఇండియా టుడే టూరిజం అవార్డ్స్-2026లో ప్రతిష్ఠాత్మకమైన నేషనల్ క్యులినరీ డెస్టినేషన్ అవార్డును అందుకుంది. గోవాలో సోమవారం నిర్వహించిన ఇండియా టుడే టూరిజం సమ్మిట్ సందర్భంగా ఈ అవార్డును తెలంగాణ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, కేంద్ర పర్యాటక మరియు సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ చేతుల మీదుగా స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ప్రమోద్ సావంత్, అరుణ్ పూరీ, రాజ్ చెంగప్పతో పాటు దేశవ్యాప్తంగా పర్యాటక మంత్రులు, పరిశ్రమ ప్రతినిధులు, పర్యాటక రంగ ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ, ఈ అవార్డు హైదరాబాద్‌కు ఉన్న గొప్ప ఆహార వారసత్వానికి, అలాగే తెలంగాణ పర్యాటక రంగం సాధిస్తున్న పురోగతికి నిదర్శనమని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన హైదరాబాద్ బిర్యానీ, ఇరానీ చాయ్, అలాగే సంప్రదాయ తెలంగాణ వంటకాలు అంతర్జాతీయ గుర్తింపు పొందాయని, ఇవి దేశ విదేశాల నుంచి పర్యాటకులను ఆకర్షిస్తున్నాయని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం వారసత్వ కట్టడాలు, సంస్కృతి, ఆతిథ్య సత్కారం, ప్రత్యేక వంటకాల సంప్రదాయాలతో దేశంలో ప్రముఖ పర్యాటక గమ్యస్థానంగా ఎదుగుతోందని ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం హెరిటేజ్ టూరిజం, ఈకో టూరిజం, ఆధ్యాత్మిక పర్యాటకం, అడ్వెంచర్ టూరిజం, సాంస్కృతిక పర్యాటక రంగాల అభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపడుతోందని చెప్పారు.

# గిన్నిస్ రికార్డు కోసం ఏకంగా 2,253 పేర్లు.

**ఢిల్లీ, మహా.** ప్రపంచంలో రోజుకో వింత.. పూటకో విచిత్రం వెలుగు చూస్తుంటాయి. అయితే గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో తన పేరు సువర్ణాక్షరాలతో లిఖించబడాలన్న ఒకే ఒక్క బలమైన ఆశయంతో.. ఒక వ్యక్తి తన పేరును ఏకంగా 2,253 పేర్ల కలయికగా మార్చుకుని ప్రపంచంలోనే అత్యంత పొడవైన పేరు కలిగిన వ్యక్తిగా చరిత్ర సృష్టించాడు. ఆస్ట్రేలియాకు చెందిన 'లారెన్స్ వాట్కిన్స్' అనే ఈ అరుదైన రికార్డుల వీరుడు, తాజాగా తన వివాహం నాటి ఒక అత్యంత ఆసక్తికరమైన, విచిత్రమైన సంఘటనను సోషల్ మీడియా వేదికగా పంచుకోవడంతో ఈ వార్త ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా తెగ వైరల్ అవుతోంది.

న్యూజిలాండ్‌లో జన్మించిన లారెన్స్ వాట్కిన్స్, ఒక లైబ్రరీలో సాధారణ ఉద్యోగిగా పనిచేస్తున్న రోజుల్లో అంటే.. 1990లో తన 24వ ఏట ఎలాగైనా ప్రపంచంలో ఒక అరుదైన ఘనత సాధించాలని గట్టిగా సంకల్పించాడు. ఇందులో భాగంగా గిన్నిస్ బుక్ రికార్డులన్నింటినీ కూలంకషంగా అధ్యయనం చేసిన అతగాడు, తనకు సాధ్యమయ్యే ఒక వినూత్న రికార్డు కోసం అన్వేషణ ప్రారంభించాడు. ఆ ఆలోచనలోంచి పుట్టిందే ఈ సుదీర్ఘ నామకరణం. ఇందుకోసం అతను రకరకాల డిక్షనరీలు, చిన్నపిల్లల పేర్ల పుస్తకాలను క్షుణ్ణంగా పరిశీలించి, ప్రపంచవ్యాప్తంగా ఉన్న రకరకాల సంస్కృతులకు చెందిన ఏకంగా 2,253 పేర్లను సేకరించాడు. వాటన్నింటినీ కలిపి ఒకే పేరుగా మారుస్తూ చట్టబద్ధంగా రిజిస్ట్రేషన్ చేయించుకుని గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించుకున్నాడు.

**పెళ్లిలో 20 నిమిషాల ఆడియో రికార్డింగ్!**

ఈ క్రమంలో 1991లో జరిగిన అతని వివాహ వేడుకలో ఒక వింతైన పరిస్థితి ఎదురైంది. చట్టపరమైన నిబంధనల ప్రకారం పెళ్లి జరిపించే అధికారి (మ్యారేజ్ రిజిస్ట్రార్) వరుడి పూర్తి పేరును స్పష్టంగా ఉచ్చరించాల్సి ఉంటుంది. అయితే అంత పెద్ద పేరును ఒకేసారి చదవడం ఎవరికైనా అసాధ్యం కావడంతో, ఒక తెలివైన ఉపాయం ఆలోచించారు. పెళ్లికి ముందే లారెన్స్ పూర్తి పేరును ఒక ఆడియో టేప్‌లో రికార్డ్ చేశారు. పెళ్లి పీటలపై ఆ రికార్డింగ్‌ను ప్లే చేయగా, అది పూర్తి కావడానికి ఏకంగా 20 నిమిషాల సమయం పట్టింది. ఆ సమయంలో పెళ్లికి వచ్చిన అతిథులంతా షాంపైన్ సేవిస్తూ, నవ్వుకుంటూ ఆ పేరు వింటూ వేచి చూడాల్సి వచ్చింది. ఆ ఆడియో రికార్డింగ్ పూర్తయిన తర్వాతే చట్టప్రకారం లారెన్స్ 'ఐ డూ' (నేను ఈ వివాహాన్ని అంగీకరిస్తున్నాను) అని చెప్పి పెళ్లి చేసుకున్నాడు.

తన పూర్తి పేరును చాలా నిదానంగా, స్పష్టంగా చదవాలంటే గంటన్నర సమయం పడుతుందని, ఒకవేళ అత్యంత వేగంగా చదివినా కనీసం 20 నిమిషాలు పడుతుందని లారెన్స్ వాట్కిన్స్ నవ్వుతూ వెల్లడించాడు. అంతేకాదు, ఆ 2,253 పేర్ల కలయికలో ఉన్న అన్ని పేర్లను తాను కూడా సొంతంగా తప్పుల్లేకుండా పలకలేనని ఆయన నిజాయితీగా అంగీకరించాడు. ప్రపంచ రికార్డు కోసం అంత పెద్ద పేరు పెట్టుకున్నప్పటికీ.. నిత్యజీవితంలో, రోజువారీ పనుల్లో తనను అందరూ కేవలం ఒక చిన్న పేరుతోనే పిలవాలని ఆయన కోరుకుంటున్నాడు. ఈ విచిత్రమైన పేరు ప్రస్థానం విన్న నెటిజన్లు ఆశ్చర్యపోతున్నారు.

## ఐఏఎస్ వర్సెస్ ఐపీఎస్ ఈగో వార్.

# సుప్రీంకోర్టు సంచలన తీర్పు!

- చేజేతులా మీ కెరీర్లను నాశనం చేసుకుంటున్నారు.
- ఇద్దరు మహిళా అధికారులపై ధర్మాసనం ఆగ్రహం.
- మధ్యవర్తిగా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ కురియన్ జోసెఫ్ నియమకం.
- క్రిమినల్, సివిల్ విచారణలపై తక్షణ స్టే.
- ఐదేళ్ల వీధిపోరాటానికి ముగింపు పడేనా?



**ఢిల్లీ, మహా :** గత మూడేళ్లుగా దేశవ్యాప్తంగా ఐఏఎస్, ఐపీఎస్ వర్గాల్లో పెను సంచలనం సృష్టిస్తోన్న ఐపీఎస్ అధికారిణి డి. రూపా మౌద్గిల్, ఐఏఎస్ అధికారిణి రోహిణి సింధూరిల మధ్య సాగుతున్న 'ఈగో వార్' (అహాల పోరు) ఎట్టకేలకు దేశ సర్వోన్నత న్యాయస్థానం మెట్లు ఎక్కింది. పరస్పర వ్యక్తిగత ఆరోపణలు, సోషల్ మీడియా వేదికగా సాగిన పోరాటాలు, కోట్ల రూపాయల నష్టపరిహార దావాలతో బ్యూరోక్రసీ ప్రతిష్టను దారుణంగా దిగజార్చుకుంటున్న ఈ ఇద్దరు ఉన్నతాధికారులకు సుప్రీంకోర్టు గట్టి క్లాస్ పీకింది. ఒకరినొకరు నాశనం చేసుకుంటున్నారంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన న్యాయస్థానం, ఈ వివాదానికి శాశ్వత ముగింపు పలికేందుకు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ కురియన్ జోసెఫ్‌ను మధ్యవర్తిగా నియమిస్తూ సంచలన ఆదేశాలు జారీ చేసింది.

**కెరీర్లను నాశనం చేసుకుంటున్నారు!**

జస్టిస్ సతీష్ చంద్ర శర్మ, జస్టిస్ సంజీవ్ సచ్దేవాలతో కూడిన సుప్రీంకోర్టు ఉన్నత స్థాయి ధర్మాసనం ఈ కేసును విచారిస్తూ అత్యంత కఠినమైన వ్యాఖ్యలు చేసింది. "ప్రజా సేవలో ఉండి సమాజానికి ఆదర్శంగా నిలవాల్సిన మీరిద్దరూ.. మీ చేతులతో మీరే మీ ఉజ్వల కెరీర్లను నాశనం చేసుకుంటున్నారు" అని కోర్టు మౌఖికంగా తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. ఈ అహంకార పూరిత వివాదాన్ని కేవలం చట్టం, కోర్టుల పరిధిలో తేల్చడం కంటే మధ్యవర్తిత్వం ద్వారా సామరస్యంగా పరిష్కరించుకోవడమే ఉత్తమమని బెంచ్ అభిప్రాయపడింది. తదుపరి విచారణల కోసం ఇద్దరు అధికారులనూ జస్టిస్ కురియన్ జోసెఫ్ ముందు హాజరుకావాలని ఆదేశించింది. అంతేకాకుండా, కింది కోర్టుల్లో వీరిద్దరిపై ఉన్న అన్ని రకాల క్రిమినల్, సివిల్ విచారణలపై సుప్రీంకోర్టు తక్షణ స్టే విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

**అసలు ఎక్కడ మొదలైంది ఈ రచ్చ?**

ఈ కర్ణాటక క్యాడర్ ఐఏఎస్ వర్సెస్ ఐపీఎస్ వివాదం 2023 ఫిబ్రవరిలో బహిరంగంగా రచ్చకెక్కింది. నాటి ఐపీఎస్ అధికారిణి డి. రూపా.. ఐఏఎస్ అధికారిణి రోహిణి సింధూరిని లక్ష్యంగా చేసుకుని తన అధికారిక ఫేస్‌బుక్ ఖాతాలో వరుస పోస్టులు పెట్టారు. బెంగళూరు జలహళ్లిలో రోహిణి నిర్మించుకున్న భారీ బంగ్లా వివరాలను ఆమె తన ఆస్తిపాస్తుల వార్షిక నివేదికలో ఉద్దేశపూర్వకంగా వెల్లడించలేదని రూపా తీవ్ర ఆరోపణలు చేశారు. అంతటితో ఆగకుండా రోహిణికి సంబంధించిన కొన్ని అత్యంత వ్యక్తిగత చిత్రాలను (ఫోటోలను) సోషల్ మీడియాలో బహిర్గతం చేస్తూ, ఆమె ప్రొఫెషనల్, పర్సనల్ లైఫ్‌పై తీవ్రమైన విమర్శలు గుప్పించారు. ఇది దేశవ్యాప్తంగా బ్యూరోక్రసీ వర్గాల్లో పెను సంచలనం సృష్టించింది.

**రూ. 1 కోటి దావా.. కోర్టు పోరాటం**

రూపా చేసిన ఆరోపణలను రోహిణి సింధూరి తీవ్రంగా ఖండించారు. తన ప్రతిష్టను భంగం కలిగించేందుకు ఐపీఎస్ అధికారిణి ఉద్దేశపూర్వకంగా వ్యక్తిగత కక్షతో ఇటువంటి చౌకబారు విమర్శలకు దిగుతున్నారని ఆరోపిస్తూ ఆమె న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. రూపాపై ఐపీసీ సెక్షన్ 500 కింద క్రిమినల్ డెఫమేషన్ (క్రిమినల్ అవమాన) కేసు నమోదు చేయడంతో పాటు, తనకు జరిగిన మానసిక క్షోభకు రూ. 1 కోటి నష్టపరిహారం చెల్లించాలని, రాతపూర్వకంగా క్షమాపణలు చెప్పాలని సివిల్ దావా వేశారు. ఈ కేసు సుదీర్ఘంగా సాగి, చివరకు కర్ణాటక హైకోర్టు రోహిణికి అనుకూలంగా తీర్పునిస్తూ రూపపై క్రిమినల్ విచారణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దాంతో ఈ వ్యవహారం సుప్రీంకోర్టు గడప తొక్కింది.

**కోర్టు చెప్పినా మారని ఇద్దరి తీరు!**

గతంలోనే సుప్రీంకోర్టు వీరిద్దరికీ పద్ధతి మార్చుకోవాలని గట్టిగా హెచ్చరించింది. కోర్టు ఆదేశాల మేరకు డి. రూపా తన ఫేస్‌బుక్ ఖాతా నుంచి రోహిణికి వ్యతిరేకంగా పెట్టిన అన్ని వివాదాస్పద పోస్టులను తొలగిస్తూ న్యాయస్థానానికి అఫిడవిట్ కూడా సమర్పించారు. కానీ, ఇద్దరిలోనూ పంతాలు, పట్టుదలలు మాత్రం తగ్గలేదు. డిసెంబర్ 2024లో రూపా మరో కొత్త క్రిమినల్ ఫిర్యాదును కోర్టులో దాఖలు చేశారు. రోహిణి సింధూరి తనను 'మానసిక వికలాంగురాలిగా' అభివర్ణిస్తూ కించపరిచే వ్యాఖ్యలు చేశారని ఆమె కొత్త ఫిర్యాదు చేయగా.. మేజిస్ట్రేట్ కోర్టు దీనిని స్వీకరించింది. దీనితో రోహిణి మళ్లీ హైకోర్టును, అక్కడి నుంచి సుప్రీంకోర్టును ఆశ్రయించాల్సి వచ్చింది.

**చట్టం కంటే సయోధ్యే శరణ్యం!**

ప్రజాసేవలో అత్యున్నత క్యాడర్లలో ఉండి, సమాజానికి దారి చూపాల్సిన ఇద్దరు మహిళా అధికారులు ఇలా వీధి పోరాటాలకు దిగడం సివిల్ సర్వీసెస్ క్యాడర్లకే పెద్ద మచ్చ తెచ్చింది. లాయర్ల సుదీర్ఘ వాదనలు, అధికారుల వ్యక్తిగత ఈగోల వల్ల ఈ సమస్య దాదాపు ఐదేళ్లుగా సాగుతూనే ఉంది తప్ప ఎక్కడా తగ్గడం లేదు. ఇప్పుడు సుప్రీంకోర్టు జోక్యంతోనైనా, జస్టిస్ కురియన్ జోసెఫ్ సమక్షంలో వీరిద్దరూ తమ వ్యక్తిగత పంతాలను, పట్టింపులను పక్కనబెట్టి ఒక కొలిక్కి వస్తారా లేదా అనేది బ్యూరోక్రసీ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.

# ఏపీ టెక్నాలజీ అభివృద్ధికి గూగుల్ ఊతం

సింగపూర్, మహా: ఆంధ్రప్రదేశ్‌లో టెక్నాలజీ, డిజిటల్ మౌలిక వసతుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం-గూగుల్ మధ్య కీలక ఒప్పందం కుదిరింది. సీఎం చంద్రబాబు నాయుడు, గూగుల్ ఆసియాపసిఫిక్ అధ్యక్షుడు కరణ్ బజ్వా సమావేశంలో ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్, డిజిటల్ గవర్నెన్స్ రంగాల్లో భాగస్వామ్యానికి అంగీకరించారు. భవిష్యత్ ప్రణాళికల అమలుకు ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అలాగే వైసీహెచ్ లాజిస్టిక్స్ గ్రూప్‌తో పెట్టుబడులపై చర్చలు జరిపిన సీఎం, రాష్ట్రంలో 'యూఎన్ హాబిటాట్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' ఏర్పాటుకు ప్రతిపాదించారు. ఏపీని ఏఐ, డేటా సెంటర్ మరియు అంతర్జాతీయ లాజిస్టిక్స్ హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యమని తెలిపారు.



# బొగ్గు కొరత కోరల్లో థర్మల్ ప్లాంట్లు!

- తెలంగాణ, ఏపీల్లో అడుగంటిన నిల్వలు.
- విద్యుదుత్పత్తిపై ఎల్నినో దెబ్బ.
- యాదాద్రి కేంద్రంలో 21 శాతానికే పరిమితమైన ఉత్పత్తి: సీఈఏ నివేదికలో వెల్లడి.
- వెబ్‌సైట్‌లో వివరాల నమోదు నిలిపివేసిన సింగరేణి.. గనుల వైఫల్యంతో తగ్గిన అమ్మకాలు.

**హైదరాబాద్, మహా:** అంతర్జాతీయంగా కలవరపెడుతున్న ఎల్నినో ప్రభావం, దేశవ్యాప్తంగా నానాటికీ పెరుగుతున్న విద్యుత్ గిరాకీ (డిమాండ్) తదితర పరిణామాలు తెలుగు రాష్ట్రాల్లోని విద్యుత్ రంగాన్ని తీవ్ర ఆందోళనలోకి నెట్టేస్తున్నాయి. డిమాండ్‌కు తగినట్లుగా థర్మల్ విద్యుత్ కేంద్రాలకు బొగ్గు సరఫరా కాకపోవడంతో ప్లాంట్లలో సంక్షోభ పరిస్థితులు తలెత్తుతున్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, గుజరాత్ సహా దేశంలోని పలు కీలక రాష్ట్రాల థర్మల్ విద్యుత్ కేంద్రాలలో బొగ్గు నిల్వలు కనీస మట్టం (క్రిటికల్ లెవెల్) కన్నా దారుణంగా పడిపోయాయని కేంద్ర విద్యుత్ మండలి (సీఈఏ) తన తాజా నివేదికలో కఠిన వాస్తవాలను వెల్లడించింది.

***తెలుగు రాష్ట్రాల్లో కనీస నిల్వల కొరత***

కేంద్ర విద్యుత్ మండలి నివేదిక ప్రకారం.. జూన్ 13వ తేదీ నాటికి తెలంగాణ విద్యుదుత్పత్తి సంస్థ (జెన్కో) ప్లాంట్లలో నిల్వ ఉండాల్సిన కనీస బొగ్గు 25.54 లక్షల టన్నులు (ఎల్టీ) కాగా, ప్రస్తుతం అందులో కేవలం 24 శాతం (6.09 లక్షల టన్నులు) మాత్రమే అందుబాటులో ఉంది. ఇటు ఆంధ్రప్రదేశ్ జెన్కో ప్లాంట్ల పరిస్థితి కూడా ఇందుకు భిన్నంగా లేదు. ఏపీ ప్లాంట్లలో కనీసం 18.20 లక్షల టన్నుల నిల్వలు ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం కేవలం 20 శాతం అంటే 3.64 లక్షల టన్నుల బొగ్గు మాత్రమే నిల్వ ఉంది. ఎండ తీవ్రతకు దేశవ్యాప్తంగా విద్యుత్ వినియోగం రికార్డు స్థాయికి చేరుతున్న తరుణంలో, నిరంతరాయంగా విద్యుదుత్పత్తి జరగాలంటే థర్మల్ కేంద్రాలకు బొగ్గు సరఫరా అత్యంత కీలకమైనప్పటికీ క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి కనిపించడం లేదు.

**యాదాద్రికి అందని బొగ్గు.. నిలిచిన ఉత్పత్తి**

తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలో 3,200 మెగావాట్ల సామర్థ్యమున్న 4 యూనిట్లలో ఇప్పటికే వాణిజ్య ప్రాతిపాదికన విద్యుదుత్పత్తి ప్రారంభమైనప్పటికీ, బొగ్గు కొరత దీనిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ జూన్ నెలలో యాదాద్రి కేంద్రం కేవలం 21 శాతం సామర్థ్యంతోనే విద్యుదుత్పత్తి చేసిందని సీఈఏ స్పష్టం చేసింది. యాదాద్రి ప్లాంట్ పూర్తిస్థాయిలో నడవడానికి రోజుకు 43,700 టన్నుల బొగ్గు అవసరం కాగా, ఈ నెల 13న కేవలం 13,500 టన్నులు మాత్రమే సరఫరా అయింది. ప్లాంట్లలో ఎప్పుడూ కనీస నిల్వలుగా 11.32 లక్షల టన్నులు ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం అందులో 18 శాతమే నిల్వలు ఉన్నాయి. దేశంలో మరే థర్మల్ ప్లాంట్‌లోనూ ఇంత తక్కువ స్థాయిలో బొగ్గు నిల్వలు లేవని సీఈఏ ఆందోళన వ్యక్తం చేసింది. యాదాద్రికి అవసరమైన నిర్దిష్ట 'జీ9' గ్రేడ్ బొగ్గును పంపాలని సింగరేణి సంస్థను తాము పలుమార్లు కోరినప్పటికీ సరఫరా కావడం లేదని జెన్కో ఉన్నతాధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బొగ్గు సరఫరాను తక్షణమే పెంచాలని సీఈఏ సింగరేణిని ఆదేశించింది.

**వెబ్‌సైట్‌లో వివరాల నమోదు నిలిపివేసిన సింగరేణి!***

దేశంలోని అన్ని ప్రముఖ బొగ్గు ఉత్పత్తి సంస్థలు తమ నెలవారీ ఉత్పత్తి, రవాణా (సరఫరా), విక్రయాలు మరియు నిల్వల వివరాలను ఎప్పటికప్పుడు పారదర్శకంగా ఆయా సంస్థల వెబ్‌సైట్లలో పొందుపరచడం ఆనవాయితీగా వస్తోంది. అయితే, సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (SCCL) మాత్రం గత ఫిబ్రవరి మాసం నుంచి ఈ వివరాలను వెబ్‌సైట్‌లో పోస్ట్ చేయడం అకస్మాత్తుగా నిలిపివేయడం అనుమానాలకు తావిస్తోంది. గత ఐదేళ్ల కాలంలో ఎన్నడూ లేనివిధంగా సింగరేణి వార్షిక బొగ్గు ఉత్పత్తి గతేడాది కేవలం 58 మిలియన్ టన్నులకే పరిమితమైంది. నెలవారీ నివేదికల్లో చూపించే ఉత్పత్తి, సరఫరా వివరాలకు మరియు క్షేత్రస్థాయిలో వాస్తవంగా ఉన్న నిల్వలకు పొంతన లేదనే ఆరోపణలు రావడంతో.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే ఈ వివరాలను వెబ్‌సైట్‌లో పెట్టడం ఆపేసినట్లు సమాచారం.

**పరిశ్రమల విముఖత.. అధోగతిలో సింగరేణి**

కొత్త గనుల (మైన్స్) కేటాయింపులు సకాలంలో జరగకపోవడం, పాత గనుల్లో ఉత్పత్తి పురోగతి ఆశించిన స్థాయిలో లేకపోవడంతో సింగరేణి సంస్థ క్రమంగా నష్టాల బాట పడుతోంది. ఉత్పత్తి పడిపోవడంతో పాటు అమ్మకాలు కూడా గణనీయంగా తగ్గుముఖం పట్టాయి. దీనికి తోడు సింగరేణి విక్రయించే బొగ్గు ధరలు మార్కెట్ ధరల కంటే విపరీతంగా ఎక్కువగా ఉండటంతో.. గతంలో రెగ్యులర్‌గా కొనుగోలు చేసే దాదాపు 20 ప్రముఖ పరిశ్రమలు ఇప్పటికే సింగరేణి నుంచి బొగ్గు కొనడం పూర్తిగా మానేశాయి. ఈ పరిణామాలు అటు సింగరేణి సంస్థను, ఇటు తెలుగు రాష్ట్రాల విద్యుత్ రంగాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెడుతున్నాయి.

# ప్రజాపాలనతో ప్రజలకు మరింత చేరువైన ప్రజా ప్రభుత్వం!

- 99 రోజుల బృహత్తర కార్యక్రమాలపై సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నత స్థాయి సమీక్ష.
- ఫీల్డ్ విజిట్‌కు వెళ్లని అధికారులు, కలెక్టర్ల వివరాలపై నివేదిక ఇవ్వాలని సీఎస్‌కు ఆదేశం.
- వైద్య, విద్యా రంగాల్లో 'ఫేషియల్ రికగ్నిషన్' హాజరు.
- స్పెషల్ ఆఫీసర్లుగా జిల్లాలకు సీనియర్ ఐఏఎస్‌లు.
- గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణానికి, స్కూళ్లపై సోలార్ ప్లాంట్లకు గ్రీన్ సిగ్నల్.



**హైదరాబాద్, మహా :** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణ విజయవంతం కావడంతో ప్రజా ప్రభుత్వం ప్రజలకు మరింత చేరువైందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సంతృప్తి వ్యక్తం చేశారు. మార్చి 16 నుంచి జూన్ 12 వరకు రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఈ బృహత్తర కార్యక్రమాల ద్వారా వచ్చిన ఫలితాలపై సోమవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యసభ ఎంపీ వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, డీజీపీ సీవీ ఆనంద్ తదితరులతో కలిసి విభాగాల వారీగా జిల్లా స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు అందిన ప్రగతి నివేదికలను సీఎం క్షుణ్ణంగా పరిశీలించారు. 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో చురుగ్గా పాల్గొని, అంకితభావంతో పనిచేసిన అన్ని విభాగాల అధికారులను, సిబ్బందిని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రత్యేకంగా అభినందించారు.

***ఫీల్డ్ విజిట్ చేయని అధికారులపై సీఎం సీరియస్!***

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శుల నుంచి జిల్లా కలెక్టర్ల వరకు అన్ని విభాగాల ఉన్నతాధికారులు ప్రతి నెలా కచ్చితంగా క్షేత్రస్థాయికి వెళ్లి ప్రజల సమస్యలను పరిశీలించాలని గతంలో తాను జారీ చేసిన ఆదేశాలను ముఖ్యమంత్రి ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ 99 రోజుల కాలంలో క్షేత్రస్థాయి పర్యటనలకు (ఫీల్డ్ విజిట్) వెళ్లకుండా కార్యాలయాలకే పరిమితమైన ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లపై తక్షణమే పూర్తిస్థాయి నివేదిక సిద్ధం చేసి తనకు సమర్పించాలని చీఫ్ సెక్రటరీని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. వివిధ స్థాయిల్లో జరిగిన కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, ప్రజల నుంచి వచ్చిన ఫీడ్‌బ్యాక్‌ను పక్కాగా నమోదు చేయాలని, గ్రామాల్లో గుర్తించిన స్థానిక సమస్యలను ఆయా శాఖలు త్వరితగతిన పరిష్కరించాలని స్పష్టం చేశారు. ఈ 3 నెలల కాలంలో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన అభివృద్ధి పనులు, చేసిన శంకుస్థాపనలు, సృష్టించిన ఆస్తుల వివరాలన్నింటినీ రికార్డుల్లో నమోదు చేయాలన్నారు.

**కొత్త పంచాయతీ భవనాలు.. స్కూళ్లపై సోలార్ పవర్**

రాష్ట్రంలో ఇప్పటికీ స్వంతంగా గ్రామ పంచాయతీ భవనాలు లేని గ్రామాలు ఉంటే.. వెంటనే వాటి జాబితాను సిద్ధం చేయాలని పంచాయతీరాజ్ అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. ఆయా గ్రామాల్లో కొత్తగా కట్టుదిట్టమైన పంచాయతీ భవనాల నిర్మాణాలను చేపట్టేందుకు తక్షణమే కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకోవాలన్నారు. దీంతో పాటు విప్లవాత్మక నిర్ణయంలో భాగంగా రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల భవనాలపై సోలార్ పవర్ ప్లాంట్లను (సౌర విద్యుత్) ఏర్పాటు చేయాలని అధికారులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు.

**ఉస్మానియా, గాంధీ నుంచి పీహెచ్‌సీల వరకు డిజిటల్ హాజరు**

పాలనా వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం పెంచేందుకు వీలుగా విద్యా, వైద్య విభాగాల్లో అన్ని స్థాయిల్లో 'ఫేషియల్ రికగ్నిషన్' (ముఖ గుర్తింపు) హాజరు విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రాథమిక పాఠశాలల నుంచి కళాశాలల వరకు, గ్రామీణ ప్రాంతాల్లోని పీహెచ్‌సీల (ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు) నుంచి హైదరాబాద్‌లోని ఉస్మానియా, గాంధీ వంటి ప్రతిష్ఠాత్మక మహానగర ఆసుపత్రుల వరకు పనిచేసే ఉద్యోగులందరికీ ఇదే బయోమెట్రిక్ హాజరు విధానాన్ని వర్తింపజేయాలన్నారు.

**ప్రతి జిల్లాకూ స్పెషల్ ఆఫీసర్‌గా సీనియర్ ఐఏఎస్**

రాష్ట్రస్థాయిలో 99 రోజుల కార్యాచరణ ప్రణాళికపై సమీక్ష నిర్వహించిన తరహాలోనే, జిల్లాల వారీగా కూడా తక్షణమే సమీక్షలు ప్రారంభించాలని సీఎం ఆదేశించారు. ఈ ప్రక్రియను పర్యవేక్షించేందుకు రాష్ట్ర స్థాయి నుంచి ప్రతి జిల్లాకూ ఒక సీనియర్ ఐఏఎస్ అధికారిని 'స్పెషల్ ఆఫీసర్'గా నియమించి క్షేత్రస్థాయికి పంపించాలని చెప్పారు. జిల్లాల వారీగా ఈ ప్రగతి నివేదికలను అధికారికంగా విడుదల చేయాలన్నారు. జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాలు, గ్రామాల వారీగా ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు, వాటిని అందుకున్న లబ్ధిదారుల వివరాలు, ప్రజా ప్రభుత్వం చేపట్టిన సమగ్ర అభివృద్ధి పనుల సమాచారాన్ని సిద్ధం చేసి, ప్రజలకు తెలిసేలా ప్రత్యేక 'డ్యాష్ బోర్డు'లో అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు.

**ముఖ్యమంత్రి హామీలపై ప్రత్యేక నిఘా**

తాను ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి ఇప్పటివరకు జరిపిన వివిధ జిల్లాల పర్యటనలు, అధికారిక ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రజలకు ఇచ్చిన హామీల అమలు తీరుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ప్రత్యేకంగా ఆరా తీశారు. నియోజకవర్గాల వారీగా ముఖ్యమంత్రి ఇచ్చిన హామీల పురోగతి ఎంతవరకు వచ్చింది, ఏయే పనులు ఏ దశలో ఉన్నాయనే అంశాలపై సమగ్ర నివేదికను రూపొందించి తక్షణమే తనకు అందజేయాలని ప్రణాళికా విభాగాన్ని (ప్లానింగ్ డిపార్ట్‌మెంట్) ముఖ్యమంత్రి కఠినంగా ఆదేశించారు.



# ఇండియా కూటమిలోకి ఓవైసీ ?

**యూపీ ఎన్నికల వేళ కొత్త ట్విస్టులు**

**ఢిల్లీ, మహా :** ఆమ్ ఆద్మీ పార్టీ, తృణమూల్ కాంగ్రెస్ ను వరుసగా బీజేపీ దెబ్బతీయడంతో ఇండియా కూటమిని నడుపుతున్న కాంగ్రెస్ పార్టీకి ప్రాధాన్యం పెరిగింది. దీంతో గతంలో కాంగ్రెస్ కు దూరంగా ఉన్న పార్టీలు సైతం ఇప్పుడు ఇండియా కూటమిలోకి వస్తామని సంకేతాలు ఇస్తున్నాయి. ఇదే క్రమంలో హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీకి చెందిన ఎంఐఎం సైతం ముందుకొచ్చింది. ఈ ఏడాది చివర్లో లేదా వచ్చే ఏడాది ప్రారంభంలో యూపీ అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉంది. అక్కడ వరుసగా రెండుసార్లు అధికారంలో ఉన్న యోగీ ఆదిత్యనాథ్ నేతృత్వంలోని బీజేపీని గద్దె దింపేందుకు విపక్షాలు ఏకమవుతున్నాయి. గత లోక్ సభ ఎన్నికల్లో యోగీ ప్రభావాన్ని దాదాపుగా తగ్గించి, అయోధ్య వంటి స్థానాల్లోనూ గెలిచి చూపించిన కాంగ్రెస్‌సమాజ్ వాదీ పార్టీ కూటమిపై ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లోనూ భారీ అంచనాలు ఉన్నాయి. దీంతో 2022 ఎన్నికల్లో యూపీలో ఒంటరిగా పోటీ చేసి ఒక్క సీటు కూడా గెల్చుకోని ఎంఐఎం ఈసారి విపక్ష కూటమితో చేతులు కలిపేందుకు సిద్ధమవుతోంది. ఈ మేరకు ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ సంకేతాలు ఇచ్చారు. బీజేపీని తిరిగి అధికారంలోకి రాకుండా చేసేందుకు విపక్షాలతో చేతులు కలిపేందుకు సిద్ధమని ఓవైసీ ప్రకటించారు. తమకు తగిన గౌరవం, సమాన హోదా ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్న పార్టీలతో కలిసి పోరాడేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. తద్వారా ఇండియా కూటమికి తనను చేర్చుకోవాలని ఆయన సంకేతాలు ఇచ్చారు. గతంలో పలు రాష్ట్రాల్లో తమకు వ్యతిరేకంగా బరిలోకి దిగి ఓట్లు చీల్చి బీజేపీకి మేలు చేసిన ఓవైసీని ఇండియా కూటమిలోకి చేర్చుకునేందుకు కాంగ్రెస్ ఇష్టంగా లేనట్లు తెలుస్తోంది. ఓవైసీ పార్టీని ఇండియా కూటమిలో చేర్చుకోవడంపై అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుందని ఎంపీ ఇమ్రాన్ మసూద్ తెలిపారు. అయితే ఎస్పీ నేతలు మాత్రం బీజేపీని ఓడించేందుకు కలిసొచ్చే ఏ పార్టీతో అయినా పొత్తు పెట్టుకుంటామని వెల్లడించారు. ఈ నేపథ్యంలో త్వరలో ఎంఐఎంను కలుపుకుపోవడంపై కాంగ్రెస్‌ఎస్పీ క్లారిటీ ఇస్తాయని భావిస్తున్నారు.

# భారత్ భూభాగం కాదు .. అదో జీవన విధానం

**: ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్**

**ఢిల్లీ, మహా :** తరాలు మారుతున్నా, ముందుకు సాగుతున్నా భారతీయులు ఒకే మార్గంలో పయనిస్తున్నారని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ చీఫ్ మోహన్ భాగవత్ అన్నారు. ఢిల్లీలో ప్రతిష్ఠాత్మక బీఎంఎల్ ముంజాల్ అవార్డ్స్ 2026 కార్యక్రమంలో సోమవారం పాల్గొన్న ఆయన సదస్సును ఉద్దేశించి ప్రసంగించారు. భారతదేశం అనేది కేవలం ఒక నిర్దిష్ట భౌగోళిక సరిహద్దులు కలిగిన భూభాగం మాత్రమే కాదన్నారు. అది ఒక ఉన్నతమైన మార్గం.. ఓ విశిష్టమైన జీవన విధామని పేర్కొన్నారు. దేశం అంతర్గత స్వభావం, సంస్కృతి ఎలా రూపాంతరం చెందాయో తెలుసుకున్నప్పుడే భారతదేశాన్ని సంపూర్ణంగా అర్థం చేసుకోవడం సాధ్యమవుతుందని మోహన్ భాగవత్ అన్నారు.

# బిజెపి ఆడించే తోలు బొమ్మ పవన్ కల్యాణ్

**పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ ఫైర్**

**హైదరాబాద్, మహా** బిజెపి ఆడిస్తున్న తోలుబొమ్మ పవన్ కల్యాణ్ అని, బిజెపి పలకమన్నట్లు పవన్ పలుకుతున్నారని టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ ఫైర్ అయ్యారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎంతోమంది త్యాగం చేస్తే ఎంతమంది కష్టపడితే తెలంగాణ వచ్చిందో ఆ సినిమా నటుడు తెలుసుకోవాలన్నారు. సోనియాగాంధీ దయ వల్ల తెలంగాణ సాకారం అయిందని, బిజెపిని ఇక్కడ తీసుకురావాలి చెడ్డతలంపుతో విద్వేష వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. ఇది సినిమా కాదు.. విచ్చలవిడిగా, విద్వేషపూరితంగా మాట్లాడడానికి అన్నారు. వచ్చిన తెలంగాణను 13 ఏండ్లుగా తాము జాగ్రత్తగా చూసుకుంటుంటే ఇష్టమొచ్చినట్లు పవన్ మాట్లాడుతున్నారన్నారు. తెలంగాణ ఉద్యమంలో...పవన్ కల్యాణ్ ఎక్కడున్నాడన్నారు. అప్పుడు ఏ సినిమాలో నటిస్తున్నావ్...ఆయన తెలంగాణ గురించి మాట్లాడడం ఏంటి..? రాజకీయాల్లో పవన్ నేర్చుకోవాల్సింది చాలా ఉంది... నేర్చుకుంటే మంచిదని హితవు పలికారు.

# బస్సులో బాస్...



మనిషి ఆశావాది. ఆ ఆశే అతడ్ని ముందుకు నడిపిస్తుంది. ఆశ లేని వారు అత్యంత అరుదుగా వుంటారు. ఇక రాజకీయంలో నిత్య ఆశావాదులే వుంటారు. రేపటి పైనే వారి ఆశలన్నీ ఉంటాయి. అవే వారిని ముందుకు నడిపిస్తాయి. ఇప్పుడు తెలంగాణలోని రాజకీయ పార్టీల్లో ఇదే కనిపిస్తోంది. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయి పదేళ్ల పాటు అధికారంలో కొనసాగిన బీఆర్ఎస్ ఇప్పుడు ఆశల పల్లకి వైపు అడుగులు వేస్తోంది. ఎన్నికలకు ఇంకా రెండున్నరేళ్ళ సమయం వున్నా భవిష్యత్ వ్యూహ రచనల పై ఆ పార్టీ నేతలు దృష్టి పెట్టారు. బీఆర్ఎస్ కార్యనిర్వహక అధ్యక్షులు కేటీఆర్ మాటలు అందుకు నిలివెత్తు సాక్ష్యాలు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఎలా వుంటాయో ఆయన జోష్యం చెప్పేస్తున్నారు. ఇప్పటికిప్పుడు ఎన్నికలు వచ్చినా బీఆర్ఎస్ వంద స్థానాలు సునాయాసంగా గెలుచుకుని అధికారంలోకి వస్తుందని ఆయన ధీమాగా చెప్పేస్తున్నారు. ఇందుకు బలమైన కారణాలు కూడా ఆయన సవివరంగా వినిపిస్తున్నారు. సీఎం రేవంత్ రెడ్డికి పరిపాలన లక్షణాలు లేవంటారు కేటీఆర్. కాంగ్రెస్ పాలనలో ఏ వర్గం సంతోషంగా లేదని, ఎవ్వరికి సంతృప్తి లేదని, గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చటంలో రేవంత్ సర్కార్ ఘోరంగా విఫలమైందని, ప్రజావిశ్వాసాన్ని కాంగ్రెస్ పార్టీ కోల్పోయిందని... ఇలా రకరకాల విమర్శలు ఆయన ఏకరువు పెట్టేస్తున్నారు. ఇక్కడే ఆయన ఓ సంచలన ప్రకటన కూడా చేశారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికలు రసవత్తరంగా జరుగుతాయని, కాంగ్రెస్ అసలు పోటీలోనే ఉండదని చెప్పుకువచ్చారు. ప్రధాన పోటీ బీఆర్ఎస్... బీజేపీ మధ్యనే ఉంటుందని ముక్తాయింపు ఇచ్చారు. ఇదే ఇప్పుడు తెలంగాణలో హాట్ టాపిక్ గా మారుతోంది. కేటీఆర్ చెప్పినంత బలహీన పరిస్థితిలో కాంగ్రెస్ పార్టీ ఉందా అనేది ఓ సందేహం అయితే, తెలంగాణలో బీజేపీ అంత బలం పుంజుకుందా అనేది మరో అనుమానం ఇప్పుడు రాజకీయ విశ్లేషకులకు కూడా వస్తోంది. కేటీఆర్ లెక్కలు ఏమిటీ? ఏ ప్రాతిపదికన ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు? ఆయనకు ఇంత నమ్మకం ఎలా వచ్చింది? ఇదే అందరి మెదడులో మెదులుతున్న ప్రశ్న.

గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అంచనాలు తప్పాయి. వేసుకున్న లెక్కలు తారుమారయ్యాయి. ఎన్నికల ఫలితాల్లో దూసుకు పోతుంది అనుకున్న కారు టైర్లు పంక్చరయ్యాయి. కేసీఆర్ ను అడ్డుకునే వారే తెలంగాణలో పుట్టలేదు అనుకుంటూ వచ్చిన గులాబీ శ్రేణులకు తెలంగాణ ఓటర్లు షాక్ ఇచ్చారు. ఓటమి వెంట పడి వెక్కిరించింది. కాంగ్రెస్ పార్టీ ఆ ఎన్నికల్లో విజయం సాధించి తెలంగాణలో అధికారం హస్తగతం చేసుకుంది. ఇక్కడినుంచే బీఆర్ఎస్ కు కష్టాలు మొదలయ్యాయి. ఉద్యమ పార్టీ ఉనికిపై ప్రభావం చూపింది. కారు గుర్తుపై ఎన్నికల్లో పోటీ చేసి గెలిచిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కొందరు నియోజకవర్గ అభివృద్ధి కోసమంటూ కాంగ్రెస్ జెండా నీడకు చేరారు. గోరు చుట్టు మీద రోకలి పోటులా పార్లమెంట్ ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ కు ఘోర పరాభావం ఎదురైంది. పార్టీ అధినేత కేసీఆర్ ఫామ్ హౌస్ కు పరిమితమయ్యారు. పార్టీ బరువు, బాధ్యతలు బీఆర్ఎస్ సీనియర్ నేతలు కేటీఆర్, హరీష్ రావు భుజాలపై వేసుకున్నారు. కారు జోరు కనుమరుగయ్యే పరిస్థితి రావటం, కాంగ్రెస్ పరుగులు తీయటం ఒకేసారి మొదలయ్యాయి. తెలంగాణలో తమకు ఎదురే లేదంటూ కాలర్ ఎగురవేసిన గులాబీ నేతలు రాజకీయ మనుగడ కోసం నానా తంటాలు పడాల్సివస్తోంది. కాళేశ్వరం బీటలు వారటం బీఆర్ఎస్ ను మరింతగా ఇబ్బందిలో పడేసింది. ఫోన్ ట్యాపింగ్, ఫార్ముల రేస్ మొదలుకుని అనేక కేసులు బీఆర్ఎస్ నేతలను చుట్టుముట్టి కంటి మీద కునుకు లేకుండా చేస్తూ వస్తున్నాయి. బీఆర్ఎస్ నేతలను పూర్తిగా ఆత్మరక్షణలో పడేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలనలో ఉరకలు వేస్తూ బీఆర్ఎస్ కు చమటలు పట్టిస్తోంది. ఇది చాలదన్నట్టు కేసీఆర్ ఫ్యామిలీలో వివాదాలు, కేసీఆర్ కుమార్తె కవితను చుట్టు ముట్టిన మద్యం ముడుపుల కేసు, కవిత వేరే కుంపటి పెట్టి కేసీఆర్ ను సవాల్ చేయటం, బీఆర్ఎస్ ను వీడటం, మరో పార్టీ పెట్టడం ఇలా బీఆర్ఎస్ కు సినిమా కష్టాలన్నీ ఒకేసారి వచ్చి పడ్డాయి.ఈ సంక్షోభ సమయంలో కేటీఆర్, హరీష్ రావుతో ఓ నలుగురు బీఆర్ఎస్ నేతలు మాత్రమే పోరాటం సాగిస్తూ కారును ఎలాగైనా మళ్ళీ రోడ్డు ఎక్కించే ప్రయత్నం మొదలు పెట్టారు.

తెలంగాణలో బీఆర్ఎస్ అధికారం కోల్పోయి రెండున్నర ఏళ్ళు అవుతోంది. కాంగ్రెస్ పాలనలో సీఎం రేవంత్ రెడ్డి తీసుకుంటున్న నిర్ణయాలు, అనుసరించే విధానాలను అడగడునా ఎండగడుతూ బీఆర్ఎస్ ఈ రెండున్నర ఏళ్ల కాలం గడిపింది. ఇప్పుడు మళ్ళీ పార్టీని క్షేత్ర స్థాయి నుంచి ప్రక్షాళన చేసే పనిలో వుంది. ఈ నేపథ్యంలోనే వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధమయ్యే ఆలోచనలు కూడా బీఆర్ఎస్ మొదలు పెట్టింది. పార్టీని వదిలి పోయిన వారు పోగా మిగిలిన వారిని కార్యోన్ముకులను చేసే దిశగా కార్యాచరణ ప్రారంభించింది. ఈ బాధ్యతలు కేటీఆర్, హరీష్ రావులు తీసుకొని వచ్చిన అవకాశం వదలకుండా రాజకీయ ఎదుగుదల కోసం ప్లాన్ చేసుకుంటున్నారు. ఇప్పుడు బీఆర్ఎస్ నేతల టార్గెట్ ఒక్కటే. అదే తిరిగి తెలంగాణలో అధికారంలోకి రావటం. మళ్ళీ కేసీఆర్ ని సీఎం గా చేయటం. ఇక్కడే బీఆర్ఎస్ నేతలు కొంచం ఇబ్బంది పడుతున్నారు. మాజీ సీఎం కేసీఆర్ ఇప్పుడు ప్రజల్లోకి రావట్లేదు. అప్పుడప్పుడు వచ్చినా సభల్లో ప్రసంగం చేసి కనుమరుగయ్యే పరిస్థితి ఆయనది. అసెంబ్లీ వైపు అసలు కన్నెత్తి అయినా కేసీఆర్ చూడటం లేదు. ప్రభుత్వ పని తీరుపై పెదవి విప్పటం లేదు. ఫామ్ హౌస్ కు మాత్రమే పరిమితమైన కేసీఆర్ అక్కడకు వచ్చే బీఆర్ఎస్ నేతలతో మాత్రమే చర్చించి భవిష్యత్ వ్యూహం వారికి వివరించి ఊరుకుంటున్నారు. కేటీఆర్, హరీష్ రావుతో పాటు కాస్త హడావిడి చేసే సత్తా వున్న ఓ అరడజను బీఆర్ఎస్ నేతలు మాత్రమే ఇప్పుడు జనంలో కనిపిస్తున్నారు. ఇలాంటి పరిస్థితిలో కేటీఆర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేయటం ఇప్పుడు తెలంగాణలో ఓ చర్చగా మారింది. వచ్చే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో గులాబీ జెండా రెప రెపలను ఎవ్వరు ఆపలేరని, ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మూడో స్థానంతో సరి పెట్టుకోవాల్సిన పరిస్థితి ఉంటుందని కేటీఆర్ అంటున్నారు. ఇక తెలంగాణలో బీఆర్ఎస్ కు పోటీ ఇచ్చేది కేవలం బీజేపీ మాత్రమే అంటూ ఆయన అనటం మరో సంచలనమైంద్.

తెలంగాణలో కాంగ్రెస్ పాలన అధ్వానంగా ఉందంటూ విమర్శలు చేస్తున్న కేటీఆర్ 12 ఏళ్ల నరేంద్ర మోడీ పాలన కూడా నిరుత్సాహంగానే వుందని ఏద్దేవా చేస్తున్నారు. ప్రధాని మోడీ ఆధ్వర్యంలో తెలంగాణకు న్యాయం జరగలేదన్నది ఆయన ప్రధాన ఆరోపణ. అందుకే తెలంగాణలో బీజేపీ ప్రజాదరణ పొందలేక పోతోందని ఆయన మాటల్లోని సారాంశం. సీఎం రేవంత్ రెడ్డి పాలనా వైఫల్యాలు ప్రజలు గుర్తిస్తున్నారు. ఇచ్చిన హామీలు ఆయన తుంగలోకి తొక్కారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలు పట్టించుకోవటం లేదు. అవినీతిలో కాంగ్రెస్ ప్రభుత్వం కూరుకుపోయింది. చిన్న వర్షం వస్తే హైదరాబాద్ మునిగి పోతోంది. ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. హైదరాబాద్ ను ముంపు బారి నుంచి తప్పించలేని సీఎం రేవంత్ ఫ్యూచర్ సీటీ నిర్మాణం ఏం చేస్తారంటూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎండగట్టే ప్రయత్నం కేటీఆర్ గట్టిగా చేస్తూ వస్తున్నారు. పనిలో పనిగా మళ్ళీ అధికారం మనదే. రెడీ కండీ అంటూ బీఆర్ఎస్ క్యాడర్ ను ఉత్సాహ పరిచే ప్రయత్నం చేయటంలో ఆయనకు ఆయనే సాటిగా నిలుస్తున్నారు. ఇటు హరీష్ రావు తక్కువ కాకుండా సింగరేణిపై పడ్డారు. సింగరేణిలో అక్రమాలు జరుగుతున్నాయని, దోపిడీ పెరిగిందని గగ్గోలు పెడుతున్నారు. రైతు సమస్య లపై దృష్టి పెట్టి ధాన్యం కొనుగోలులో జాప్యం వల్ల అన్నదాతలు అల్లాడి పోతున్నారని మండి పడుతున్నారు.ఇలా అవకాశం వున్న అన్నీ అంశాలలో కేటీఆర్, హరీష్ లు ఇట్టే పరకాయ ప్రవేశం చేసి ప్రభుత్వాన్ని ఇరకాటం పడేసే ప్రక్రియ చేస్తూ వస్తున్నారు. ప్రజల్లో మమేకం అయ్యేందుకు వచ్చే ఏ ఛాన్స్ ను కేటీఆర్, హరీష్ వదిలి పెట్టటం లేదు. అయితే ఇది అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్లు రాల్చే వరకు తీసుకొని వెడుతుందా? ప్రజలు వీటిని అప్పటి వరకు గుర్తు పెట్టుకుంటారా? అనేది ఇప్పుడు బీఆర్ఎస్ నేతలకే అనుమానం వస్తోంది. ఇందుకు కారణం లేక పోలేదు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అనేక సంక్షేమ కార్యకమాలు అమలయ్యాయి. ఫించన్లు, కేసీఆర్ కిట్టు, రైతు బంధు, దళిత బంధు ఇలా చెప్పుకుంటూ పోతే లిస్ట్ పెద్దగానే ఉంటుంది. అన్నీ పథకాలు అమలు చేసినా ఎన్నికల్లో ఓట్లు రాలలేదు. మరి ఇప్పుడు ఈ పోరాటాలు, ఓదార్పులు ఓట్లు తెచ్చి పెడతాయా అనేది బీ ఆర్ ఎస్ నేతలు, శ్రేణులలో వున్న పెద్ద అనుమానం.

తెలంగాణలో ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ బలమైన పరిస్థితిలో వుంది. సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఇప్పుడు ప్రభుత్వం ప్రజా సంక్షేమ పథకాలతో జెట్ స్పీడుతో పరుగులు తీస్తోంది. ఈ జోరుకు కళ్లెం వేయాలంటే అంత ఈజీ కాదు. ఇది బీఆర్ఎస్ నేతలకు తెలియని విషయం కాదు. ఇందుకు ఓ మాస్టారు ప్లాన్ వారి సిద్ధం చేసుకుంటున్నారు. అదే మాజీ సీఎం కేసీఆర్ బస్సు యాత్ర. ఈ విషయం కేటీఆర్ స్వయంగా చెప్పారు. ఫామ్ హౌస్ లో వున్న కేసీఆర్ ప్రజల్లోకి వస్తారు. దానికి సమయం వుంది. సరైన టైమ్ లో కేసీఆర్ యుద్ధభూమిలోకి అడుగు పెడతారంటూ కేటీఆర్ చెప్పేసారు. 2029 లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని ఆయన ఖరాఖండిగా చెప్పటం వెనుక వున్న ధీమా ఇదే. కేసీఆర్ ప్రజల్లోకి వస్తే తెలంగాణ రాజకీయాలు మారే అవకాశం లేకపోలేదు. రాజకీయ వ్యూహ రచనలో కేసీఆర్ దిట్ట. ఇందులో ఎలాంటి సందేహం లేదు. ఆయన మాటలు తూటాల్లా పేలుతాయి. జనాలను ఆకట్టుకోవటం ఆయన ప్రత్యేకత. తెలంగాణ ఉద్యమ సమయంలోనూ, రెండు సార్లు తెలంగాణలో బీఆర్ఎస్ కు అధికారం తెప్పించటంలోనూ సక్సెస్ అయిన కేసీఆర్ ఇప్పుడు అదే తరహాలో రంగంలోకి దిగుతారని బీఆర్ఎస్ ఆశిస్తోంది. వచ్చే ఎన్నికల్లో తమదే విజయమంటూ కేటీఆర్ ఇంత ధీమా వ్యక్తం చేయటానికి వెనుక కేసీఆర్ ఏదో పెద్ద ప్లాన్ తోనే బరిలోకి వస్తారు అనేందుకు సంకేతం అంటున్నారు రాజకీయ పరిశీలకులు. కేసీఆర్ రాక కోసం ఇప్పుడు బీఆర్ఎస్ నేతలు, శ్రేణులు కూడా ఆసక్తిగా ఎదురు చూస్తున్నాయి. అయితే గతంలో కేసీఆర్ కు ప్రజల్లో వున్న క్రేజీ ఇప్పుడు వుందా.ఆయన బస్సు యాత్ర ఎప్పుడు ఉంటుంది. ఎంత కాలం ఉంటుంది. ప్రజల నుంచి స్పందన ఎలా ఉంటుంది. కేసీఆర్ బస్సు యాత్ర బీఆర్ఎస్ ను అధికారం వైపు నడిపిస్తుందా. ఇలాంటి అన్ని అనుమానాలకు కాలమే సమాధానం చెప్పాల్సి వుంది. ఏది ఏమైనా రానున్న రోజుల్లో తెలంగాణ రాజకీయాలు మాత్రం సంచలన దిశగా సాగే అవకాశం మెండుగా వుంది.

- జీ. వెంకటరమణ,
సీనియర్ జర్నలిస్ట్.

# ఆహార భద్రతలో తెలంగాణ అగ్రగామి





ఒక రాష్ట్ర అభివృద్ధిని కొలిచే అసలైన ప్రమాణం ఆ రాష్ట్ర రైతు సంక్షేమం. రైతు సంతోషంగా ఉంటే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలపడుతుంది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతమైతే రాష్ట్ర ప్రగతి వేగవంతమవుతుంది. ఈ సత్యాన్ని తెలంగాణ నేడు ఆచరణలో నిరూపిస్తోంది. ఒకప్పుడు కరవు, సాగునీటి కొరత, మార్కెట్ అనిశ్చితి, రైతు ఆందోళనలతో వార్తల్లో నిలిచిన తెలంగాణ, ఇప్పుడు దేశ ఆహార భద్రతకు అండగా నిలుస్తూ "భారత దేశపు అన్నపూర్ణ"గా ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంది.

వ్యవసాయాన్ని కేవలం జీవనాధారంగా కాకుండా ఆర్థికాభివృద్ధికి ప్రధాన శక్తిగా మలచాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలు ఫలితాలను ఇస్తున్నాయి. 202526 ఆర్థిక సంవత్సరంలో 150 లక్షల టన్నుల రికార్డు స్థాయి ధాన్యం కొనుగోలు, 26.43 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.35,537 కోట్ల నేరుగా జమ, వేల సంఖ్యలో కొనుగోలు కేంద్రాల ఏర్పాటు వంటి చర్యలు రైతు కేంద్రిత పరిపాలనకు నిదర్శనంగా నిలుస్తున్నాయి.

గతంలో ధాన్యం విక్రయం రైతుకు ఒక పెద్ద సవాలుగా ఉండేది. మార్కెట్ యార్డుల చుట్టూ తిరుగుతూ రోజులు గడపాల్సి వచ్చేది. మధ్యవర్తుల దోపిడీ, తూకాల్లో అవకతవకలు, చెల్లింపుల జాప్యం రైతును తీవ్ర ఇబ్బందులకు గురిచేసేవి. ప్రస్తుతం గ్రామ స్థాయిలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలు ఆ పరిస్థితిని గణనీయంగా మార్చాయి. రైతు పండించిన ధాన్యానికి ప్రభుత్వమే కొనుగోలుదారుగా నిలవడం, చెల్లింపులు నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ కావడం వ్యవసాయ రంగంపై రైతుల విశ్వాసాన్ని పెంచుతోంది.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో వ్యవసాయ రంగానికి ప్రత్యేక ప్రాధాన్యం లభిస్తోంది. రైతు సంక్షేమాన్ని ప్రభుత్వ విధానాల్లో కేంద్రబిందువుగా నిలపాలన్న సంకల్పం పరిపాలనలో స్పష్టంగా కనిపిస్తోంది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఆహార మరియు పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమన్వయంతో సాగిన ధాన్యం కొనుగోలు ప్రక్రియ రాష్ట్ర పరిపాలనా సామర్థ్యాన్ని ప్రతిబింబిస్తోంది. 8,575 కొనుగోలు కేంద్రాలు , రవాణా, నిల్వ, మిల్లింగ్, చెల్లింపుల వరకు ప్రతి దశలో సమన్వయం ఉండటం వల్ల రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తలేదు.



వ్యవసాయ రంగం పురోగతి కేవలం పంట ఉత్పత్తి పెరుగుదలతోనే పరిమితం కాదు. రైతు చేతిలోకి చేరే ఆదాయం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో పెరిగే చలామణి, ఉపాధి అవకాశాల విస్తరణ కూడా అంతే ముఖ్యమైనవి. ప్రస్తుతం రైతుల ఖాతాల్లో జమవుతున్న వేల కోట్ల రూపాయలు గ్రామీణ మార్కెట్లకు కొత్త ఊపును ఇస్తున్నాయి. చిన్న వ్యాపారాలు అభివృద్ధి చెందుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో కొనుగోలు శక్తి పెరుగుతోంది.

అయితే భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని కొన్ని అంశాలపై మరింత దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. వరి ఆధారిత సాగుపై అధిక ఆధారపడటం, వాతావరణ మార్పుల ప్రభావం, నీటి వనరులపై పెరుగుతున్న ఒత్తిడి వంటి సవాళ్లను ముందుగానే గుర్తించాలి. పంటల వైవిధ్యీకరణ, పప్పుధాన్యాలు, నూనెగింజలు, ఉద్యానవన పంటల ప్రోత్సాహం, వ్యవసాయ ప్రాసెసింగ్ పరిశ్రమల విస్తరణ వంటి చర్యలు రైతుల ఆదాయాన్ని మరింత స్థిరంగా పెంచగలవు.

అలాగే నిల్వ సామర్థ్యాల పెంపు, విలువ ఆధారిత ఉత్పత్తుల అభివృద్ధి, ఎగుమతుల ప్రోత్సాహం, రైతు ఉత్పత్తిదారుల సంఘాల బలోపేతం వంటి అంశాలు వ్యవసాయ రంగ భవిష్యత్తుకు కీలకం. రైతు ఆదాయం స్థిరంగా పెరిగేలా దీర్ఘకాలిక వ్యూహాలు రూపొందించడం అవసరం.

150 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు కేవలం ఒక గణాంకం కాదు. అది లక్షలాది మంది రైతుల శ్రమకు లభించిన గుర్తింపు. రైతు పండించిన ప్రతి గింజకు విలువ కల్పించాలన్న సంకల్పానికి ప్రతీక. రైతు సంక్షేమాన్ని అభివృద్ధి కేంద్రబిందువుగా ఉంచినప్పుడు ఎలాంటి ఫలితాలు సాధించవచ్చో తెలంగాణ అనుభవం స్పష్టంగా చెబుతోంది.

దేశవ్యాప్తంగా వ్యవసాయ రంగం సవాళ్లను ఎదుర్కొంటున్న తరుణంలో తెలంగాణ చూపిస్తున్న దారి ఇతర రాష్ట్రాలకు కూడా మార్గదర్శకంగా నిలుస్తోంది. రైతుకు భరోసా, మార్కెట్ కు స్థిరత్వం, వ్యవసాయానికి ప్రాధాన్యం కల్పించే విధానాలు కొనసాగితే తెలంగాణ కేవలం దేశానికి అన్నం పెట్టే రాష్ట్రంగా మాత్రమే కాకుండా రైతు సంక్షేమానికి జాతీయ ఆదర్శంగా నిలిచే అవకాశం ఉంది. ఆహార భద్రతకు భరోసాగా తెలంగాణ ప్రస్థానం మరింత బలంగా కొనసాగాలని ఆశిద్దాం.



- బి. శత్రురావు
టీపీసీసీ కో-ఆర్డినేటర్



## నకిలీ పత్తి విత్తనాల ముఠా గుట్టు రట్టు

- 20 లక్షల విలువ చేసే విత్తనాలు స్వాధీనం
- ప్రధాన నిందితుడితో పాటు నలుగురి అరెస్ట్
- 9 మందిపై కేసు నమోదు ప్రెస్ మీట్ లో ఎస్పీ వెల్లడి

**ఆదిలాబాద్ మహా :** రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని నకిలీ ప్రభుత్వ నిషేధిత పత్తి విత్తనాలు అమ్ముతూ అక్రమంగా అధిక లాభాలు పొందుతున్న ముఠాలను ఆదిలాబాద్ జిల్లా పోలీసులు ఛేదించి ప్రధాన నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ స్థానిక పోలీసు ఏఆర్ హెడ్ క్వార్టర్ సమావేశ మందిరం నందు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు.విచారణలో నిందితుడు పాపిన్వార్ సునీల్ కుమార్ 2008 సంవత్సరం నుండి వివిధ సీడ్స్ కంపెనీలలో సేల్స్‌మెన్‌గా పని చేస్తూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో రైతులు, ఎరువుల దుకాణదారులతో పరిచయాలు పెంచుకున్నట్లు వెల్లడించాడు.792 ప్యాకెట్ల పింక్ బాండ్ పత్తి విత్తనాల ప్యాకెట్లు,9.5 లక్షల విలువ చేసే ఎక్స్పైరీ అయిన విత్తనాలు, మందులతో పాటు తయారీ సామగ్రి, కారు, మొబైల్ ఫోన్లు స్వాధీనం స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. మొత్తం స్వాధీనం చేసుకున్న విత్తనాల విలువ దాదాపు రూ 20 లక్షలు ఉంటుందన్నారు.ప్రధాన నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్టు తెలిపారు.అలాగే ఆదిలాబాద్ టు టౌన్ పోలీస్ స్టేషన్లో 9 మందిపై కేసు నమోదు చేసామన్నారు.రైతులను మోసం చేసి అక్రమ లాభాల కోసం నకిలీ విత్తనాల వ్యాపారానికి పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసే ముందు తప్పనిసరిగా అధికారిక డీలర్ల వద్ద నుండి బిల్లుతో కొనుగోలు చేయాలని, అనుమానాస్పద విత్తనాలు లేదా పురుగు మందుల విక్రయాలపై సమీప పోలీసు స్టేషన్ లేదా వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డిఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి, ఆదిలాబాద్ టు టౌన్ ఇన్స్పెక్టర్ కె నాగరాజు, సిసిఎస్ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్, ఎస్సైలు అఖిల్, గోపికృష్ణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## డిమాండ్లు పరిష్కరించకపోతే
# సింగరేణిలో భారీ సమ్మె తప్పదు

**31 డిమాండ్లతో యాజమాన్యానికి సమ్మె నోటీసు ఇచ్చాం : ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్**

**మణుగూరు, మహా :** ఏఐటియుసి అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మణుగూరు ఏరియాలోని పీకేఓసీ2 వద్ద సోమవారం గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ మాట్లాడుతూ సింగరేణి కార్మికుల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం జూన్ 8న యాజమాన్యానికి సమ్మె నోటీసు అందజేసినట్లు తెలిపారు. ఈ సమ్మె నోటీసులో మొత్తం 31 డిమాండ్లను చేర్చినట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా సింగరేణిలో నిలిచిపోయిన మెడికల్ బోర్డును వెంటనే పునరుద్ధరించాలని, మెడికల్ ఫిట్ అయి ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న డిపెండెంట్లకు తక్షణమే అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే 202526 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన లాభాలను ప్రకటించి కార్మికులకు 40 శాతం లాభాల వాటా ఇవ్వాలని కోరారు. కార్మికులకు సొంతింటి పథకం అమలు చేసి రూ.30 లక్షల వడ్డీ లేని రుణాన్ని మంజూరు చేయాలని, మారుపేర్ల సమస్యలు, విజిలెన్స్ విచారణ పేరుతో పెండింగ్‌లో ఉన్న కేసులను వెంటనే క్లియర్ చేయాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి చెల్లించాల్సిన రూ.56 వేల కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే కోల్ ఇండియాలో అమలు చేస్తున్న రిఫండ్ విధానాన్ని సింగరేణిలో కూడా అమలు చేయాలని కోరారు. సింగరేణి యాజమాన్యం సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోకపోతే అన్ని కార్మిక సంఘాలను కలుపుకుని కార్మిక హక్కుల పరిరక్షణ కోసం పెద్ద ఎత్తున పోరాట కార్యాచరణ చేపడతామని, అవసరమైతే సమ్మెకు కూడా వెనుకాడబోమని హెచ్చరించారు. కార్మికులందరూ ఉద్యమాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. మణుగూరు ఏరియాలోని పీకేఓసీ2 డిప్‌సైడ్ ఎక్స్టెన్షన్ బ్లాక్‌ను సింగరేణికే కేటాయించాలని ఏఐటియుసి డిమాండ్ చేస్తోందన్నారు. ఈ ప్రాజెక్టు రాకపోతే మణుగూరుకు భవిష్యత్తు ఉండదని, సింగరేణికి ఆర్థిక నష్టం కలగడమే కాకుండా ఈ ప్రాంత ప్రజల ఉపాధి, అభివృద్ధి తీవ్రంగా దెబ్బతింటుందని పేర్కొన్నారు. సింగరేణి ఆధారంగా అభివృద్ధి చెందిన పారిశ్రామిక సంస్థలు అయిన బీటీపీఎస్, హెవీ వాటర్ ప్లాంట్, బీపీఎల్ వంటి సంస్థల మనుగడ కూడా బొగ్గుపైనే ఆధారపడి ఉందన్నారు.సింగరేణి బొగ్గు ఉత్పత్తి నిలిచిపోతే ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది కుటుంబాలు ఉపాధికి దూరమయ్యే పరిస్థితి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. బాధ్యతగల గుర్తింపు కార్మిక సంఘంగా సేవ్ సింగరేణి - సేవ్ మణుగూరు.. నినాదంతో అన్ని కార్మిక సంఘాలు, రాజకీయ పార్టీలను కలుపుకుని కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. మణుగూరు ఏరియాలో సింగరేణి మరో పదేళ్లు కొనసాగాలంటే అందరూ ఏఐటియుసి పోరాట కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ కార్యదర్శి కామ్రేడ్ వై. రామ్ గోపాల్, అసిస్టెంట్ బ్రాంచ్ కార్యదర్శి కామ్రేడ్ మేకల ఈశ్వర రావు, ఆఫీస్ బేరర్స్ ఆవుల నాగరాజు, బి. సురేందర్ రావు, పిట్ సెక్రటరీలు శనిగరపు కుమారస్వామి, బి. రవికుమార్, వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్ సుదీప్, జానకి ప్రసాద్, నాగుల సతీష్, బత్తుల కృష్ణ, నరహరి, ప్రవీణ్, ఇమాముద్దీన్, టి నారాయణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.




## పాఠశాలలు పునఃప్రారంభం

- ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఎమ్మెల్యే రాగమయి పుస్తకాల పంపిణీ

**సత్తుపల్లి,జూన్ 15: మహా:** నూతన విద్యా సంవత్సరానికి పాఠశాలలు సోమవారం పునః ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలకు హాజరైన విద్యార్థిని విద్యార్థులకు అధ్యాపకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం మండల విద్యాశాఖ అధికారి నక్క రాజేశ్వరరావు ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్ నగర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్ విజయ్ కుమార్ హాజరై విద్యార్థులకు పాఠ్య, వ్రాత పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. రేవంతన్న సర్కార్ విద్యార్థుల అభ్యున్నతికి పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. విద్యతోనే మంచి భవిష్యత్తు సాధ్యమవుతుందని, ఈ దిశగా ప్రతి విద్యార్థి శ్రద్ధగా విద్యను అభ్యసించాలని కోరారు. అనంతరం చిన్నారులు కొత్త పుస్తకాలు అందుకోవడంతో ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది. ఈ కార్యక్రమంలో పట్టణ మున్సిపల్ చైర్మన్ రెహానా కమల్ పాషా, మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ బొంతు సుమలత, ప్రజా ప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## శ్రీ రామాలయం అభివృద్ధికి..

- ఎమ్మెల్యే పాయం సహకారం కోరిన ఆలయ కమిటీ



**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, మణుగూరు మండలం అశోక్‌నగర్ గ్రామంలోని శ్రీ రామాలయం అభివృద్ధికి సహకారం అందించాలని ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు దేవాలయ అభివృద్ధికి అత్యవసరంగా చేపట్టాల్సిన పనులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. ముఖ్యంగా ఆలయ మండపం నిర్మాణం, బోరు బావి ఏర్పాటు, కాంపౌండ్ వాల్ మరమ్మతులు చేపట్టేందుకు అవసరమైన సహకారం అందించాలని కోరారు. అలాగే రానున్న రోజుల్లో ఆలయంలో నిర్వహించే ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొని ఆలయ అభివృద్ధికి అండగా నిలవాలని ఎమ్మెల్యేను అభ్యర్థించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలకు అనుగుణంగా ఆలయాల అభివృద్ధికి ఎల్లప్పుడూ తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సమితి సింగారం గ్రామపంచాయతీ ఉప సర్పంచ్ గాండ్ల సురేష్, గుడి కమిటీ అధ్యక్షులు కారం సీతారాములు, ఎడ్లపాటి ధనుంజయ, సూత్రపు నాగభూషణం, ఎం వెంకటేశ్వర్లు, గంటా నరసయ్య, ఎం వెంకటనారాయణ రెడ్డి, గంటా సురేష్, డి మల్లయ్యతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు దొబ్బల వెంకటప్పయ్య, ఎండి యాకూబ్ అలీ తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణిలో సమ్మెకు సిద్ధంగా ఉండండి

**22 తర్వాత ఎప్పుడైనా సమ్మె బాట గుర్తింపు సంఘం హెచ్చరిక**

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా**:సింగరేణి కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే సంస్థను స్తంభింపజేసే స్థాయిలో ఆందోళనలు చేపడతామని ఈ నెల 22 తర్వాత ఎప్పుడైనా సమ్మెకు సిద్ధంగా ఉండాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటీయూసీ) అదనపు ప్రధాన కార్యదర్శి మిరియాల రంగయ్య హెచ్చరించారు.సోమవారం పీవీకే5 గనిలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ కార్మికుల సహనాన్ని యాజమాన్యం బలహీనతగా భావించవద్దన్నారు. సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న మెడికల్ బోర్డు కేసులు అలియాస్ పేర్ల మార్పులు పెర్క్స్‌పై ఇన్‌కమ్ ట్యాక్స్ తొలగింపు సొంత ఇంటి స్థలాల కేటాయింపు డిపెండెంట్ ఉద్యోగాలు వంటి సమస్యల పరిష్కారంలో యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. మెడికల్ ఫిట్ అయిన డిపెండెంట్లకు నియామక ఉత్తర్వులు జారీ కావడం ఎఐటీయూసీ పోరాట ఫలితమేనని పేర్కొన్న ఆయన కార్మికులు ఐక్యంగా ఉంటే మరిన్ని సమస్యలకు పరిష్కారం సాధించవచ్చని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి చెల్లించాల్సిన సుమారు రూ.56 వేల కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా కొత్త కోల్ బ్లాకుల కేటాయింపు కొత్త గనుల ప్రారంభం సంస్థ విస్తరణతో పాటు భవిష్యత్ తరాలకు ఉద్యోగ అవకాశాలు కల్పించే చర్యలు చేపట్టాలని కోరారు. యూనియన్‌తో జరిగిన సమావేశాల్లో అంగీకరించిన డిమాండ్లు అమలు కాకపోవడానికి రాజకీయ జోక్యమే కారణమని ఆరోపించారు. కార్మికుల సమస్యల పరిష్కారంలో యాజమాన్యం మొండివైఖరి కొనసాగిస్తే సింగరేణి వ్యాప్తంగా ఆందోళనలు మరింత ఉధృతమవుతాయని అవసరమైతే నిరవధిక సమ్మెకు కూడా వెనుకాడబోమని మిరియాల రంగయ్య స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో బ్రాంచ్ కార్యదర్శి మల్లికార్జున్ రావు, కేంద్ర ప్రచార కార్యదర్శి వీరస్వామి, ఉపాధ్యక్షులతోపాటు కత్తెర్ల రాములు, సహాయ కార్యదర్శి గట్టయ్య, పలువురు యూనియన్ నాయకులు కార్మికులు పాల్గొన్నారు.




## ఈతకు వెళ్లి చెరువులో మునిగిన యువకులు



**కుషాయిగూడ, మహా :** కీసర పోలీస్ స్టేషన్ పరిధిలోని తిమ్మాయిపల్లి చెరువులో సోమవారం విషాద ఘటన చోటుచేసుకుంది. చెరువులో స్నానానికి వెళ్లిన ముగ్గురు యువకులు ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోగా, వారిలో ఒకరు మృతి చెందగా, మరొకరు గల్లంతయ్యారు.తిమ్మాయిపల్లి గ్రామానికి చెందిన జోసెఫ్ సురక్షితంగా బయటపడగా, కెవిన్ ఆంటోనీ (19) నీటిలో మునిగి మృతి చెందాడు. స్థానికులు, సహాయక సిబ్బంది అతని మృతదేహాన్ని చెరువు నుంచి వెలికితీశారు. మరో యువకుడు వాలెంటైన్ టోనీ (18) గల్లంతుకాగా, అతని కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.సమాచారం అందుకున్న వెంటనే కీసర ఇన్స్పెక్టర్ ఆధ్వర్యంలో పోలీసులు, డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డీఆర్ఎఫ్) బృందాలు సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. గల్లంతైన యువకుడి కోసం చెరువులో విస్తృతంగా గాలిస్తున్నారు.ఈ ఘటనపై కీసర పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## ప్రభుత్వ పాఠశాలలో ఏఐ ఆధారిత బోధన

**కారేపల్లి, మహా :** ప్రభుత్వ పాఠశాలలో ఏఐ ఆధారిత విద్యా బోధన, డిజిటల్ తరగతులు నిర్వహించటం జరుగుతుందని సింగరేణి మండల విద్యాధికారి దుగ్గిరాల జయరాజు తెలిపారు. సోమవారం మండలంలోని విశ్వనాధపల్లి హైస్కూల్, ప్రాధమిక పాఠశాల, బొక్కలతండా, కారేపల్లి పాఠశాలలను ఎంఈవో సందర్శించి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు పంపిణి చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఉదయం రాగిజావా, ఉచిత పాఠ్య, నోట్ పుస్తకాలు అందిస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో అంగ్ల బోధన ప్రయివేటు ధీటుగా అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రభుత్వ విద్యపై ప్రత్యేక దృష్టి పెట్టి పాఠశాలలో వసతులు, విద్యార్థుల అవసరాలను తీరుస్తుందన్నారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రైతులకు ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలి

**తహసీల్దార్ కు రైతు సంఘం వినతి**

**కారేపల్లి, మహా :** ఖరీఫ్ వ్యవసాయ సీజన్ ప్రారంభమైందని రైతులకు అవసరమైన విత్తనాలు , ఎరువులు అందుబాటులో ఉంచాలని ప్రభుత్వాన్ని తెలంగాణ రైతు సంఘం డిమాండ్ చేసింది. రైతు సమస్యలపై సోమవారం ప్రజావాణిలో సింగరేణి మండల తహసీల్ధార్ ఓరుగంటి వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. నకిలీ విత్తనాలు, పురుగుమందుల విక్రయాలు జరకుండా నిఘా పెట్టాలని వినతిలో కోరారు. ప్రభుత్వం ఇస్తానన్న రూ.2లక్షల రైతు రుణామాఫీ 60 శాతం మంది రైతులకు అమలు కాలేదని, బ్యాంకులలో రూ.2లక్షల పైబడి ఉన్న రైతులందరి రూ.2లక్షల మాఫీ వర్తింపచేయాలని వినతిలో డిమాండ్ చేశారు. ఈసందర్భంగా సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కే.నరేంద్ర, రైతు సంఘం మండల అధ్యక్షకార్యదర్శులు ముండ్ల ఏకాంబరం, వజ్జా రామారావు లు మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం ఇస్తానన్నా రైతు భరోసా రబీలో అరకొరగా అందించిందని, ఖరీఫ్ ప్రారంభమైన రైతు భరోసా విడుదలపై ప్రభుత్వం ఎలాంటి ప్రకటన చేయటం లేదన్నారు. ఎరువుల ధరలు విపరీతంగా పెరగటంలో చిన్న సన్నకారు రైతులకు వ్యవసాయం భారంగా పరిణమించిందన్నారు. రైతులకు యూరియా కొరత లేకుండా అందించాలన్నారు. పోడు సాగు చేసుకుంటున్న పేదలకు హక్కు పత్రాలు లేక పోవటంతో ఇబ్బందులు పడుతున్నారని పేదలు సాగు చేస్తున్న పోడు హక్కు కల్పించాలన్నారు. వినతి పత్రం అందించిన వారిలో సీపీఐ(ఎం) నాయకులు తలారి దేవప్రకాశ్, వాసం భాస్కర్ తదితరులు ఉన్నారు.

## కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడికి సన్మానం

**కారేపల్లి, మహా:** సింగరేణి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా నియమించబడిన తోటకూరి రాంబాబును ఆ పార్టీ నాయకులు సోమవారం సన్మానించారు. కారేపల్లి లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రాంబాబుకు చాలా కప్పి సన్మానించారు. అనంతరం అధ్యక్షులు రాంబాబు ఆధ్వర్యంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పుట్టినరోజు వేడుకలను నిర్వహించారు. బర్త్డే కేకు కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షులు బానోత్ రాంమ్మూర్తి, సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు రంజిత్ కుమార్, సర్పంచ్ లు మేదరి వీర ప్రతాప్(టోని), భానోత్ హీరాలాల్, ఇస్లావత్ రాజు, వాంకుడోత్ హన్మంతరావు, భూక్య బాలు, ఈసం మోతీరస్వామి, ఉండం రాఘవులు, బానోత్ పద్మ వీరభద్రం, కాంగ్రెస్ నాయకులు అడ్డగోడ ఐలయ్య, సూరపురెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి, సురేందర్ మనియార్, ఎండీ. యాకూబ్ అలీ , బోళ్ల రమేష్, షఫీ, పిట్టల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలనలో విఫలం

- సింగరేణి బాయి బాట కార్యక్రమంలో భాగంగా బెల్లంపల్లిలో పర్యటన
- తిలక్ గ్రౌండ్ స్టేడియం వద్ద పార్టీ జెండా ఆవిష్కరణ
- టీఆర్ఎస్ రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత




**బెల్లంపల్లి మహా:** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వం ప్రజా పాలనలో విఫలమైందని సింగరేణి బొగ్గు బాయి బాట కార్యక్రమంలో భాగంగా బెల్లంపల్లికి విచ్చేసిన టిఆర్ఎస్ పార్టీ అధినేత కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. సోమవారం నాడు బెల్లంపల్లి పట్టణానికి విచ్చేసిన ఆమె కూరగాయల మార్కెట్ చౌరస్తా వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి అనంతరం పాత బస్టాండ్ సమీపంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి జన సందోహం మధ్య పూలమాలలను అలంకరించి పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కార్యకర్తలతో నృత్యాలు చేయడంతో పలువురు మహిళలు కాబోయే సీఎం కల్వకుంట్ల కవిత అంటూ నినాదాలు చేశారు. అనంతరం ఆమె ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమంలో పాలనలోను విఫలమైందని రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలే బుద్ధి చెబుతారని ప్రజా సమస్యలపై నిరంతరం తమ పార్టీ పోరాడుతుందని స్పష్టం చేశారు. బెల్లంపల్లి పట్టణంలో ఆర్టీసీ బస్సులోని ప్రయాణికులను పలకరిస్తూ టిఆర్ఎస్ పార్టీని ఆదరించాలని విజ్ఞప్తి చేశారు అనంతరం భాయ్ బాట కార్యక్రమంలో భాగంగా ఆశీర్వాద జిల్లాకు తరలి వెళ్లారు ఈ కార్యక్రమంలో మాజీ కార్మిక శాఖ మాత్యులు బోడ జనార్ధన్ హెచ్ఎంఎస్ యూనియన్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ టీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సిద్ధం శెట్టి సాజన్ తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## ప్రజలకు సత్వర సేవలందించడమే లక్ష్యం

**జిల్లా కలెక్టర్ అంకిత్**



**భద్రాద్రి బ్యూరో, మహా:**ప్రజలకు సత్వర సేవలందించడమే లక్ష్యమని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. ఐడిఓసి కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అంకిత్ అదనపు కలెక్టర్ వేణుగోపాల్, డీఆర్ఓ పద్మావతితో కలిసి ప్రజల నుండి వినతులు ఫిర్యాదులను స్వీకరించి సంబంధిత శాఖల అధికారులకు తగిన సూచనలు చేశారు.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు భూ సమస్యలు సంక్షేమ పథకాల అమలు ఉపాధి మౌలిక సదుపాయాలు రెవెన్యూ ఇతర శాఖలకు సంబంధించిన సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రజలు సమర్పించిన ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించిన కలెక్టర్ సమస్యల స్వభావాన్ని బట్టి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు సత్వర పారదర్శక సేవలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. ప్రజావాణి ద్వారా అందిన ప్రతి వినతిని అత్యంత ప్రాధాన్యతతో పరిగణించి సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. ప్రజల సమస్యలను కేవలం నమోదు చేయడం కాకుండా వాటి పరిష్కారానికి నిర్దిష్ట కార్యాచరణతో ముందుకు సాగాలని అన్నారు.
శాఖల మధ్య సమన్వయంతో పనిచేస్తే సమస్యల పరిష్కారం వేగవంతమవుతుందని ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి జాప్యం లేదా నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని అధికారులను ఆదేశించారు. వెంటనే పరిష్కరించగల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని మిగిలిన సమస్యలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా అధికారులు కృషి చేయాలని ప్రభుత్వ సేవలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. ప్రజలు తమ వినతులతో పాటు సంబంధిత ఆధార పత్రాలను సమర్పించడం ద్వారా సమస్యల పరిష్కార ప్రక్రియ మరింత సులభతరం అవుతుందని అన్నారు.
ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేయడంతో పాటు వారి సమస్యలకు సత్వర పరిష్కారం అందించడం లక్ష్యమని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు.

**ప్రజావాణిలో అందిన కొన్ని వినతులు**

మణుగూరు మండలం కొండాయిగూడెం గ్రామానికి చెందిన బట్ట కృష్ణవేణి తన కుమార్తె దివ్యశ్రీ ఆరో తరగతి ప్రవేశం కోసం గురుకుల ప్రవేశ పరీక్ష రాసినప్పటికీ సీటు రాలేదని తమ కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉందని ప్రైవేట్ పాఠశాలలో చదివించే స్తోమత లేదని పేర్కొంటూ గురుకుల పాఠశాలలో సీటు మంజూరు చేయాలని దరఖాస్తు చేశారు. దీనిపై తగు చర్యల కోసం ఆర్‌సీఓ సోషల్ వెల్ఫేర్‌కు ఎండార్స్ చేశారు.సుజాతనగర్ మండలం చిమ్నతండా గ్రామానికి చెందిన భూక్య సేవ తన తండ్రి 2010లో మరణించారని మరణ ధ్రువీకరణ పత్రం కోసం పలుమార్లు మీసేవలో దరఖాస్తు చేసినప్పటికీ తిరస్కరణకు గురవుతోందని తెలిపారు. ఈ కారణంగా తన తండ్రి పేరిట ఉన్న భూమిని తన పేరుపై మార్చుకోలేకపోతున్నానని సమస్య పరిష్కరించి మరణ ధ్రువీకరణ పత్రం జారీ చేయాలని కోరారు. దరఖాస్తును పరిశీలించిన కలెక్టర్ తగు చర్యల కోసం సుజాతనగర్ తహసీల్దార్‌కు ఎండార్స్ చేశారు. ములకలపల్లి మండలం జగన్నాథపురం గ్రామానికి చెందిన స్వప్న తనకు ఐదు ఎకరాల వ్యవసాయ భూమి ఉందని పూర్తిగా వర్షాధార సాగుపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్నానని బోరు విద్యుత్ సదుపాయం మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు సమర్పించారు. దీనిని పరిశీలించిన కలెక్టర్ తదుపరి చర్యల కోసం ఐటీడీఏ పీఓకు ఎండార్స్ చేశారు. ఇల్లందు మండలం ధనియాలపాడు గ్రామ పరిధిలోని బాలాజీ తండాకు చెందిన భానోత్ అనూష తనకు సంబంధించిన రెండు వేర్వేరు భూముల భూభారతి రిజిస్ట్రేషన్ దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని కోరారు. దరఖాస్తును పరిశీలించిన జిల్లా కలెక్టర్ తగు చర్యల కోసం సంబంధిత ధరణి అధికారులకు ఎండార్స్ చేశారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.


## బీఆర్ఎస్ బలోపేతానికి సభ్యత్వ నమోదే బలమైన ఆయుధం..

**-గ్రామ స్థాయి నుంచి పార్టీని విస్తరించాలి..**
**: మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు**




**మణుగూరు, మహా :** పార్టీని గ్రామ స్థాయి నుంచి మరింత బలోపేతం చేయడంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తుందని పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు పేర్కొన్నారు. సోమవారం మణుగూరు మండలంలోని హనుమాన్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం, ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పార్టీ సిద్ధాంతాలు, లక్ష్యాలను ప్రతి కార్యకర్త ప్రజల్లోకి తీసుకెళ్లాలని, అధిక సంఖ్యలో సభ్యత్వాలు నమోదు చేసి పార్టీని మరింత విస్తరించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అలాగే బిఆర్ఎస్ ప్రభుత్వం గతంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించి పార్టీ పట్ల విశ్వాసాన్ని మరింత పెంచాలని సూచించారు. రానున్న రోజుల్లో పార్టీ మరింత శక్తివంతంగా ఎదగాలంటే కార్యకర్తలు సమిష్టిగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, ముఖ్య కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. సమావేశంలో నాయకులు డి రాజేందర్, పోశం నరసింహారావు, కుర్రి నాగేశ్వరరావు, అడపా అప్పారావు, ముద్దంగుల కృష్ణ, యాదగిరి గౌడ్, కుంట లక్ష్మణ్, కోడి అమరేందర్, పలువురు స్థానిక నాయకులు పార్టీ బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. స్థానిక బీఆర్ఎస్ నాయకులు, మండల స్థాయి ప్రజాప్రతినిధులు, గ్రామ కమిటీ సభ్యులు, యువజన నాయకులు, మహిళా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# భద్రకాళీ అమ్మవారిని, రుద్రేశ్వర స్వామిని దర్శించుకున్న ఇనగాల



**మహా వరంగల్ బ్యూరో;** వరంగల్ మహానగరం లోని ప్రాచీన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అయిన శ్రీ భద్రకాళీ దేవస్థానంలో అత్యంత వైభవంగా జరుగుతున్న ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవంలో గ్రేటర్ వరంగల్ కుడా చైర్మన్, హనుమకొండ డిసిసి అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సోమవారం నుండి బుధవారం వరకు మూడు రోజుల పాటు జరిగే ఈ మహోత్సవ కార్యక్రమాల్లో భాగంగా ఆయన ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన ఇనగాల వెంకట్రామ్ రెడ్డి కి దేవాలయ ప్రధాన అర్చకులు భద్రకాళి శేషు , దేవాదాయ శాఖ ఈవో ఆర్. సునీత పూర్ణ కుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన భద్రకాళీ అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. వేద పండితులు ఆయనకు ఆశీర్వచనం అందించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.అనంతరం హనుమకొండ లోని చారిత్రాత్మక వెయ్యి స్తంభాల దేవాలయానికి (రుద్రేశ్వర స్వామి దేవాలయానికి వెళ్లి శ్రీ రుద్రేశ్వర స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

# పౌష్టిక అల్పాహారం కార్యక్రమాన్ని ప్రారంభించిన కాంగ్రెస్ సీనియర్ నేత



**మహా వరంగల్ బ్యూరో :** తెలంగాణ రాష్ట్రంలో నూతన విద్యా సంవత్సరం ప్రారంభం సందర్భంగా వరంగల్ గిర్మాజిపేట లోని కొత్తవాడ హైస్కూల్ లో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రాథమిక ఉన్నత పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు ప్రవేశపెట్టిన పౌష్టిక అల్పాహారం కార్యక్రమాన్ని కాంగ్రెస్ సీనియర్ నాయకులు, 23 వ డివిజన్ కాంటెస్ట్ కార్పొరేటర్, టీపీసీసీ చేనేత విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్ప వెంకటేశ్వర్లు నేత లాంఛనంగా ప్రారంభించారు. ముందుగా పాఠశాలకు విచ్చేసిన విద్యార్థిని, విద్యార్థులకు ఘన స్వాగతం పలికారు. అనంతరం విద్యార్థిని విద్యార్థులందరికీ పౌష్టిక అల్పాహారం అందించడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థిని విద్యార్థులందరూ వారి తల్లిదండ్రులు తెలంగాణా ప్రభుత్వానికి, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి దేవాదాయ అటవీ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, స్థానిక పెద్దలు, ముఖ్య నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించండి

**బల్దియా అదనపు కమిషనర్ జోనా**

వరంగల్ కార్పొరేషన్ ; గ్రేటర్ వరంగల్ నగర ప్రజలు తమ సమస్యలను దరఖాస్తుల రూపంలో సమర్పించిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని బల్దియా అదనపు కమిషనర్ జోనా అన్నారు. సోమవారం ప్రజావాణి (గ్రీవెన్స్) కార్యక్రమాన్ని పురస్కరించుకొని జీ డబ్ల్యుఎంసి ప్రధాన కార్యాలయం లోని కౌన్సిల్ హాల్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అదనపు కమిషనర్ తో పాటు వివిధ విభాగాలకు చెందిన ఉన్నతాధికారులు నగర ప్రజల నుండి వివిధ సమస్యల పరిష్కారం కోసం అందజేసిన దరఖాస్తులను పరిష్కారనార్థం స్వీకరించారు. స్వీకరించిన దరఖాస్తులను పెండింగ్లో ఉంచకుండా వాటిని త్వరగా పరిష్కరించాలని హాయ్ ఆ సంబంధిత అధికారులను కమిషనర్ ఆదేశించారు.

ఈ సందర్భంగా స్వీకరించిన ఫిర్యాదుల వివరాలు విభాగాల వారిగా..

టౌన్ ప్లానింగ్.....41
ఇంజనీరింగ్.....24
రెవిన్యూ..........07
హెల్త్ శానిటేషన్..10
నీటి సరఫరా......03
మొత్తం........... 85

గా అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డి ఎఫ్ ఓ శంకర్ లింగం, ఇంచార్జి సి పి రవీందర్ రాడేకర్, పన్నుల అధికారి రామకృష్ణ, ఎం హెచ్ ఓ డాక్టర్ రాజేష్, సెక్రటరీ అనిల్ బాబు, హెచ్ ఓ లక్ష్మా రెడ్డి , తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి

- **వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**
- **కలెక్టరేట్ లో సాయంత్రం 4 గంటల వరకు కొనసాగిన ప్రజావాణి**

**మహా వరంగల్ బ్యూరో ;** వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సోమవారం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకునే లక్ష్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా వచ్చిన వినతులను కలెక్టర్ స్వయంగా స్వీకరించారు.ఈ సందర్భంగా మొత్తం 202 దరఖాస్తులు ప్రజావాణిలో నమోదయ్యాయి. అందులో రెవెన్యూ శాఖకు 64, మున్సిపాలిటీకి 48, హౌసింగ్ శాఖకు 22, డీఆర్డీఓకు 10, అలాగే ఇతర శాఖలకు సంబంధించి 58 దరఖాస్తులు వచ్చాయి.వచ్చిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖలకు తక్షణమే ఎండార్స్ చేసి సమగ్రంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో జాప్యం ఉండకూడదని స్పష్టం చేశారు.ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు జి. సంధ్యారాణి, వై.వి. గణేష్, జడ్పీ సీఈవో రామ్‌రెడ్డి, డీఆర్వో విజయలక్ష్మి, డీఎంహెచ్‌వో సాంబశివరావు తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు. ప్రజల సౌకర్యార్థం సాయంత్రం 4 గంటల వరకు కార్యక్రమాన్ని కొనసాగించి వినతులు స్వీకరించారు.



# జడ్జిల నియామకాల్లో తెలంగాణ అడ్వకేట్స్ కు ప్రాధాన్యత ఇవ్వాలి

- **తెలంగాణ అడ్వకేట్స్ అసోసియేషన్ డిమాండ్**
- **అధ్యక్షుడు సురేందర్ రెడ్డి నేతృత్వంలో ఏకగ్రీవ తీర్మానం**
- **సామాజిక న్యాయం, సముచిత ప్రాతినిధ్యంపై సీనియర్ న్యాయవాదుల గళం**



**మహా వరంగల్ బ్యూరో;** హైకోర్టు న్యాయమూర్తుల నియామకాల్లో తెలంగాణకు చెందిన అర్హులైన న్యాయవాదులకు సముచిత ప్రాధాన్యం కల్పించాలని తెలంగాణ హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. తెలంగాణ ప్రజల ఆకాంక్షలు, ప్రాంతీయ ప్రాతినిధ్యం, సామాజిక న్యాయం ప్రతిబింబించేలా న్యాయవ్యవస్థ ఉండాలని స్పష్టం చేసింది. తెలంగాణ హైకోర్టు అడ్వకేట్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్. సురేందర్ రెడ్డి అధ్యక్షతన సోమవారం తెలంగాణ హైకోర్టులో జరిగిన అత్యవసర సర్వసభ్య సమావేశంలో ఈ మేరకు ఏకగ్రీవ తీర్మానం ఆమోదించారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు డి.ఎల్. పాండు, కార్యదర్శులు పీ. శ్రవణ్ కుమార్ గౌడ్, కె. నిరంజన్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి పీ. కృష్ణ కీర్తన, ఖజాంచి బి. బాలాజీ, క్రీడా, సాంస్కృతిక కార్యదర్శి జె. విష్ణువర్ధన్ తో పాటు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. హైకోర్టు బెంచ్‌కు ఎంపిక చేసే న్యాయమూర్తుల నియామకాల్లో సామాజిక న్యాయాన్ని పాటించడంతో పాటు అన్ని వర్గాలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించాలని సమావేశం అభిప్రాయపడింది. తెలంగాణలో ప్రతిభావంతులు, అనుభవజ్ఞులు, నిబద్ధత కలిగిన న్యాయవాదులు ఎంతోమంది ఉన్నారని, వారికి తగిన గుర్తింపు దక్కాల్సిన అవసరం ఉందని సీనియర్ న్యాయవాదులు వెల్లడించారు. న్యాయమూర్తుల ఎంపికలో కేవలం ప్రతిభ మాత్రమే కాకుండా ప్రాంతీయ ఆకాంక్షలు, ప్రజల భావోద్వేగాలు, సమగ్ర ప్రాతినిధ్యం కూడా పరిగణనలోకి తీసుకోవాలని వారు సూచించారు. ఈ అంశంపై భారత ప్రధాన న్యాయమూర్తి, సుప్రీంకోర్టు కొలీజియం సభ్యులు, కేంద్ర న్యాయశాఖ మంత్రి, తెలంగాణ గవర్నర్, ముఖ్యమంత్రి, అలాగే వివిధ రాజకీయ పార్టీల అధ్యక్షులకు వినతిపత్రాలు సమర్పించాలని అసోసియేషన్ నిర్ణయించింది. దాంతోపాటు, న్యాయమూర్తుల నియామకాల్లో పారదర్శకత, న్యాయం, తెలంగాణకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ జూన్ 17న తెలంగాణ హైకోర్టు వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ప్రకటించింది. "ప్రజల వైవిధ్యం, ఆకాంక్షలు, సామాజిక వాస్తవాలు న్యాయవ్యవస్థలో ప్రతిబింబించాలి. తెలంగాణకు హైకోర్టు బెంచ్‌లో సముచిత ప్రాతినిధ్యం దక్కాల్సిందే" అని అసోసియేషన్ తన తీర్మానంలో స్పష్టం చేసింది.

# ఉద్యోగ ఒత్తిడితో యువతి ఆత్మహత్య

**హా వరంగల్ క్రైం బ్యూరో;** వరంగల్ నగరంలోని కాశీబుగ్గ ప్రాంతంలో సోమవారం 15 6 2026 తేదీన విషాద ఘటన చోటుచేసుకుంది. వరంగల్ కాశీబుగ్గ, తిలక్ రోడ్‌కు చెందిన గంజి కీర్తన (25) అనే యువతి ఉదయం సుమారు 11 30 గంటల సమయంలో తన నివాసం లోని మొదటి అంతస్తు బెడ్‌రూమ్‌లో ఫ్యాన్ కు చున్ని తో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. బెంగళూరు కంపెనీకి సంబంధించిన సంస్థ ఢిల్లీలో మృతురాలు ఉద్యోగం నిర్వహిస్తున్నది. బెంగళూరులోని ఓ విదేశీ సంస్థలో ఉద్యోగం చేస్తూ ఉండగా, గత కొంతకాలంగా ఉద్యోగ ఒత్తిడిని తట్టుకోలేక మానసిక ఆందోళనకు గురై చికిత్స పొందుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సంఘటన జరిగిన రోజు ఉదయం 9:00 గంటలకు ఆమె తండ్రి గంజి ఉమాశంకర్ వ్యాపార పనుల నిమిత్తం బయటకు వెళ్లగా, తల్లి కృష్ణవేణి గ్రీవెన్స్ సెల్ కు వెళ్లింది. ఈ సమయంలోనే కీర్తన ఇంట్లో ఒంటరిగా ఉన్నట్లు తెలిసింది.ఉదయం సుమారు 11:30 గంటలకు ఇంటికి వచ్చిన తల్లి కిటికీ లో నుంచి చూడగా కీర్తన ఉరికి వేలాడుతూ కనిపించింది. వెంటనే బంధువుల సహాయంతో తలుపులు బలవంతంగా తెరిచి లోపలికి వెళ్లి చున్ని కోసి కిందకు దించి నప్పటికీ అప్పటికే ఆమె మృతి చెందినట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న ఇంత జార్గంజ్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. కాగా, మృతురాలి మరణం పై తమకు ఎలాంటి అనుమానాలు లేవని కుటుంబ సభ్యులు వెల్లడించారు.

# మహిళా సాధికారతకు ప్రజా ప్రభుత్వం పెద్దపీట

- **కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యం**
- **ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**




**హన్మకొండ మహా;** మహిళల ఆర్థిక, సామాజిక సాధికారతే రాష్ట్ర అభివృద్ధికి పునాది అని, కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు.సోమవారం హనుమకొండ లోని అంబేద్కర్ భవన్‌లో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ మెప్మా ఆధ్వర్యంలో నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, డివిజన్ల వారీగా మహిళలకు చీరలను పంపిణీ చేశారు. మొదటగా కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నాయిని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం మహిళలను ఉద్దేశించి మాట్లాడుతూ, మహిళల ఉన్నతే తెలంగాణ ప్రగతికి బాటలు వేస్తుందని పేర్కొన్నారు. మహిళా సాధికారత కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని చెప్పారు. పశ్చిమ నియోజకవర్గంలో ప్రస్తుతం 5,344 స్వయం సహాయక సంఘాల ద్వారా 58,784 మంది మహిళలు ఆర్థికంగా బలోపేతం అవుతున్నారని ఎమ్మెల్యే వివరించారు. ఇటీవల మరో 93 కొత్త సంఘాలను ఏర్పాటు చేసి, 930 మంది మహిళలను సభ్యులుగా చేర్చినట్లు తెలిపారు.దివ్యాంగుల సాధికారతకు ప్రాధాన్యత ఇస్తూ 66 ప్రత్యేక స్వయం సహాయక సంఘాలను, వీధి వ్యాపారుల సంక్షేమం కోసం 12 సంఘాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.2026 మార్చి 31 నాటికి 1,072 స్వయం సహాయక సంఘాలకు రూ.121.24 కోట్ల రుణాలను మంజూరు చేసినట్లు తెలిపారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం రూ.21.06 కోట్ల స్త్రీనిధి రుణాలు, రూ.87 లక్షల వడ్డీలేని రుణాలు అందించినట్లు చెప్పారు. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా 742 మంది మహిళలకు రూ.11.68 కోట్ల వ్యక్తిగత రుణాలను అందజేసినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. మహిళలకు స్థిరమైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కాంటీన్లు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, క్యాటరింగ్ యూనిట్ల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని పేర్కొన్నారు.అదేవిధంగా, 110 మంది మహిళా దర్జీలు 13,408 యూనిఫాంలను కుట్టి రూ.10.06 లక్షల ఆదాయం పొందారని తెలిపారు. మహిళల అభివృద్ధే కుటుంబం, సమాజం, రాష్ట్ర అభివృద్ధికి బలమైన పునాది అని ఆయన అన్నారు. ఈ సందర్భంగా మెప్మా అధికారులు, సిబ్బంది, స్వయం సహాయక సంఘాల సభ్యులు మహిళా సాధికారత కోసం చేస్తున్న కృషి అభినందనీయమని ఎమ్మెల్యే కొనియాడారు.ప్రస్తుతం కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియలో ఆర్‌పీలు, ఆశా కార్యకర్తలు, ఇతర మహిళా స్థాయి అధికారుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలని, ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మెప్మా అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, మహిళలు, స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# మొహర్రం పండుగకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

**వరంగల్ జిల్లా కలెక్టర్ డా. సత్య శారద**

**మహా వరంగల్ బ్యూరో;** వరంగల్ జిల్లాలో మొహర్రం పండుగను ప్రశాంతంగా, ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ డా. సత్య శారద అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో మొహర్రం ఉత్సవాల ఏర్పాట్లపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య మాట్లాడారు.ఊరేగింపు మార్గాల్లో పారిశుధ్యం, తాగునీటి సౌకర్యం, వీధి దీపాలు, నిరంతర విద్యుత్ సరఫరా, వైద్య శిబిరాలు, అగ్నిమాపక భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ తదితర ఏర్పాట్లను ముందస్తుగా పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. మత పెద్దలు సూచించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు.మొహర్రం సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టి, ఊరేగింపులు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా సజావుగా జరిగేలా చూడాలని పోలీసు అధికారులకు సూచించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వై.వి. గణేష్, డీఆర్‌వో విజయలక్ష్మి, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి టి. రమేష్, వివిధ శాఖల అధికారులు, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.




# టెట్ పరీక్షా కేంద్రాల వద్ద నిషేధాజ్ఞలు

**వరంగల్ పోలీస్ కమిషనర్**

**మహా వరంగల్ క్రైమ్;** నేటి నుండి ప్రారంభం అయ్యే టెట్ పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు పరీక్షా కేంద్రాల వద్ద నిషేధాజ్ఞలు అమలు చేస్తున్నట్లుగా వరంగల్ పోలీస్ కమిషన్ సన్ ప్రీత్ సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు.వరంగల్ పోలీస్ కమిషనర్ పరిధిలో నేటి నుండి మొదలుకొని 22వ తారీకు వరకు కొనసాగే టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) పరీక్షలకు సంబంధించి పరీక్షా కేంద్రాల వద్ద సెక్షన్ 163 బి ఎన్ ఎస్ ఎస్ ప్రకారం నిషేధాజ్ఞలు అమలు చేయబడతాయని. ఈ ఉత్తర ప్రకారం పరీక్ష జరిగే 500 మీటర్ల పరిధిలో ప్రజలు గుంపులుగా గుమి కూడటం, సభలు సమావేశాలు ర్యాలీలు ధర్నాలు నిషేధించబడ్డాయని, అలాగే పరీక్షా జరిగే పరిసరాలలో పరీక్ష సమయంలో జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని.ఈ ఉత్తర్వులు ఉదయం ఆరు గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు కొనసాగుతుందని. ఎవరైనా ఈ ఉత్తరం అతిక్రమిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని వరంగల్ పోలీస్ కమిషనర్ హెచ్చరించారు.

# బాలికలకు రక్షణ కవచం హెచ్‌పీవీ వ్యాక్సిన్

**సీకేఎం లో ఉచితంగా హెచ్‌పీవీ వ్యాక్సిన్**
**ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి**
**మాజీ కార్పొరేటర్ అనిల్ కుమార్ పిలుపు**




**మహా వరంగల్ బ్యూరో ;** మహిళల్లో ప్రాణాంతకమైన గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ (సర్వైకల్ క్యాన్సర్) ను నివారించే హెచ్‌పీవీ వ్యాక్సిన్ ను రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందుబాటులోకి తెచ్చింది. వరంగల్ లోని సీకేఎం ప్రసూతి దవాఖానలో 14 సంవత్సరాలు నిండిన బాలికలకు ఈ టీకాను వైద్య ఆరోగ్య శాఖ ఉచితంగా అందిస్తోంది.

**ప్రారంభ కార్యక్రమం, మాజీ కార్పొరేటర్ కుటుంబం నుంచే మొదలు***

మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎల్. దిలీప్ కుమార్ పర్యవేక్షణలో సోమవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో 27వ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ చింతాకుల అనిల్ కుమార్ తన కుమార్తె చింతాకుల నైనికకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ ఇప్పించారు. "ముందు మనం ఆచరించి చూపితేనే ప్రజలకు నమ్మకం కలుగుతుందని అందుకే నా కూతురికి మొదటగా వేయించాను అని అనిల్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ మాట్లాడుతూ.. హెచ్‌పీవీ వ్యాక్సిన్ 14 ఏళ్లు నిండిన బాలికలు తప్పనిసరిగా వేయించుకుంటే భవిష్యత్తులో సర్వైకల్ క్యాన్సర్ బారిన పడకుండా 90 శాతం వరకు రక్షణ లభిస్తుందని తెలిపారు. ప్రైవేటులో ఈ వ్యాక్సిన్ ఒక్కో డోసు రూ. 3,000 నుంచి రూ.4,000 వరకు ఉంటుందని కానీ ప్రభుత్వం ఉచితంగా ఇస్తోందని ఈ అవకాశాన్ని ప్రతి తల్లిదండ్రులు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించి, ఈ కార్యక్రమాన్ని ప్రజలకు మరింత చేరువ చేయాలని కోరారు.

**డాక్టర్. దిలీప్ కుమార్ వివరణ**

మెడికల్ ఆఫీసర్ డాక్టర్. ఎల్. దిలీప్ కుమార్ మాట్లాడుతూ హెచ్‌పీవీ అంటే హ్యూమన్ పాపిల్లోమా వైరస్. ఈ వైరస్ వల్లే 95% సర్వైకల్ క్యాన్సర్ కేసులు వస్తున్నాయి. 9 నుంచి 14 ఏళ్ల లోపు బాలికలకు రెండు డోసులు, 15 ఏళ్లు పైబడిన వారికి మూడు డోసులు ఇవ్వాలని, మొదటి డోసు తీసుకున్న 6 నెలలకు రెండో డోసు ఇస్తామని చెప్పారు. సీకేఎం దవాఖానలో ప్రతి మంగళ, శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వ్యాక్సినేషన్ అందుబాటులో ఉంటుంది. ఇందుకు ఆధార్ కార్డ్ జిరాక్స్ తీసుకురావాలని కోరారు.

**క్యాన్సర్ పై పోరాటం, వ్యాక్సినే కవచం**

ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం, భారత్‌లో ప్రతి ఏటా 1.23 లక్షల మంది మహిళలు సర్వైకల్ క్యాన్సర్ బారిన పడుతున్నారు. అందులో 67 వేల మంది ప్రాణాలు కోల్పోతున్నారు. "ఈ వ్యాక్సిన్ తీసుకుంటే ఆ ప్రమాదం నుంచి బయటపడొచ్చునని అందుకే తెలంగాణ ప్రభుత్వం పాఠశాలల్లో, పీహెచ్‌సీ ల్లో ఉచితంగా ఇస్తోంది అని హెల్త్ సూపర్వైజర్ ఎండి మసూద్ అలీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ ఎన్ఎం శశికళ, ఆశా వర్కర్లు తేజ రాణి, శ్యామల పాల్గొని బాలికలకు వ్యాక్సిన్ వేశారు. పలువురు తల్లిదండ్రులు తమ పిల్లలతో వచ్చి వ్యాక్సిన్ వేయించుకున్నారు.



# భువనగిరిలో చలో డిండి చింతపల్లి పోస్టర్ ఆవిష్కరణ

**యాదాద్రి భువనగిరి జూన్ 15 మహా**


యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణంలోని తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద సోమవారం నాడు నాగర్ కర్నూల్ జిల్లా వంగూరు మండలం డిండి చింతపల్లి గ్రామంలో జూన్ 21 న నూతనంగా నిర్మించిన తెలంగాణ అమరవీరుల స్మారక స్తూపం ఆవిష్కరణతో పాటు ర్యాలీ, బహిరంగ సభలను జయప్రదం చేయాలని టీయుజేఏసి ఆధ్వర్యంలో నాయకులు పోస్టర్ను ఆవిష్కరించారు... తొలి దశ, మలిదశ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడి అమరులైన ఉద్యమకారుల జ్ఞాపకాలను స్మరిస్తూ ఈ స్థూపం ఏర్పాటు చేసినట్లు టి యు జెఏసి మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు బాకారం లావణ్య తెలిపారు జూన్ 21న జరుగు ఈ స్తూప ఆవిష్కరణ కార్యక్రమానికి తెలంగాణ ఉద్యమకారులు పెద్ద ఎత్తున తరలి వచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు తెలంగాణ ఉద్యమకారులను గుర్తించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం జాప్యం చేయవద్దని కోరారు పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర అధ్యక్షులు పూస శ్రీనివాస్, టి యు జెఏ సి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఎర్ర జాన్సన్, రాష్ట్ర సీనియర్ దళిత నాయకులు బట్టు రామచంద్రయ్య, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు బండారు రవివర్ధన్, చిలుకమారి గణేష్ మాదిగ, తెలంగాణ ఉద్యమకారుల జిల్లా నాయకులు కొండాపురం శ్రీనివాస్, గాజుమల్ల మాధవి తదితరులు పాల్గొన్నారు.



# ప్రజావాణి దరఖాస్తులను సత్వరం పరిష్కరించాలి

**యాదాద్రి భువనగిరి జూన్ 15 మహా**

ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలని యాదాద్రి భువనగిరి జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు.సోమవారం రోజు కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు,రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి , వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 75 అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. అందులో రెవిన్యూ శాఖ 49, ఉపాధి కల్పన 4, సర్వే ల్యాండ్ 4, హౌసింగ్ 4, జిల్లా పరిషత్ 4, విద్య శాఖ 2 , గ్రామీణ అభివృద్ధి 2, పంచాయతీ 2, సంక్షేమ శాఖ, సివిల్ సప్లై , అటవీ , ఎస్సీ వెల్ఫేర్ శాఖలకు ఒక్కటి చొప్పున వచ్చాయని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మ , జడ్పీ సీఈవో శోభారాణి ,జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ రెడ్డి ,ఆర్డీవో కృష్ణారెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



# డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

**యాదాద్రి భువనగిరి జూన్ 15 మహా :** తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క జన్మదిన సందర్భంగా సోమవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య మాట్లాడుతూ, రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేస్తున్న సేవలు ప్రశంసనీయమని అన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తూ రాష్ట్ర ప్రగతికి విశేష కృషి చేస్తున్న నాయకుడిగా ఆయన గుర్తింపు పొందారని పేర్కొన్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆయురారోగ్యాలతో, ఆనందంగా, దీర్ఘాయుష్షుతో ఉండాలని ఆకాంక్షిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించి, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి మరింత సేవలందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం,తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్, రాష్ట్ర మహిళా కార్పొరేషన్ చైర్మన్ బండ్రు శోభారాణి తదితరులు ఉన్నారు.

# కాప్రా ఎస్ఆర్వో కార్యాలయంపై ఫిర్యాదు

**కుషాయిగూడ, మహా :** కాప్రా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం (ఎస్ఆర్వో)లో అవినీతి, అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ సంబంధిత అధికారులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు జిల్లా యంత్రాంగాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్, సీనియర్ అసిస్టెంట్ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ఫిర్యాదులపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు ఎం. లక్ష్మణ్ గౌడ్, డి. నాదం, జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు రేగొండ వెంకటేశ్వర్లు, జిల్లా కౌన్సిల్ సభ్యుడు ఇస్లావత్ హరినాయక్, నాయకులు గడ్డల పందు ముదిరాజ్, శ్రీనివాస్ నాయక్, గోపాలకృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు

**హౌసింగ్ కార్పొరేషన్ ఎండి గౌతమ్**



**యాదాద్రి భువనగిరి జూన్ 15 మహా :** అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు ఇవ్వడం జరుగుతుందని హౌసింగ్ కార్పొరేషన్ ఎండి గౌతమ్ అన్నారు.

సోమవారం భువనగిరి మున్సిపాలిటీ పరిధిలో సింగన్న గూడెం లోగల డబుల్ బెడ్ రూమ్ లు ,తుర్కపల్లి మండలం వాసాలమర్రి, కొండా పురం, భువనగిరి మండలం అనంతారం గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పరిశీలించిన హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ గౌతమ్, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు తో కలసి, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను,ఇందిరమ్మ ఇండ్ల ను పరిశీలించారు. ఈ సందర్భంగా అయన గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల అమలు పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. సింగన్నగూడెం లోని డబల్ బెడ్ రూమ్ పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేసి లబ్ధిదారులకు త్వరితగతిన అందజేయాలన్నారు.అనంతరం తుర్కపల్లి మండలం వాసాలమర్రి, కొండా పురం, భువనగిరి మండలం అనంతారం గ్రామంలో మొత్తం ఎన్ని ఇళ్లు మంజూరీ చేయడం జరిగిందని, వాటిలో ఎన్ని పూర్తయ్యాయని , ప్రస్తుతం ఎన్ని ఇళ్లు నిర్మాణ దశలో ఉన్నాయని , ఇంకా ఎన్ని ఇళ్ల నిర్మాణాలు ప్రారంభం కాలేదో వివరాలను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణాలు పూర్తి చేసుకున్న లబ్ధిదారుల ఇళ్లను సందర్శించి పరిశీలించారు.. ప్రభుత్వం అందించిన సహాయంతో సొంత ఇంటి కల నేర వేరిందా అని హౌసింగ్ కార్పొరేషన్ ఎండి గౌతమ్ లబ్ధిదారులతో ముచ్చటించారు . గ్రామాలలో పూరిగుడిసే, డేరా, మట్టి గోడల, రేకుల షెడ్ లలో నివసించే వారిని గుర్తించాలన్నారు. అట్టివారికి కూడా ఇందిరమ్మ ఇండ్లను మంజూరీ చేయాలనీ సంబంధిత అధికారులను ఆదేశించారు.. ఈ సందర్భంగా ఆగమ్మ ఇంటిని సందర్శించిన అధికారులు ఆమెతో మాట్లాడారు. “ఇప్పుడు మీ సొంత ఇల్లు నిర్మించుకున్నారు కదా, ఎలా అనిపిస్తోంది?” అని అడగగా, ఆగమ్మ ఆనందం వ్యక్తం చేశారు. “చాలా సంతోషంగా ఉందని . ఎన్నో సంవత్సరాలుగా సొంత ఇల్లు ఉండాలనే కల ఉండేదని . ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ కల నెరవేరింది. ఇప్పుడు భద్రంగా, గౌరవంగా మా సొంత ఇంట్లో నివసిస్తున్నాం. ఇందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు” అని ఆమె తెలిపారు.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేసి అర్హులందరికీ గృహ సౌకర్యం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ అలివేలు, ఎంపీడీవోలు, ఏఈలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు

# బెల్లంపల్లిలో క్రికెట్ అభివృద్ధికి పాటుపడతా

**బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్**

**బెల్లంపల్లి , మహా :** బెల్లంపల్లి ప్రాంతంలో క్రికెట్ అభివృద్ధికి పాటుపడతానని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. స్థానిక రైల్వే స్టేషన్ ప్రాంతంలో శ్రీ మురళి మెమోరియల్ క్రికెట్ అకాడమీ నిర్మించిన మూడవ క్రికెట్ పిచ్ ని శుక్రవారం రాత్రి ఎమ్మెల్యే వినోద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో మురళి మెమోరియల్ క్రికెట్ అకాడమీ క్రికెట్ అభివృద్ధికి కృషి చేస్తున్నదని తాము కూడా ఇందులో పాలుపంచుకుంటామని అన్నారు. అకాడమీకి కావాల్సిన సహాయ సహకారాలను అందజేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఎస్. జి. ఎఫ్ జిల్లా కార్యదర్శి గోపాల్ మాట్లాడుతూ ఎస్. జి. ఎఫ్ ఆధ్వర్యంలో జరిగే అండర్ 14, అండర్ 17 క్రికెట్ పోటీలను ఈసారి బెల్లంపల్లిలో నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి మున్సిపల్ చైర్పర్సన్ స్వాతి కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ సభ్యులు నాతరి స్వామి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు బండి ప్రభాకర్ , బెల్లంపల్లి ఒకేషనల్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం. రాజేష్, న్యాయవాది నల్లుల సంగీత, అకాడమీ నిర్వాహకులు అల్లం వెంకటేశ్వర్లు, జాడి శేఖర్, గౌతమ్, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.



# నూతన విద్యా సంవత్సరానికి ఘన స్వాగతం

**నోట్ పుస్తకాలను పంపిణీ చేసిన బండారు లక్ష్మారెడ్డి**

**కుషాయిగూడ, మహా :** నూతన విద్యా సంవత్సరం ప్రారంభాన్ని పురస్కరించుకుని కుషాయిగూడ ప్రభుత్వ పాఠశాలలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మా రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేసి కొత్త విద్యా సంవత్సరానికి స్వాగతం పలికారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. విద్యతో పాటు నైతిక విలువలు, క్రీడలు, సృజనాత్మకతను పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, బి ఆర్ఎస్ సీనియర్ నాయకులు నేమూరి మహేష్ గౌడ్ బుచ్చన్న గారి శ్రీకాంత్ రెడ్డి గంప కృష్ణ సారా అనిల్ వినోద్ ఆలేటి మైపాల్ రెడ్డిఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, స్థానిక నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# చర్లపల్లి డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు

**ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి**

**కుషాయిగూడ, మహా :** చర్లపల్లి డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో ఎన్నో ఏళ్లుగా నెలకొన్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ సమస్య పరిష్కారానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. వర్షాకాలంలో మురుగునీరు నిల్వ ఉండడంతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు నిధులు మంజూరు చేయించడంతో పాటు టెండర్ ప్రక్రియను కూడా పూర్తి చేయించినట్లు తెలిపారు.

పనులు త్వరగా ప్రారంభమై సజావుగా సాగేందుకు ఘట్‌కేసర్ పరిధిలోని రాంపల్లి ప్రాంతాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులతో, ముఖ్యంగా డీసీ వాణితో చర్చించి పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు.ఎమ్మెల్యే లక్ష్మా రెడ్డి మాట్లాడుతూ చర్లపల్లి డివిజన్ ప్రజలు చాలా కాలంగా ఎదురుచూస్తున్న డ్రైనేజీ సమస్యకు త్వరలోనే శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పనుల అమలులో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించాలని సూచించారు. ప్రజల సంక్షేమం, ప్రాంత అభివృద్ధే తమ లక్ష్యమని, చర్లపల్లి డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు నిరంతరం కృషి కొనసాగిస్తామని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు తెల్ల శ్రీధర్, మహేష్ గౌడ్‌తో పాటు కాలనీ ప్రతినిధులు సి.హెచ్. సురేందర్ రెడ్డి, కె. కృష్ణా రెడ్డి, డి. భూమ్ రెడ్డి, సి.హెచ్. వెంకట్రాం రెడ్డి, వి. జీవన్ రెడ్డి, బి. సుదర్శన్, సి.హెచ్. శ్రీనివాస్ రెడ్డి, పి. పవన్ కుమార్ రెడ్డి, కె. సాయినాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలి

- **మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య**

**మంచిర్యాల, మహా :** ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య పిలుపునిచ్చారు. సోమవారం 202627 విద్యా సంవత్సరం తొలిరోజు సందర్భంగా జైపూర్ మండలం ఇందారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యను జీవితంలో అత్యంత విలువైన ఆస్తిగా భావించి కష్టపడి చదివి ఎంచుకున్న లక్ష్యాలను సాధించాలని ఆయన వెల్లడించారు. పాఠశాలలోని తరగతి గదులు, గ్రంథాలయం, సైన్స్ ప్రయోగశాలలు, కంప్యూటర్ ల్యాబ్, క్రీడా గది తదితర సౌకర్యాలను పరిశీలించి విద్యార్థులకు అందిస్తున్న విద్యా వాతావరణం, మౌలిక వసతుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రంథాలయాన్ని సందర్శించి విద్యార్థులు ప్రతిరోజూ పుస్తక పఠనానికి సమయం కేటాయించాలని, పాఠ్యపుస్తకాలతో పాటు సాధారణ విజ్ఞానం, స్ఫూర్తిదాయక వ్యక్తుల జీవిత చరిత్రలు, సాహిత్య పుస్తకాలు చదవడం ద్వారా జ్ఞానాన్ని విస్తరించుకోవాలని చెప్పుకొచ్చారు. ప్రభుత్వ పాఠశాలలలో నాణ్యమైన విద్యతో పాటు ఆధునిక సౌకర్యాలు, అర్హత కలిగిన ఉపాధ్యాయులు అందుబాటులో ఉన్నారని పేర్కొన్నారు.విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకుని పోటీ ప్రపంచంలో రాణించేందుకు సిద్ధం కావాలని తెలిపారు.అనంతరం ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు అందజేశారు. విద్యా సంవత్సరపు మొదటి రోజు నుంచే క్రమశిక్షణతో చదువుపై దృష్టి సారించాలని, ప్రతి రోజు నేర్చుకునే అలవాటు పెంపొందించుకోవాలని తెలిపారు. విద్యతో పాటు క్రీడలు, సహపాఠ్య కార్యకలాపాలలో పాల్గొని వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి, మండల విద్యాధికారి, పంచాయతీ కార్యదర్శి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సర్పంచ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# మహాకవి శ్రీశ్రీ వర్ధంతి సంస్మరణ సభ

**శ్రీశ్రీ తెలుగు ప్రజల్లో మర్చిపోలేని మహాకవి**

**కుషాయిగూడ, మహా :** మహాకవి శ్రీశ్రీ 43వ వర్ధంతి సందర్భంగా తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో సోమవారం కమలానగర్ కార్యాలయంలో సంస్మరణ సభ నిర్వహించారు. స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గౌడుగు యాదగిరిరావు సభకు అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా ప్రముఖ కవి, రచయిత వి.బి. బంగారు ఆచార్యులు, స్ఫూర్తి గ్రూప్ నాయకులు ఎం. భాస్కరరావు మహాకవి శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అధ్యక్షుడు గౌడుగు యాదగిరిరావు మాట్లాడుతూ శ్రీశ్రీ కవిత్వం చందస్సు, పదబంధాల సంకెళ్లను తెంచి సామాన్యుల భాషలో కొత్త దిశను చూపించారు. తెలుగు సాహిత్యాన్ని ప్రజలకు చేరువ చేసిన తిక్కన, వేమన, గురజాడలే నిజమైన కవిత్రయమని పేర్కొన్నారు. సాంప్రదాయ కవిత్వాన్ని ప్రజల అవసరాలకు అనుగుణంగా మలిచిన కవిగా శ్రీశ్రీ నిలిచారని చెప్పారు.బంగారు ఆచార్యులు మాట్లాడుతూ కవిత్వంలో నూతన ప్రయోగాలకు శ్రీశ్రీ నాంది పలికారన్నారు. అభ్యుదయ భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు. జయరాజు, జి. శివరామకృష్ణ ప్రసంగిస్తూ శ్రీశ్రీ కేవలం కవిత్వానికే పరిమితం కాకుండా అనేక సినీ గీతాలను రచించి తెలుగు సాహిత్యానికి, సినీరంగానికి విశిష్ట సేవలు అందించారని తెలిపారు.అనంతరం సభలో పాల్గొన్న సభ్యులందరూ శ్రీశ్రీ చిత్రపటానికి పూలు సమర్పించి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎం. శ్రీనివాసరావు, ఎన్. శ్రీనివాస్, ఉన్నికృష్ణన్, శోభ, గౌసియా, దువా కిరణ్, ఉమామహేశ్వరరావు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



# చర్లపల్లి జైలులో ఐటీఐ ఏర్పాటుకు సన్నాహాలు వేగవంతం


**జైళ్ల శాఖ డిజి సౌమ్య మిశ్రా**

**కుషాయిగూడ, మహా :** చర్లపల్లి కేంద్ర కారాగారంలో ఖైదీల పునరావాసం, నైపుణ్యాభివృద్ధిని మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ (ఐటీఐ) ఏర్పాటుకు తెలంగాణ కారాగార శాఖ చర్యలు చేపట్టింది. ఈ ఏర్పాట్లను తెలంగాణ కారాగార మరియు సంస్కరణ సేవల డైరెక్టర్ జనరల్ డా. సౌమ్య మిశ్రా సమీక్షించారు. ప్రతిపాదిత ఐటీఐ ద్వారా ఖైదీలకు ఉపాధి ఆధారిత సాంకేతిక, వృత్తి విద్యా శిక్షణ అందించి పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు కల్పించనున్నారు. దీని ద్వారా విడుదల అనంతరం ఉపాధి అవకాశాలు మెరుగుపడటంతో పాటు స్వయం ఉపాధి అవకాశాలు పెరిగి, ఖైదీలలో ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని అధికారులు భావిస్తున్నారు.ఐటీఐ ఏర్పాటుకు సంబంధించిన సన్నాహకాలలో భాగంగా డా. సౌమ్య మిశ్రా హైదరాబాద్‌లోని నేషనల్ స్కిల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ మరియు నేషనల్ స్కిల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఉమెన్లను సందర్శించి మౌలిక వసతులు, శిక్షణా విధానాలు, అఫిలియేషన్ ప్రక్రియలపై అవగాహన పొందారు.అనంతరం చర్లపల్లి కేంద్ర కారాగారాన్ని సందర్శించి ఐటీఐ ఏర్పాటుకు అవసరమైన మౌలిక వసతుల అభివృద్ధి, అఫిలియేషన్ ప్రక్రియలు, ఇతర సన్నాహక పనులను సమీక్షించారు. కారాగారాల్లో నాణ్యమైన సాంకేతిక విద్య అందించడం అవసరమని పేర్కొన్న ఆమె, ఐటీఐ ప్రారంభానికి అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.సమీక్ష సమావేశంలో ఎన్. మురళీ బాబు, డి. శ్రీనివాస్, ఎం. ఖాలిద్ అఖ్తర్, జి. ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

# సీసీఐని సందర్శించిన మున్సిపల్ కౌన్సిలర్లు

- **కూల్చివేత పట్ల ఆందోళన**
- **మున్సిపల్, విద్యుత్ బకాయిలు చెల్లించాలని డిమాండ్**
- **కలెక్టర్ ఎస్పీ కి వినతులు**

**ఆదిలాబాద్ మహా :** అదిలాబాద్ పట్టణంలో వేల కోట్ల రూపాయల ప్రజాధనంతో నిర్మించబడిన సీసీఐ ఫ్యాక్టరీని కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి కారణంగా కేవలం సుమారు రూ.50 కోట్లకే తుక్కుకింద అమ్మడం తీవ్ర ఆందోళనకు గురిచేస్తోందని మున్సిపల్ ప్రజాప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు.సోమవారం మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్, కాంగ్రెస్ , బీఆర్ఎస్ , ఎంఐఎం కౌన్సిలర్లు సీసీఐ ఫ్యాక్టరీని సందర్శించి డిస్మెంటల్ జరుగుతున్న ప్రాంతాలను పరిశీలించారు. ఫ్యాక్టరీ డిస్మెంటల్ చేయడం వల్ల ప్రభుత్వానికి, ప్రజలకు భారీ నష్టం జరుగుతుందని అన్నారు. ఫ్యాక్టరీ మూతపడటంతో వేలాది మంది ఉపాధి అవకాశాలు కోల్పోయి రోడ్డున పడిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.అదేవిధంగా సీసీఐ యాజమాన్యం అదిలాబాద్ మున్సిపాలిటీకి చెల్లించాల్సిన రూ.4.44 కోట్ల మున్సిపల్ పన్ను బకాయిలను ,ఎలక్ట్రిసిటీ డిపార్ట్మెంట్ కు స్థానిక గ్రామపంచాయతీకి కోట్ల రూపాయలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేసారు.ఈ బకాయి నిధులు విడుదలైతే పట్టణ అభివృద్ధి కార్యక్రమాలకు ఉపయోగపడతాయని తెలిపారు. తమ సొంత వ్యవసాయ భూములను సిసిఐ యాజమాన్యానికి అప్పగించిన రైతుల కుటుంబాలు రోడ్డున పడ్డాయని అన్నారు..ప్రజల ఆస్తులను కాపాడాలని, సీసీఐ ఫ్యాక్టరీ భవిష్యత్తుపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని కోరారు. కార్మికులు యువత ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని తగిన చర్యలు తీసుకోవాలన్నారు.గత రెండు నెలలుగా నాలుగుసార్లు మున్సిపల్ అధికారులు ఫిర్యాదు చేసినప్పటికిని సీసీఐ యాజమాన్యం స్పందించ లేదని అన్నారు. తెలపడం జరిగింది. అనంతరం జిల్లా కలెక్టర్, ఎస్పీ ని కలిసి వినతి పత్రాలు సమర్పించారు..




## భారీగా క్రెడిట్ కార్డు అప్పులు.. కియోసాకి అలర్ట్

ప్రపంచ ప్రసిద్ధ పర్సనల్ ఫైనాన్స్ పుస్తకం 'రిచ్ డాడ్ పూర్ డాడ్' రచయిత రాబర్ట్ కియోసాకి అమెరికన్ల పెరుగుతున్న క్రెడిట్ కార్డు అప్పులపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన తన ఫేస్‌బుక్ ఖాతాలో చేసిన పోస్టులో వినియోగపు అలవాట్లు ఎలా ఆర్థిక భారంగా మారుతున్నాయో వివరించారు. ప్రపంచ ప్రసిద్ధ పర్సనల్ ఫైనాన్స్ పుస్తకం 'రిచ్ డాడ్ పూర్ డాడ్' రచయిత రాబర్ట్ కియోసాకి అమెరికన్ల పెరుగుతున్న క్రెడిట్ కార్డు అప్పులపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన తన ఫేస్‌బుక్ ఖాతాలో చేసిన పోస్టులో వినియోగపు అలవాట్లు ఎలా ఆర్థిక భారంగా మారుతున్నాయో వివరించారు. ప్రస్తుతం అమెరికన్లు క్రెడిట్ కార్డులపై 1.28 ట్రిలియన్ డాలర్లు (సుమారు రూ.120 లక్షల కోట్లు) అప్పుల్లో ఉన్నారన్న కియోసాకి, ఈ భారీ అప్పులకు అనవసర ఖర్చులే ప్రధాన కారణమని అభిప్రాయపడ్డారు.

అమెరికన్లు చేసిన ఖర్చుల జాబితాను ప్రస్తావిస్తూ ఆయన కొన్ని ఉదాహరణలు కూడా ఇచ్చారు. ఖరీదైన రెస్టారెంట్లలో విందులు, వాడకపోయినా స్ట్రీమింగ్ సర్వీసుల సబ్‌స్క్రిప్షన్లను కొనసాగించడం, అనవసరంగా దుస్తులు కొనుగోలు చేయడం, విహారయాత్రల కోసం అప్పులు చేయడం, గుర్తింపులేని ఆన్‌లైన్ షాపింగ్ ఆర్డర్లు, ఉపయోగించని జిమ్ సభ్యత్వాలు వంటి ఖర్చులు ప్రజలను అప్పుల ఊబిలోకి నెడుతున్నాయని ఆయన పేర్కొన్నారు.అలాగే కొత్త గ్యాడ్జెట్లు, అప్‌గ్రేడ్‌లు, వివిధ సబ్‌స్క్రిప్షన్లు, సౌకర్యాల కోసం చెల్లించే అదనపు రుసుములు కొనుగోలు సమయంలో అవసరమైనవిగా అనిపించినప్పటికీ, తర్వాత అవే ఆర్థిక భారంగా మారుతాయని కియోసాకి హెచ్చరించారు. తన ప్రసిద్ధ పుస్తకం 'రిచ్ డాడ్ పూర్ డాడ్'లో ఉపయోగించిన "డూడాడ్స్" అనే పదాన్ని గుర్తుచేస్తూ, అవసరం లేని వస్తువులు మనల్ని ధనవంతుల్లా భావింపజేసినా, వాస్తవానికి పేదరికం వైపు నెడతాయని ఆయన వ్యాఖ్యానించారు. ప్రస్తుతం సగటు అమెరికన్ వ్యక్తి సుమారు 7,900 డాలర్లు (దాదాపు రూ.6.8 లక్షలు) క్రెడిట్ కార్డు అప్పుతో ఉన్నారని, దానిపై 24 శాతం వడ్డీ చెల్లిస్తూ మినిమమ్ డ్యూలతో నెట్టుకొస్తున్నారని కియోసాకి తెలిపారు. ఇలాంటి అప్పులపై వడ్డీ చక్రవడ్డీలా పెరుగుతూ ఆర్థిక స్వేచ్ఛను దూరం చేస్తుందని ఆయన హెచ్చరించారు.అందరూ తమ ఖర్చుల అలవాట్లను పరిశీలించుకోవాలని, అవసరం లేని వ్యయాలను తగ్గించి నిజమైన సంపద సృష్టి వైపు అడుగులు వేయాలని ఆయన సూచించారు. ఈ నేపథ్యంలో ఖర్చులను నియంత్రించి ఆర్థిక స్థిరత్వం సాధించేందుకు తాను ఒక ఉచిత మార్గదర్శకాన్ని సిద్ధం చేశానని తన పోస్టులో పేర్కొన్నారు.

## ఇథనాల్‌తో నడిచే వ్యాగన్ ఆర్: ధర ఎంతంటే?




భారతదేశంలో పర్యావరణ హిత ఇంధనాల వినియోగాన్ని పెంచేందుకు ప్రభుత్వం, వాహన తయారీ సంస్థలు అనేక చర్యలు చేపడుతున్నాయి. ఇందులో భాగంగానే మారుతి సుజుకి వ్యాగన్ ఆర్ ఫ్లెక్స్ ఫ్యూయల్ కారును దేశీయ విఫణిలో లాంచ్ చేసింది. ఇది ఇథనాల్ పెట్రోల్ మిశ్రమాలతో పనిచేయగల సామర్థ్యాన్ని కలిగి ఉంది. కంపెనీ వ్యాగన్ ఆర్ ఫ్లెక్స్ ఫ్యూయల్ కారును లాంచ్ చేసిన సమయంలో ధరలను ప్రకటించలేదు. అయితే తాజాగా సంస్థ ఈ వాహనం ధరను రూ.7.24 లక్షలు (ఎక్స్‌షోరూమ్)గా ప్రకటించింది. వ్యాగన్ ఆర్ ఫ్లెక్స్ ఫ్యూయల్ కారు.. స్టాండర్డ్ వ్యాగన్ ఆర్ ZXi+ వేరియంట్ ఆధారంగా నిర్మితమైంది. కాబట్టి ఇందులో 1.2 లీటర్ K12N పెట్రోల్ ఇంజిన్ ఉంది. అయితే ధర మాత్రం జెడ్ఎక్స్ఐ ప్లస్ వేరియంట్ కంటే రూ. 86,000 ఎక్కువ. వ్యాగన్ ఆర్ ఫ్లెక్స్ ఫ్యూయల్ వెహికల్ E20 నుంచి E85 వరకు ఉన్న ఇథనాల్ పెట్రోల్ మిశ్రమాలతో నడుస్తుంది. అంటే ఇంధనంలో 20 శాతం నుంచి 85 శాతం వరకు ఇథనాల్ ఉన్నప్పటికీ ఇంజిన్ సమర్థవంతంగా పనిచేస్తుంది. ఇథనాల్ వినియోగం వల్ల పెట్రోల్‌పై ఆధారపడటం తగ్గడమే కాకుండా, కాలుష్యం కూడా కొంత మేర తగ్గుతుంది. అంతేకాకుండా.. చెరకు వంటి పంటల నుంచి ఉత్పత్తి అయ్యే ఇథనాల్‌కు డిమాండ్ పెరగడం వల్ల రైతులకు కూడా ప్రయోజనం కలుగుతుంది. అయితే.. ఈ వాహనం ప్రస్తుతం సాధారణ వినియోగదారులకు కాకుండా కేవలం వాణిజ్య అవసరాల కోసం మాత్రమే అందుబాటులో ఉంచడం గమనార్హం. కమర్షియల్ విభాగంలో ఇప్పటికే ఉన్న వ్యాగన్ ఆర్ టూర్ H3తో పోలిస్తే ఫ్లెక్స్ ఫ్యూయల్ ధర ఎక్కువగా ఉన్నప్పటికీ, ఇందులో ఉన్న 1.2 లీటర్ ఇంజిన్ మరింత మెరుగైన పనితీరును అందిస్తుంది. టూర్ H3లో 1.0 లీటర్ ఇంజిన్ మాత్రమే అందుబాటులో ఉంది. పనితీరు విషయానికి వస్తే.. ఫ్లెక్స్ ఫ్యూయల్ వేరియంట్‌లో పవర్ లేదా టార్క్ పరంగా ఎటువంటి పెరుగుదల లేదు. ఈ 1.2 లీటర్ ఇంజిన్ గరిష్ఠంగా 90.9 హార్స్‌పవర్, 113.7 న్యూటన్ మీటర్ టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఇది 5స్పీడ్ మాన్యువల్ గేర్‌బాక్స్‌తో మాత్రమే అందుబాటులో ఉంది. అయితే ఈ కారు ఎంత మైలేజ్ ఇస్తుందనే విషయాన్ని మాత్రం కంపెనీ అధికారికంగా వెల్లడించలేదు.

## పీఎఫ్ డబ్బులు రూ.2.5 కోట్లు వెనక్కివ్వాలని నోటీసు..




రిటైర్మెంట్ అనంతరం మెరుగైన జీవనం కోసం ఉద్యోగులు తమ సర్వీసు కాలమంతా పీఎఫ్ సొమ్మును పొదుపు చేసుకుంటారు. పదవీ విరమణ తర్వాత వచ్చే భారీ మొత్తంతో ఆర్థిక ఇబ్బందులు లేకుండా జీవనం కొనసాగుతుందని భావిస్తారు. అయితే ఇలాగే పొదుపు చేసుకున్న పీఎఫ్ సొమ్మును అందుకున్న ఓ ఉద్యోగిని ఆ సొమ్మును తిరిగి ఇచ్చేయాలని ఈపీఎఫ్‌వో నోటీసు ఇచ్చింది. దీనికిపై ఆ ఉద్యోగి కోర్టుకు వెళ్లగా ఏం జరిగిందంటే..పదవీ విరమణ పొందిన ఉద్యోగికి చెల్లించిన ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) మొత్తాన్ని తిరిగి చెల్లించాలని ఈపీఎఫ్‌వో కోరడం చట్టబద్ధం కాదని తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసింది. ఉద్యోగికి చెల్లించిన పీఎఫ్‌లో ఏవైనా నిబంధనల ఉల్లంఘనలు జరిగి ఉంటే, వాటికి బాధ్యత యజమాని సంస్థ లేదా దాని పీఎఫ్ ట్రస్ట్‌దేనని, ఉద్యోగిది కాదని కోర్టు తేల్చిచెప్పింది.జస్టిస్ నగేష్ భీమాపాక 2025లో దాఖలైన రిట్ పిటిషన్ నెం. 6276పై ఈ తీర్పు ఇచ్చారు. రిటైర్డ్ ఉద్యోగి జె.వి. నృపేందర్ రావుకు ఈపీఎఫ్‌వో జారీ చేసిన రికవరీ నోటీసును కోర్టు రద్దు చేసింది. అయితే సదురు కంపెనీపై అవసరమైతే చట్టపరమైన చర్యలు తీసుకునే స్వేచ్ఛను ఈపీఎఫ్‌వోకు ఇచ్చింది.

### రూ.2.5 కోట్ల చెల్లింపుతో మొదలైన వివాదం

జె.వి. నృపేందర్ రావు పనిచేసిన సంస్థకు సొంత పీఎఫ్ ట్రస్ట్ ఉండేది. ఈ ట్రస్ట్‌కు 1981 నుంచే 'ఎగ్జెంప్టెడ్ ఎస్టాబ్లిష్‌మెంట్' హోదా ఉండేది. అయితే సంస్థ 2023 మార్చి 1 నుంచి ఆ హోదాను సరెండర్ చేసింది. అనంతరం 2023 జూలై 21న రావుకు రూ.2.50 కోట్ల పీఎఫ్ బకాయిలు చెల్లించింది. మరో రూ.70 లక్షలు యెస్ బ్యాంక్ బాండ్లలో నిలిచిపోవడంతో తర్వాత చెల్లిస్తామని తెలిపింది.సంస్థ పీఎఫ్ ట్రస్ట్ నిధుల్లో భాగంగా యెస్ బ్యాంక్ బాండ్లలో పెట్టుబడులు పెట్టింది. రిజర్వ్ బ్యాంక్ ఆదేశాలు, సుప్రీంకోర్టు చర్యల కారణంగా ఆ బాండ్లు నిలిచిపోవడంతో కొంత మొత్తం విడుదల కాలేదు. దీంతో ఉద్యోగికి విడతల వారీగా చెల్లింపులు జరిగాయి.

### ఈపీఎఫ్‌వో రికవరీ నోటీసు

ఎగ్జెంప్షన్ హోదా సరెండర్ చేసిన తర్వాత పీఎఫ్ ట్రస్ట్ ఉద్యోగికి నేరుగా చెల్లింపులు చేయడం నిబంధనలకు విరుద్ధమని ఈపీఎఫ్‌వో అభిప్రాయపడింది. ఉద్యోగి అందుకున్న రూ.2.5 కోట్లను 12 శాతం వడ్డీతో తిరిగి చెల్లించాలని దీంతో 2025 ఫిబ్రవరి 17న నోటీసు జారీ చేసింది. ఈ మొత్తాన్ని ఏడు రోజుల్లో చెల్లించాలని ఆదేశించింది.

### కోర్టు ఏమంది?

ఈపీఎఫ్ చట్టం ఉద్యోగుల సంక్షేమం కోసం రూపొందించిన సామాజిక భద్రత చట్టమని హైకోర్టు పేర్కొంది. ఎగ్జెంప్షన్ సరెండర్ తర్వాత పీఎఫ్ నిధులను ఈపీఎఫ్‌వోకు బదిలీ చేసే బాధ్యత పూర్తిగా యజమాన్య సంస్థ, దాని ట్రస్ట్‌పైనే ఉంటుందని స్పష్టం చేసింది. ఉద్యోగి తనకు చట్టబద్ధంగా రావలసిన మొత్తాన్ని స్వీకరించినందుకు అతనిపై రికవరీ చర్యలు తీసుకోవడం సరైంది కాదని వ్యాఖ్యానించింది. అంతేకాకుండా ఉద్యోగిపై మోసం, తప్పుడు సమాచారం లేదా కుమ్మక్కు ఆరోపణలు ఏవీ లేవని కోర్టు గమనించింది. అలాంటి పరిస్థితుల్లో ఉద్యోగి నుంచి డబ్బు వసూలు చేయడానికి చట్టంలో స్పష్టమైన నిబంధన లేదని పేర్కొంది. రికవరీ నోటీసు జారీ చేసే ముందు ఉద్యోగికి షోకాజ్ నోటీసు ఇవ్వకపోవడం, వ్యక్తిగత విచారణకు అవకాశం కల్పించకపోవడం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని కోర్టు అభిప్రాయపడింది. అందువల్ల ఈపీఎఫ్‌వో జారీ చేసిన నోటీసును రద్దు చేసింది. అయితే పీఎఫ్ ట్రస్ట్ నిబంధనలను ఉల్లంఘించిందా? లేదా? అన్న అంశంపై హైకోర్టు ఎలాంటి తుది అభిప్రాయం వ్యక్తం చేయలేదు. అవసరమైతే ఈపీఎఫ్ చట్టం ప్రకారం సంస్థ లేదా దాని ట్రస్ట్‌పై తగిన చర్యలు తీసుకోవచ్చని ఈపీఎఫ్‌వోకు స్వేచ్ఛ ఇచ్చింది.


### సొంత పీఎఫ్ ట్రస్ట్ అంటే ఏమిటి?

సాధారణంగా ఉద్యోగుల పీఎఫ్ చందాలు నేరుగా ఈపీఎఫ్‌వోకు వెళ్తాయి. కానీ కొన్ని సంస్థలు అనుమతి తీసుకుని తమ సొంత పీఎఫ్ ట్రస్ట్ ఏర్పాటు చేసుకుంటాయి. ఉద్యోగుల, యజమాని చందాలను ఈ ట్రస్ట్ నిర్వహిస్తుంది.

# దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL

## రాజభవనం టూ జైలు..

### యువరాణి కుమారుడికి నాలుగేళ్ల శిక్ష



**ఓస్లో:** నార్వే రాజ కుటుంబాన్ని గత రెండేళ్లుగా కుదిపేస్తున్న లైంగిక దాడుల కేసులో కీలక తీర్పు వెలువడింది. నార్వే యువరాణి మెట్టే మారిట్‌కుమారుడైన మారియస్ బోర్గ్ హోయిబీపై నమోదైన అత్యాచారం, గృహహింస, బెదిరింపులు తదితర కేసుల్లో ఓస్లో జిల్లా కోర్టు నాలుగేళ్ల జైలు శిక్ష విధించింది. కాగా, ఈ కేసు నార్వే చరిత్రలో రాజ కుటుంబానికి సంబంధించిన అత్యంత వివాదాస్పద నేర విచారణల్లో ఒకటిగా నిలిచింది. నెలల తరబడి సాగిన దర్యాప్తు, ఆరు వారాలకు పైగా కొనసాగిన విచారణ తర్వాత కోర్టు ఈ తీర్పు వెలువరించింది.

### ఎవరు మారియస్?

మారియస్ బోర్గ్ హోయిబీ నార్వే యువరాణి మెట్టేమారిట్‌కి మొదటి వివాహం ద్వారా జన్మించాడు. 2001లో ఆమె యువరాజు హాకోన్‌ను వివాహం చేసుకుంది. అనంతరం, మారియస్ కూడా రాజ కుటుంబంలో భాగమయ్యాడు. అయితే అతనికి రాజవంశ వారసత్వ హక్కులు లేదా అధికారిక రాజకుటుంబ హోదా లేవు. అయినప్పటికీ, చిన్నప్పటి నుంచే రాజకుటుంబ సభ్యుడిగా ప్రజల దృష్టిలో ఉన్నాడు.

### ఏయే ఆరోపణలు ఎదుర్కొన్నాడు?

ప్రాసిక్యూషన్ ప్రకారం, మారియస్‌పై మొత్తం 40 వరకు క్రిమినల్ ఆరోపణలు నమోదయ్యాయి. వాటిలో.. నాలుగు అత్యాచార ఆరోపణలు, మహిళలపై లైంగిక దాడులు, గృహహింస, బెదిరింపులు, నిరోధాజ్ఞ ఉల్లంఘనలు, మాదకద్రవ్యాలకు సంబంధించిన నేరాలు, ట్రాఫిక్ ఉల్లంఘనలు వంటి కేసులు ఉన్నాయి. దీంతో, ప్రాసిక్యూటర్లు అతడికి 7 సంవత్సరాల 7 నెలల జైలు శిక్ష విధించాలని కోరగా, కోర్టు చివరకు నాలుగేళ్ల శిక్షను ఖరారు చేసింది.

### కోర్టు ఏం తేల్చింది?

కోర్టు రెండు అత్యాచార కేసుల్లో మారియస్‌ను దోషిగా నిర్ధారించింది. మరికొన్ని అత్యాచార ఆరోపణల నుంచి అతడికి విముక్తి లభించినప్పటికీ, గృహహింస మరియు ఇతర నేరాల్లో కూడా దోషిగా తేలాడు. విచారణ సమయంలో బాధిత మహిళల వాంగ్మూలాలు, మొబైల్ ఫోన్ డేటా, సందేశాలు, వీడియో ఆధారాలు తదితర అంశాలను కోర్టు పరిశీలించింది. విచారణలో వెలుగులోకి వచ్చిన వివరాలు నార్వే సమాజాన్ని తీవ్రంగా కలచివేశాయి. మరోవైపు.. మారియస్ అత్యాచార ఆరోపణలను ఎప్పటి నుంచో ఖండిస్తున్నాడు. తాను అత్యాచారాలకు పాల్పడలేదని, అయితే కొన్ని చిన్న నేరాలు, మాదకద్రవ్యాల రవాణా, దాడి వంటి ఆరోపణలను మాత్రం అంగీకరించాడు. తీర్పుపై అప్పీల్ చేసే హక్కు అతనికి ఉంది.

### రాజ కుటుంబంపై తీవ్ర ప్రభావం

ఈ కేసు నార్వే రాజ కుటుంబ ప్రతిష్ఠను తీవ్రంగా దెబ్బతీసింది. విచారణ సమయంలో రాజ్యాంగ రాజరిక వ్యవస్థపై ప్రజల మద్దతు కూడా తగ్గిందని సర్వేలు సూచించాయి. అయితే ఇటీవలి నెలల్లో పరిస్థితి కొంత మెరుగుపడింది. ఈ పరిణామాల మధ్య యువరాణి మెట్టేమారిట్ తీవ్రమైన ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్నారు. ఆమె ప్రస్తుతం ఊపిరితిత్తుల మార్పిడి కోసం వేచి ఉన్నట్లు సమాచారం. తన తల్లి ఆరోగ్య పరిస్థితి కారణంగా తాత్కాలిక విడుదల కోరిన మారియస్ అభ్యర్థనను కూడా అప్పీల్ కోర్టు తిరస్కరించింది.

### నార్వేలో చర్చనీయాంశం

రాజ కుటుంబానికి సమీప వ్యక్తి అయినప్పటికీ, చట్టం ముందు అందరూ సమానమేనని ఈ తీర్పు మరోసారి రుజువు చేసిందని మహిళా హక్కుల సంఘాలు పేర్కొన్నాయి.

## ప్రమాదంలో ఇరాన్-అమెరికా డీల్?!

*పశ్చిమాసియా సంక్షోభం మరో కీలక మలుపు తీసుకుంటున్నట్లు కనిపిస్తోంది. యుద్ధం ముగిసిందని ఊపిరి పీల్చుకుంటున్న తరుణంలోనే ఇజ్రాయెల్ వైఖరి కొత్త ఉద్రిక్తతలకు దారితీసింది. భద్రతా విషయంలో తగ్గేదేలే అంటూ ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ చెబుతుండడం.. లెబనాన్‌పై కొనసాగుతున్న భీకర దాడులు శాంతి చర్చలపై తీవ్ర ప్రభావం చూపొచ్చన్న ఆందోళనలు పెంచుతున్నాయి.*



అమెరికా-ఇరాన్ మధ్య నెలల తరబడి సాగిన శాంతి చర్చలు తుది దశకు చేరుకుంటున్న సమయంలోనే మిడిల్ ఈస్ట్‌లో పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. డీల్‌కు ససేమీరా చెబుతూ.. లెబనాన్‌పై ఇజ్రాయెల్ చర్యలకు దిగింది. లెబనాన్ రాజధాని బీరూట్‌తో పాటు దక్షిణ ప్రాంతాల్లో డ్రోన్ దాడులు జరిగినట్లు లెబనాన్ మీడియా తెలిపింది. కఫర్ టెబ్నిట్ ప్రాంతంలో కూడా డ్రోన్ దాడి జరిగినట్లు సమాచారం. ఆదివారం హెజ్‌బొల్లా లక్ష్యాలపై ఇజ్రాయెల్ భీకర దాడులు కొనసాగించినట్లు నివేదికలు పేర్కొంటున్నాయి. ఇవి జనావాసాలను కూడా ప్రభావితం చేస్తున్నాయని లెబనాన్ అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తూ, అంతర్జాతీయ జోక్యం కోరుతున్నారు. డీల్ కుదిరిందని ట్రంప్ ప్రకటించిన వేళ.. ఇజ్రాయెల్ వైపు నుంచి మరింత కఠిన వ్యాఖ్యలు వెలువడుతున్నాయి. ''ట్రంప్ నిర్ణయాలు మమ్మల్ని ప్రభావితం చేయలేవు. లెబనాన్‌పై దాడులు కొనసాగిస్తాం. భద్రతా విషయంలో రాజీ పడేది లేదు'' అని నెతన్యాహు చెప్పినట్లు అంతర్జాతీయా మీడియా సంస్థలు కథనాలు ఇస్తున్నాయి. ఇక ట్రంప్ కుదిర్చిన ఒప్పందం తమను కట్టిపడేయదని ఇజ్రాయెల్ మంత్రి ఇత్మార్ బెన్ గ్విర్ వ్యాఖ్యానించినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. "భద్రత విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదు" అనే సందేశాన్ని ఇజ్రాయెల్ స్పష్టంగా ఇచ్చినట్లు తెలుస్తోంది. ఇదే క్రమంలో రక్షణ మంత్రి ఇజ్రాయెల్ కాట్జ్ మాట్లాడుతూ, ప్రధాని నెతన్యాహుతో కలిసి తాము స్పష్టమైన భద్రతా విధానాన్ని అనుసరిస్తున్నామని తెలిపారు. లెబనాన్, సిరియా, గాజా ప్రాంతాల్లో భద్రతా జోన్లలో ఇజ్రాయెల్ సైన్యం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. అంతర్జాతీయ ఒత్తిడులున్నప్పటికీ తమ వైఖరిలో మార్పు ఉండదని, దేశ భద్రతే ప్రధాన ప్రాధాన్యమని ఆయన తేల్చిచెప్పారు. లెబనాన్ పరిణామాల కారణంగా ఇరాన్ దాడి చేస్తే తక్షణ ప్రతిచర్య తప్పదని ఆయన హెచ్చరించారు. అంతకు ముందు.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు కూడా దౌత్య వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. 'ది న్యూయార్క్ టైమ్స్'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ, నెతన్యాహు చాలా కఠినమైన నాయకుడని, ఆయన తీసుకున్న కొన్ని నిర్ణయాలు శాంతి చర్చలను క్లిష్టం చేశాయని వ్యాఖ్యానించారు. బీరూట్ ఘటనలు అమెరికా-ఇరాన్ శాంతి ఒప్పందంపై ప్రతికూల ప్రభావం చూపినట్లు కూడా ఆయన అభిప్రాయపడ్డారు.

మొత్తం పరిణామాలను చూస్తే, ఒకవైపు అమెరికా-ఇరాన్ మధ్య శాంతి ఒప్పందంపై ఆశలు కొనసాగుతున్నప్పటికీ, మరోవైపు లెబనాన్ కేంద్రంగా కొనసాగుతున్న ఇజ్రాయెల్ చర్యలు ఆ ప్రక్రియకు ప్రధాన అడ్డంకిగా మారే అవకాశం కనిపిస్తోంది. ఇరాన్ గనుక ఈ దాడులకు ప్రతిస్పందిస్తే.. పశ్చిమాసియాలో శాంతి ప్రయత్నాలు మళ్లీ ప్రమాదంలో పడిన పరిస్థితి నెలకొంది.

## పాకిస్థాన్‌లో కాల్పులు.. పదేళ్ల విదేశీ చిన్నారి మృతి



**ఇస్లామాబాద్:** పాకిస్తాన్ పంజాబ్ ప్రావిన్స్‌లో విషాదం చోటుచేసుకుంది. ఒక పోలీసు అధికారి చేసిన పొరపాటుతో పదేళ్ల ముక్కపచ్చలారని చిన్నారి ప్రాణాలు కోల్పోయింది. దొంగతనానికి సంబంధించిన ముఠాను ఛేదిస్తున్న క్రమంలో జరిపిన కాల్పుల్లో పొరపాటున విదేశీయులకు బుల్లెట్లు తగిలాయి. ఈ ఘటనలో ఆస్ట్రేలియాకు చెందిన బాలిక అక్కడికక్కడే మృతిచెందగా మరో ఇద్దరు సభ్యులు తీవ్రంగా గాయపడ్డారు. దీంతో ఈ కేసుకు సంబంధించి ఒక పోలీసు అధికారిని అరెస్టు చేశారు. పంజాబ్ పోలీసుల కథనం ప్రకారం, దోపిడీ జరిగినట్లు సమాచారం రావడంతో పోలీసులు వెను వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. అయితే ఆ సమయంలో అనుమానితులు కుటుంబ కారులో పారిపోవడానికి ప్రయత్నిస్తున్నారని ఒక కుటుంబానికి చెందిన వాహనాన్ని అడ్డగించారు. వారు ఆపకపోవడంతో అధికారి పొరపాటుగా భావించి కాల్పులు జరిపాడని పోలీసులు తెలిపారు. అయితే ఈకాల్పుల ఘటనలో దురదృష్టవశాత్తు ఆస్ట్రేలియాకు చెందిన 10 ఏళ్ల హానియా అనే బాలిక మరణించగా, ఆమె తండ్రి, సోదరుడు గాయపడ్డారని తెలిపారు. దీంతో ఈ కాల్పులకు కారణమైన అధికారిని పోలీసులు అరెస్టు చేశారు. కాగా ఆస్ట్రేలియా పెర్త్‌కు సంబంధించిన బాధితులు పాకిస్థాన్‌లోని తమ బంధువులను కలవడానికి వచ్చారని ఆ సమయంలో కాల్పులు జరిగాయని పోలీసులు పేర్కొన్నారు. అయితే ఈ ఘటనపై ఆస్ట్రేలియ ప్రధాని ఆంటోనియా ఆల్బనీస్ విచారం వ్యక్తం చేశారు. దీనిపై పారదర్శకమైన విచారణ జరగాలని కోరారు. గాయపడిన వారికి ఆస్ట్రేలియా కాన్సులేట్ సహాయం అందిస్తున్నట్లు ఆస్ట్రేలియా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రకటించింది.

## అమెరికా–ఇరాన్ ఒప్పందంపై స్పందించిన మోదీ

**పశ్చిమాసియాలో నెలల తరబడి కొనసాగిన ఉద్రిక్తతలకు ముగింపు పలికే దిశగా అమెరికా–ఇరాన్ మధ్య అవగాహన కుదిరింది. ఇరు దేశాలు కాల్పుల విరమణ పాటిస్తూ.. శాంతి ఒప్పందం చేసుకోవాలని నిర్ణయించాయి. ఈ పరిణామాన్ని భారత ప్రధాని నరేంద్ర మోదీ స్వాగతించారు. ఈ మేరకు ఎక్స్ ఖాతాలో ఆయన ఓ పోస్ట్ చేశారు. ఇంకా ఆయన ఏమన్నారంటే..**

పశ్చిమాసియాలో జరిగిన ఈ సంక్షోభం ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక వ్యవస్థలపై ప్రభావం చూపిందని, అనేక దేశాల్లో ప్రాణనష్టం కూడా జరిగిందని పేర్కొన్నారు. ఈ ఒప్పందం అమలైతే ప్రాంతంలో శాంతి, స్థిరత్వం పునరుద్ధరించడమే కాకుండా ప్రపంచ వాణిజ్య మార్గాలకు ఊరట లభిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. "పశ్చిమాసియాలో జరిగిన ఘర్షణను ముగించేందుకు అమెరికా-ఇరాన్ మధ్య కుదిరిన అవగాహనను నేను స్వాగతిస్తున్నాను. ఇది ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అంతరాయాలను కలిగించింది, అనేక దేశాల్లో ప్రాణనష్టానికి కారణమైంది. ఈ ఒప్పందం అమలైతే ప్రాంతంలో శాంతి, స్థిరత్వం పునరుద్ధరించబడుతుంది. కీలక సముద్ర మార్గాల ద్వారా వాణిజ్యం సజావుగా కొనసాగుతుంది. ఈ అవగాహన అమలు పశ్చిమాసియాలో శాంతి, స్థిరత్వాన్ని తీసుకురావడమే కాకుండా వాణిజ్య నౌకా మార్గాల్లో స్వేచ్ఛాయుత రవాణాను నిర్ధారిస్తుందని మేము ఆశిస్తున్నాం అని ప్రధాని మోదీ తెలిపారు. మిగిలిన అంశాలపై.. అమెరికా-ఇరాన్ మధ్య జరిగే చర్చలు స్థిరమైన, దీర్ఘకాలిక ఒప్పందానికి దారితీయాలని కూడా మోదీ ఆకాంక్షించారు. ప్రస్తుతం మోదీ స్లోవేకియా పర్యటనలో ఉన్నారు. 1993 తర్వాత ఆ దేశంలో పర్యటిస్తున్న భారత ప్రధాని ఆయనే కావడం గమనార్హం. ఫ్రాన్స్ నుంచి అక్కడికి వెళ్లిన ఆయనకు.. వందేమాతరంతో ఘన స్వాగతం లభించింది.ఇక.. ఇరాన్‌అమెరికా డీల్‌కు సంబంధించి కొన్ని మీడియా సంస్థల నివేదికల ప్రకారం.. ఈ ఫ్రేమ్‌వర్క్‌లో కొన్ని కీలక అంశాలు ఉన్నాయి. హర్మూజ్ జలసంధి ద్వారా నౌకా రవాణా పునరుద్ధరణ, ఇరాన్ అణు కార్యక్రమంపై చర్చలు తిరిగి ప్రారంభం, తాత్కాలిక ఆంక్షల సడలింపు, అలాగే ఇరాన్‌కు నిలిచిపోయిన ఆస్తుల విడుదల వంటి అంశాలు ఇందులో భాగమని తెలుస్తోంది. హర్మూజ్ జలసంధి ప్రపంచ చమురు రవాణాలో కీలక మార్గం కావడంతో.. ఈ ఒప్పందం భారత్ వంటి దేశాలకు ప్రత్యేక ప్రాధాన్యం సంతరించుకుంది.



# లగాన్@25

బాలీవుడ్ బ్లాక్‌బస్టర్ 'లగాన్' సినిమా విడుదలై పాతికేళ్లు పూర్తయింది. ఆమిర్ ఖాన్, గ్రేసీ సింగ్, రెచల్ షెల్లీ, పాల్ బ్లాక్‌థోర్న్ ప్రధాన తారాగణంగా అశుతోష్ గోవారీకర్ దర్శకత్వం వహించిన ఈ హిస్టారికల్ స్పోర్ట్స్ డ్రామా 2001 జూన్ 15న విడుదలైంది. ఈ సినిమా రిలీజై పాతికేళ్లు పూర్తయిన సందర్భంగా ముంబైలో సిల్వర్ జూబ్లీ సెలబ్రేషన్స్ నిర్వహించారు ఆమిర్ ఖాన్. ఈ చిత్రంలో విలన్‌గా నటించిన హాలీవుడ్ నటుడు పాల్ బ్లాక్‌థోర్న్ ఈ వేడుకల్లో పాల్గొనేందుకు లండన్ నుంచి రావడం విశేషం.

''భారతీయ సినిమాపై, ఇక్కడి ప్రేక్షకులపై నాకు ఉన్న అమితమైన ప్రేమే పాతికేళ్ల తర్వాత కూడా నేను ముంబై రావడానికి కారణమయ్యాయి'' అని పాల్ పేర్కొన్నారు. ఇంకా ఈ వేడుకలకు ఆమిర్ ఖాన్ మాజీ భార్యలు రీనా దత్తా, కిరణ్ రావు, ఆమిర్ ఖాన్‌కు కాబోయే భార్యగా ప్రచారంలో ఉన్న గౌరీ స్ప్రాట్ సైతం హాజరయ్యారు. ఆమిర్ ఖాన్ కుమారుడు జునైద్, కుమార్తె ఐరా సందడి చేశారు. అలాగే ఈ వేడుకల్లో సల్మాన్ ఖాన్, కాజోల్, కరీనా కపూర్, జూహీ చావ్లా... ఇలా పలువురు బాలీవుడ్ స్టార్స్ పాల్గొన్నారు.

### రూ. 25 కోట్ల బడ్జెట్‌తో...

'లగాన్' సినిమా అప్పట్లో ఓ సంచలనం సృష్టించింది. దాదాపు రూ. 25 కోట్లతో రూపొందిన ఈ చిత్రం దాదాపు రూ. 70 కోట్లు వసూలు చేసింది. ఈ చిత్రానికి ఎనిమిది జాతీయ అవార్డులు లభించాయి. అలాగే ఉత్తమ విదేశీ చిత్రం విభాగంలో ఆస్కార్ నామినేషన్ సొంతం చేసుకున్న మూడో భారతీయ చిత్రంగా 'లగాన్' చరిత్ర సృష్టించింది. 'లగాన్' సినిమాకు ముందు 'మదర్ ఇండియా, సలామ్ బాంబే' సినిమాలు ఉత్తమ విదేశీ చిత్రం విభాగంలో నామినేషన్ సొంతం చేసుకున్నాయి. అలాగే ఈ సినిమా నిర్మాణానికి ఎవరూ ముందుకు రాకపోవడంతో ఆమిర్ ఖాన్ నిర్మించారు. ఆమిర్ ఖాన్ ప్రొడక్షన్స్ బేనర్‌పై ఆమిర్ నిర్మించిన తొలి సినిమా ఇదే.

### లగాన్ కథేంటంటే..

బ్రిటిష్ పాలనలో ఉన్న భారతదేశంలోని చంపానేర్ అనే గ్రామం నేపథ్యంలో 'లగాన్: వన్స్ అపాన్ ఏ టైమ్ ఇన్ ఇండియా' సాగుతుంది. 1893లో చంపానేర్‌లో తీవ్రమైన కరువు ఏర్పడంవల్ల ఆ గ్రామవాసులు బ్రిటిష్‌వారికి భూమి పన్ను చెల్లించలేకపోతారు. తమ గ్రామ రాజు పూరణ్ సింగ్‌ను పన్ను మాఫీ చేయాలని విజ్ఞప్తి చేస్తారు. అయితే బ్రిటిష్ సైన్యాధికారి ఆండ్రూ రస్సెల్ ఆ గ్రామ ప్రజలకు ఓ సవాల్ విసురుతాడు. బ్రిటిష్ క్రికెట్ జట్టుతో క్రికెట్ మ్యాచ్ ఆడి, చంపానేర్ క్రికెట్ టీమ్ గెలిస్తే పన్ను మాఫీ చేస్తానని చెబుతాడు. ఓడిపోతే మూడు రెట్లు అదనంగా పన్ను కట్టాల్సి ఉంటుందని కూడా షరతు విధిస్తాడు. ఆండ్రూ చేసిన ఈ సవాల్‌ను చంపానేర్ గ్రామవాసి యువకుడు భువన్ స్వీకరిస్తాడు. క్రికెట్ అంటేనే తెలియని భువన్ అండ్ టీమ్ బ్రిటిష్ జట్టుపై ఎలా విజయం సాధించింది? అన్నదే ఈ సినిమా ప్రధాన కథాంశం.

# రీల్ చేస్తూ డ్యాన్స్.. అంతలోనే ఏమైంది?

ప్రముఖ బుల్లితెర నటి సంచితా ఉగలే(30) బలవన్మరణానికి పాల్పడింది. బాలీవుడ్‌లో పలు సీరియల్స్‌లో నటించిన ఆమె ముంబయిలోని తన నివాసంలో జూన్ 14న ఆత్మహత్య చేసుకుంది. ఆమె చివరిసారిగా ఓ రీల్‌లో డ్యాన్స్ చేస్తూ కనిపించింది. అయితే ఆమె మరణానికి సంబంధించిన మరిన్ని వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. సంచితా హిందీలో పలు సీరియల్స్‌తో పాటు సినిమాల్లో కూడా నటించారు. 'కుంకుమ్ భాగ్య', 'సాజన్ ఘర్', 'దిల్వాలీ దుల్హా లే జాయేగీ'లో కనిపించారు. టీవీ ఇండస్ట్రీలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. 'కుంకుమ్ భాగ్య' సీరియల్‌లో దియా టాండన్ పాత్రకు ఫేమస్ అయ్యారు. అంతేకాకుండా 'వాగ్లే కి దునియా' సీరియల్‌లో రుచితా.. జైట్లీ పాత్రలో కనిపించింది. ఆ తర్వాత 'దిల్వాలీ దుల్హా లే జాయేగీ'లో సోరబ్ బేడీ సరసన సుకూన్ అనే ప్రధాన పాత్రను పోషించింది. విక్కీ కౌశల్ నటించిన 'ఛావా' మూవీలో ఆమె తారాబాయి పాత్రలో మెరిసింది.





## సీఎం విజయ్ విడాకుల కేసు..

# రెండోసారి కూడా..!





విజయ్ సీఎం కాకముందే తన భార్య సంగీతతో విడాకుల వివాదం మొదలైంది. మరో మహిళతో సన్నిహితంగా ఉంటున్నారని ఆరోపిస్తూ ఆయన భార్య సంగీత స్వర్ణలింగం డివోర్స్ పిటిషన్ దాఖలైంది. తమిళనాడు ఎన్నికల ముందే ఈ ఆసక్తికర పరిణామం చోటు చేసుకుంది. ప్రస్తుతం ఈ కేసును చెంగల్పట్టు మహిళా కోర్టు విచారిస్తోంది. తాజాగా సీఎం విజయ్, సంగీత విడాకులపై సోమవారం విచారణకు వచ్చింది. ఈ కేసును విచారించిన చెంగల్పట్టు మహిళా కోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ పిటిషన్ తదుపరి విచారణ ఆగస్టు 7వ తేదీకి వాయిదా వేసింది. ఈ కేసును మొదట ఏప్రిల్ 20న విచారణ చేపట్టగా.. అప్పట్లో విజయ్, సంగీత హాజరు కాలేదు. దీంతో జూన్ 15న హాజరు కావాలని చెంగల్పట్టు కుటుంబ న్యాయస్థానం వారిని ఆదేశించింది. ఇవాళ కూడా హాజరు కాకపోవడంతో మరోసారి వాయిదా వేసింది.

కాగా.. విజయ్, సంగీత 1999లో వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు. ఇప్పుడు తమ 27 ఏళ్ల వైవాహిక జీవితానికి ముగింపు పలికేందుకు సిద్ధమయ్యారు. ఈ ఏడాది జరిగిన తమిళనాడు ఎన్నికల్లో విజయ్ పార్టీ తమిళగ వెట్రి కజగం (టీవీకే) చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేసింది. దీంతో విజయ్ మే 10న తమిళనాడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు.

# ఆ విషయంలో మా ఇంట్లోవాళ్లే నన్ను ట్రోల్ చేశారు: సమంత



సమంత.. వైవిధ్యమైన సినిమాలతో తెలుగు ప్రేక్షకులను అలరిస్తూనే మరోవైపు నిర్మాతగాను రాణిస్తోంది. ఆమె హీరోయిన్‌గా నటిస్తూ నిర్మించిన తాజా చిత్రం 'మా ఇంటి బంగారం'. నందిని రెడ్డి దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఈ నెల 19న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో సినిమా ప్రమోషన్స్ కోసం వరుస ఇంటర్వ్యూలు ఇస్తున్నారు సమంత. ఈ సందర్భంగా తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన పలు ఆసక్తిర విషయాలను కూడా పంచుకుంటున్నారు. తాజాగా ఓ యూట్యూబ్ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో తన కోసం ఓ అభిమాని గుడి కట్టిన విషయం తెలిసిన తర్వాత ఏం జరిగిందో వివరించింది.

ఆంధ్రప్రదేశ్‌ని బాపట్లకు చెందిన ఓ వీరాభిమాని సమంత కోసం 2023లో ఓ గుడి కట్టిన విషయం తెలిసిందే. ప్రతి సంవత్సరం ఆమె పుట్టినరోజు నాడు ప్రత్యేక పూజలు నిర్వహించి,అన్నదానంతో పాటు ఇతర సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. అయితే గుడి కట్టారనే విషయం తెలిసి తాను కూడా షాకయ్యానంటోంది సమంత.

'గుడి కట్టించుకునేంత అర్హత నాకు లేదు. నేనేం స్పెషల్ కాదు. ఇంతమంది అభిమానుల ప్రేమను పొందే అదృష్టం ఆ దేవుడు నాకిచ్చాడు. అంతేకాని నేను అంత గొప్పదాన్ని ఏం కాదు. ఇలా గుడి కట్టడం కూడా నాకు నచ్చదు. అయితే ఆ అభిమానితో నేను మాట్లాడాను. నా ఆరోగ్యం బాగోలేనప్పుడు ఆయన ఆ గుడి కట్టి పూజలు చేశాడట. నేను త్వరగా కోలుకోవాలని కోరుకున్నాడట. ఈ విషయం తెలిసి చాలా హ్యాపీగా ఫీలయ్యా. అయితే గుడి కట్టిన విసఁం తెలిసిన తర్వాత మాత్రం మా ఇంట్లోవాళ్లు, చుట్టూ ఉన్న వాళ్లు నవ్వారు. నీకోసం గుడి కట్టారట అంటూ ఇంట్లో వాళ్లే ట్రోల్ చేశారు(నవ్వుతూ..)' అని సమంత చెప్పుకొచ్చింది.



# టాలీవుడ్ స్టార్ హీరోతోనే చేయనున్నారా?

పెద్ది డైరెక్టర్ బుచ్చిబాబు ప్రస్తుతం ఈ మూవీ సక్సెస్ ఎంజాయ్ చేస్తున్నారు. వరుస ఇంటర్వ్యూలతో తన ఆనందాన్ని పంచుకుంటున్నారు. పెద్ది కథకు కారణం గ్రామీణ క్రీడాకారులను బయటి తీసుకురావడమే తన ఉద్దేశమని తెలిపారు. ఈ విషయాన్ని మెగాస్టార్ చిరంజీవితో పంచుకున్నారు. రామ్ చరణ్‌తో సినిమా తీశా.. భవిష్యత్తులో మీరు కూడా అవకాశమిస్తే చేస్తానని చిరుతో బుచ్చిబాబు సరదాగా అన్నారు. అయితే పెద్ది హిట్ తర్వాత బుచ్చిబాబు ప్లాన్ నెక్స్ ఏంటనేది ఆసక్తిగా మారింది. ఇంతకీ తదుపరి ప్రాజెక్ట్ కోసం ఎలా ముందుకెళ్తున్నారన్న ఇంట్రెస్ట్ నెలకొంది. ఈ నేపథ్యంలోనే బుచ్చికి సంబంధించి ఓ టాక్ టాలీవుడ్‌లో నడుస్తోంది. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన సక్సెస్ ఈవెంట్‌లో మహేశ్‌బాబుతో నెక్స్ సినిమా చేస్తున్నారా? అని కొందరు ప్రశ్నించారు. కానీ దీనికి బుచ్చిబాబు రియాక్ట్ కాలేదు. ఎలాంటి కామెంట్స్ చేయలేదు.


మహేశ్ బాబుతో పౌరాణిక చిత్రం ఏదైనా ప్లాన్ చేస్తున్నారా అని బుచ్చిబాబును మరోసారి అడిగారు. దీనికి స్పందిస్తూ సరైన సమయం కోసం వేచి చూద్దాం. పెద్దలు ఇక్కడ ఉన్నారు. కాలమే ఏదైనా నిర్ణయిస్తుందని హింట్ ఇచ్చారు. దీంతో తన నెక్స్ ప్రాజెక్ట్ మహేశ్‌బాబుతోనే అని టాలీవుడ్ ఫ్యాన్స్ భావిస్తున్నారు. ఈ అరుదైన కాంబోపై అభిమానులలో మరింత ఆసక్తి పెరిగింది. అయితే ప్రస్తుతానికి ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. కాగా.. మహేష్ బాబు ప్రస్తుతం ఎస్.ఎస్. రాజమౌళి దర్శకత్వంలో నటిస్తున్నారు. వీరిద్దరి కాంబోలో 'వారణాసి' మూవీ రానుంది.ఈ ప్రతిష్టాత్మక గ్లోబల్ యాక్షన్ అడ్వెంచర్ వచ్చే ఏడాది ఏప్రిల్ 7న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. ఈ చిత్రంలో ప్రియాంక చోప్రా జోనస్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. అయితే రాజమౌళి సినిమా తర్వాత మహేష్ తన తదుపరి ప్రాజెక్ట్‌ను ఇంకా ప్రకటించలేదు. కానీ ఇండస్ట్రీలో మాత్రం సందీప్ రెడ్డి వంగా, సుకుమార్ లాంటి దర్శకుల పేర్లు తరచుగా వినిస్తున్నాయి. తాజాగా ఇప్పుడు ఆ జాబితాలో బుచ్చి బాబు కూడా చేరారు. మరి ఎవరికీ ఓకే చెబుతాజో మరికొన్ని రోజులు వేచి చూడాల్సిందే.

# నా కెరీర్ క్లోజ్ అనుకున్నా..



అలా వైకుంఠపురములో, బ్రోచేవారెవరురా, పాగల్, రెడ్ లాంటి టాలీవుడ్ సినిమాల్లో అలరించిన బ్యూటీ నివేదా పేతురాజ్. 2023లో విశ్వక్ సేన్ హీరోగా వచ్చిన దాస్ కా ధమ్కీలో కనిపించింది. దాదాపు మూడేళ్ల గ్యాప్ తర్వాత వెండితెరపై మెరిసింది. ఇటీవలే థియేటర్లలో విడుదలైన సింగ్ గీతంలో మెరిసింది. తాజాగా ఈ మూవీ సక్సెస్ మీట్ హైదరాబాద్‌లో గ్రాండ్‌గా నిర్వహించారు. ఈ ఈవెంట్‌కు హాజరైన హీరోయిన్ నివేదా పేతురాజ్ ఆసక్తికర కామెంట్స్ చేసింది. తన కెరీర్ ఇక ముగిసిపోయిందేమో అనుకున్నానని తెలిపింది. 2023లో సినిమాలు మానేయాలని నిర్ణయించుకున్నానని వెల్లడించింది. ఆ తర్వాత నుంచి తన ప్లాన్ అంతా రాంగ్ రూట్‌లోనే వెళ్లిందని చెప్పుకొచ్చింది.

దాదాపు మూడేళ్ల గ్యాప్ తర్వాత సింగ్ గీతంతో మళ్లీ రీ ఎంట్రీ ఇచ్చానని ఆనందం వ్యక్తం చేసింది. కానీ నాగ్ అశ్విన్ తనకు మళ్లీ లైఫ్ ఇచ్చారని ఆనందం వ్యక్తం చేసింది. లేదంటే ఇప్పటికే హిమాలయాల్లో ఉండేదాన్నేమోనని కామెంట్స్ చేసింది. కాగా.. ఇటీవల రిలీజైన సింగ్ గీతం మూవీకి 94 ఏళ్ల వయసులో సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వం వహించగా.. నాగ్ అశ్విని నిర్మించారు.



# రెమ్యునరేషన్ డబుల్?

సౌత్ సినీ ఇండస్ట్రీలో రెండు దశాబ్దాలకు పైగా తన స్టార్‌డమ్‌ను నిలబెట్టుకున్న హీరోయిన్ త్రిష మరోసారి వార్తల్లో నిలిచారు. ప్రస్తుతం ఆమె రెమ్యూనరేషన్‌కు సంబంధించిన వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. వరుస విజయాలతో కెరీర్‌లో మళ్లీ స్ట్రాంగ్ అయిన త్రిష, కొత్త సినిమాల కోసం తన పారితోషికాన్ని పెంచినట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. త్రిష కెరీర్‌ను పరిశీలిస్తే ఎన్నో విజయాలతో పాటు కొన్ని పరాజయాలు కూడా ఎదురయ్యాయి. అయితే ప్రతిసారి చిన్న విరామం తర్వాత ఆమె మరింత బలంగా తిరిగి వచ్చి తన స్థానాన్ని నిలబెట్టుకున్నారు. ఇదే కారణంగా ఆమెను సౌత్ ఇండస్ట్రీలో అత్యంత నిలకడైన హీరోయిన్లలో ఒకరిగా భావిస్తారు. ఇటీవల కొన్ని సినిమాలు ఆశించిన స్థాయిలో విజయాలు సాధించకపోయినా, తాజాగా కరుప్పు వంటి భారీ హిట్‌తో త్రిష మార్కెట్ మళ్లీ ఊపందుకుందని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం ఆమె కెరీర్‌లో మరో గోల్డెన్ ఫేజ్ నడుస్తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ముఖ్యంగా పెద్ద హీరోల సరసన అవకాశాలు రావడం, పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు పెరగడం, ప్రేక్షకుల్లో ఇప్పటికీ మంచి ఆదరణ ఉండటం ఆమె క్రేజ్‌కు ప్రధాన కారణాలుగా చెప్పొచ్చు. యువ హీరోయిన్ల నుంచి గట్టి పోటీ ఉన్నప్పటికీ, తన అనుభవం, నటన, స్క్రీన్ ప్రెజెన్స్‌తో త్రిష ప్రత్యేక స్థానాన్ని కొనసాగిస్తున్నారు. అందుకే నిర్మాతలు ఇప్పటికీ ఆమెను తమ ప్రాజెక్టుల్లో భాగం చేసుకోవడానికి ఆసక్తి చూపుతున్నారని సమాచారం. ఇటీవల విడుదలైన కరుప్పు చిత్రం విజయంతో త్రిషకు కొత్త అవకాశాలు మరింత పెరిగినట్లు టాక్ వినిపిస్తోంది. ముఖ్యంగా తెలుగు, తమిళ భాషల్లో ఒకేసారి రూపొందే ద్విభాషా చిత్రాల కోసం ఆమెను సంప్రదిస్తున్నట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే త్రిష తన రెమ్యూనరేషన్‌ను కూడా పెంచినట్లు వార్తలు వెలువడుతున్నాయి. కొన్ని నివేదికల ప్రకారం, తాజాగా ఒక బైలింగ్వల్ ప్రాజెక్ట్ కోసం త్రిష భారీ మొత్తాన్ని డిమాండ్ చేసినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఈ విషయంపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక సమాచారం బయటకు రాలేదు. త్రిష లేదా నిర్మాతల తరపున కూడా ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. మరోవైపు త్రిష చేతిలో ఇప్పటికే పలు ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులు ఉన్నాయి. తెలుగు, తమిళంతో పాటు ఇతర దక్షిణాది భాషల నుంచి కూడా అవకాశాలు వస్తున్నాయి.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com